PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 158 | విజయవాడ, ఆదివారం 8 జనవరి 2023 | 8 +8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 8 January 2023 | Rs

ఉన్నత విద్యా రంగాన్ని దెబ్బ తీసే చర్యలు

- విదేశీ విద్యపై యుజిసి చర్యల పట్ల సిపిఎం ఖండన

లోపలి పేజీలో..



'సూర్య' ప్రతాపం

- 51బంతుల్లో 112పరుగులు
- శ్రీలంకపై 91పరుగుల తేడాతో భారత్ గెలుపు
- టి20 సిరీస్ 2-1తో కైవసం

లోపలి పేజీలో..

సచివాలయాల తనిఖీలకు ఫ్లయింగ్ స్క్వాడ్స్



- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- చిత్తూరు జిల్లాలో అమలులోకి
- త్వరలో మిగిలిన జిల్లాలోనూ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాలను తనిఖీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ స్క్వాడ్‌లు అకస్మిక తనిఖీలు చేసి సిబ్బంది పనితీరు, హాజరు వంటి చర్యలను పరిశీలిస్తాయిన, అవసరమైతే అక్కడికక్కడే చర్యలు కూడా తీసుకుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాలో ఇప్పటికే ఈ దిశలో బృందాలను ఏర్పాటు చేశారు. మిగిలిన జిల్లాల్లో కూడా ఒకటి, రెండు రోజుల్లోనే ఈ దిశలో చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. గామ వార్డు సచివాలయాల వ్యవస్థను పటిష్టపరచాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఈ టీమ్‌లను ఏర్పాటు చేయాలని వివిధ జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వుల్లో సూచించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నోటిపికేషన్ ప్రకారం ఆ జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి డివిజన్లకు వేర్వేరుగా ఒక్కో డివిజన్‌కు నలుగురు అధికారుల చొప్పున టీములు వేశారు. గ్రామ వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరు, గైర్హాజరు, పని వేళల్లో ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్‌లను నిశితంగా పరిశీలించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ మానిటరింగ్ బాధ్యతలను జిల్లా రెవెన్యూ ఆఫీసరు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు నిర్వహించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిబ్బందికి సంబందించి వీక్లీ రివ్యూలు కూడా నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 6న విజయవాడలో జరిగిన కోస్తాంధ్ర రెవెన్యూ అధికారుల జోనల్ సమావేశంలో రెవెన్యూ అధికారులు నెలకు రెండు రోజులు గ్రామ వార్డు సచివాలయాలకు తనిఖీకి వెళ్లాలని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డిఓ, తహసీల్దార్లను సిసిఎల్‌ఎ ఆదేశించారు. తనిఖీల సందర్భంలో రెవెన్యూకు సంబంధించి రైతుల వద్ద నుంచి మ్యుటేషన్ కోసం ఎన్ని దరకాస్తులు వచ్చాయి? ఎన్ని అప్రూవల్ చేశారు? ఎన్ని పెండింగ్ ఉన్నాయి? అందుకు కారణాలేమిటి? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని సిసిఎల్‌ఎ సూచించారు. తాజాగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో రెవిన్యూ అధికారులు విడిగా తనిఖీ చేస్తారా, ఫ్లయింగ్ స్క్వాడ్‌లలో సభ్యులుగా ఉంటారా అన్న విషయంపై చర్చ జరుగుతోంది.

పనితీరుకు వెయిటేజీ

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జాబ్‌చార్టు అమలు, ఉద్యోగుల పనితీరును నెల మొత్తం అంచనా వేసేందుకు ప్రభుత్వం ఉద్యోగుల సర్వీస్‌కు సంబందించి వెయిటేజీ పర్సెంటేజీ ని లెక్క వేస్తోంది. నెలలో మొత్తం పనితీరుకు 100 శాతం మార్కుల తరహాలో వెయిటేజీ ని ప్రకటించారు. ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాసినట్లు తెలిసింది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ నెలలో ఎన్ని రోజులు హాజరయ్యారనే అంశానికి ఎపి సిఎం ఎంఎస్ యాప్ ద్వారా గుర్తించి వారికి 5 శాతం వెయిటేజీ, సర్వీస్ రిక్వెస్ట్‌కు సంబందించి మ్యుటేషన్, సబ్ డివిజన్ లాంటి వాటికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని స్వీకరించామని సిడిఎంఎ ఇఆర్‌పి ద్వారా సమాచారాన్ని సేకరించి 15 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు (ప్రయివేటు ప్రాపర్టీ) డిమాండ్, కలెక్షన్‌లను సిడిఎంఎ ఇఆర్‌పి యాప్ ద్వారా పరిశీలించి వారికి 30శాతం వెయిటేజీ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుంది.

మహిళా పోలీసులకు బహు బాధ్యతలు

- జాబ్‌ఛార్ట్ సిద్ధం
- సబ్‌ఇన్‌స్పెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సచివాలయాల్లోని మహిళా పోలీస్ సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం భారీ బాధ్యతలు పెడుతోంది. ఈ మేరకు వారికి జాబ్ ఛార్ట్ కూడా సిద్ధం చేసింది. ఈ విధులు నిర్వహించే వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసుపై వారి పరిధిలోని సబ్‌ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణాధికారులుగా ఉంటారు. వారు ప్రతి నెలా మహిళా పోలీసుల పనితీరుపై కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్లను తయారుచేస్తారు. జాబ్‌ఛార్ట్ ప్రకారం మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి నేరాలపైనా మహిళా పోలీసులు దృష్టి సారించాల్సి ఉంటుంది. అక్రమమద్యం రవాణా, బాలికలు, మహిళలపై వేధింపులు, గల్ఫ్ దేశాలను వెళ్లే మహిళలు, వారిని తీసుకువెళ్లే సంస్థలు, వ్యభిచార ఊబిలోకి దింపుతున్న ఘటనలపైనా నిఘా పెట్టాల్సి ఉంటుంది. అలాగే స్థానికంగా తప్పిపోయిన బాలికలు, యువతుల వివరాలు కూడా సేకరించాలి. వీటితోపాటు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి, ఇతర నేరాలకు పాల్పడే వారి వివరాలను కూడా ఎప్పటికప్పుడు సేకరించాలి. ఇవి కాకుండా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాల బాధ్యతలు కూడా అప్పగించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సైబర్ నేరాలు, రుణ యాప్‌లు, బ్యాంకు ఫ్రాడ్‌లు, వరకట్న నిషేధం, లైంగిక వేధింపులు, పోస్కో చట్టం, లోక్ అదాలత్ వినియోగంతోపాటు దిశ చట్టం, దిశ యాప్‌ల డౌన్‌లోడ్ వంటి అంశాలపై ప్రజలను మహిళా పోలీసులు చైతన్య పరచాలి. ప్రేమించి మోసం చేసే వివరాలు సేకరించడం, సోషల్ మీడియా నేరాలు, రోడ్ సేఫ్టీ బాధ్యతలు కూడా అప్పగించారు. తమకు అప్పగించిన విధులకు సంబంధించి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు వీరు రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. వీటికి సంబంధించి పనితీరు సూచికలపై నమూనాలను కూడా సిద్ధం చేశారు. వాటిని స్థానిక ఎస్సై తయారుచేయాల్సి ఉంటుంది.

తొక్కిసలాట ఘటనలపై విచారణ కమిషన్

- జస్టిస్ బి.శేష శయనరెడ్డి నేతృత్వంలో ఏర్పాటు
- నెలరోజుల్లో నివేదిక
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



కందుకూరు, గుంటూరులలో జరిగిన తొక్కసలాట ఘటనలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపేందుకు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.శేష శయన రెడి నేతృత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటైంది. ఈ మేరకు శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

నెల్లూరు జిల్లా కందుకూరులో చంద్రబాబు నాయుడు నిర్వహించిన సభలో జరిగిన తొక్కసలాటలో ఎనిమది మంది, గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ నిర్వహించిన చంద్రన్న కానుక పంపిణీ కార్యక్రమంలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ రెండు సంఘటనలను సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విచారణ కమిషన్‌ను నియమించింది. తొక్కిసలాటకు దారి తీసిన కారణాలు, దానికి బాధ్యులెవరన్న అంశాలను పరిశీలించాలని కమిషన్‌కు ప్రభుత్వం నిర్ధేశించింది. ఏర్పాట్లలో ఏమైనా అవకతవకలు జరిగాయా, ఇచ్చిన అనుమతులను ఉల్లంఘించారా అన్న అంశాలను కూడా కమిషన్ పరిశీలించనుంది. ఒక వేళ అలా జరిగిఉంటే దానికి బాధ్యులను కూడా కమిషన్ గుర్తించాల్సిఉంది. భవిష్యత్తులో ఈ తరహా తోపులాట సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిషన్ నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులలో పేర్కొంది. బాధ్యతలు స్వీకరించిన నెలరోజుల్లో పరిశీలన పూర్తిచేసి నివేదికను అందచేయాలని కూడా ప్రభుత్వం నిర్ధేశించింది.

హైకోర్టులో పిల్ ...

అంతకుముందు ఈ ఘటనలపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. సీనియర్ జర్నలిస్ట్ కొట్టి బాలగంగాధర్ తిలక్ వేసిన పిల్‌ను అత్యవసరంగా విచారణ చేయాలని ఆయన లాయర్ కొవ్వూరి వీఆర్ రెడ్డి హైకోర్టును కోరారు. అయితే, సంక్రాంతి సెలవుల తర్వాత విచారణ జరుపుతామని జస్టిస్ శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. పిల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెూంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీలను ప్రతివాదులుగా చేశారు. రాజకీయ పార్టీలు చేపట్టే రోడ్‌షోలు, బహిరంగ సభలను పోలీసులు సక్రమంగా నియంత్రణ చేయలేకపోతున్నారని, ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవడం లేదని పిల్‌లో పేర్కొన్నారు.



సిజెఐ జస్టిస్ చంద్రచూడ్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు

లోపలి పేజీలో..



మహాసభ వేదికపై పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సుభాషిణి అలీ, కెకె శైలజ, శ్రీమతి టీచర్ తదితరులు

పోరాటాలు మరింత ఉధృతం

- ఐద్వా మహాసభలో నేతల పిలుపు
- రెండవరోజు ప్రారంభమైన చర్చలు

ఎం.సి. జోసఫిన్ నగర్ (తిరువనంతపురం) నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిది

హింస, అణచివేతలకు వ్యతిరేకంగా సమానత్వ సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహాసభ రెండవరోజైన శనివారం ప్రసంగించిన వక్తలు పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చిన ప్రతినిధుల పాటలు, నృత్యాలతో శనివారం మహాసభ ప్రారంభమైంది. అనంతరం ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం థావలే ఉద్యమ నివేదికను ప్రవేశపెట్టారు. జాతీయ, అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న వివిధ పరిణామలను, మహిళా పోరాటాలను ఈ నివేదికలో ఆమె వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల హక్కులను హరించివేస్తోందని, పెద్ద ఎత్తున అణచివేతకు పాల్పడుతోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటా లను చేపట్టాలన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికపై ఉత్సాహపూరిత వాతావరణంలో చర్చలు జరిపారు. 35 మంది తమ అభిప్రాయాలను వివరించారు.

కేంద్రం చెప్పినట్టే రాష్ట్రంలో పాలన

- అదానీకి 75 వేల ఎకరాలు కట్టబెట్టిన వైసిపి
- ప్రజల గొంతు నొక్కడానికే జిఒ-1
- స్టీల్‌ప్లాంట్‌పై అఖిలపక్షాన్ని సిఎం ఢిల్లీకి తీసుకెళ్లాలి: శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రజలు బిజెపికి ఓట్లేయకపోయినా కేంద్రంలోని మోడీ చెప్పినట్లే రాష్ట్రంలో జగన్ పాలన చేస్తున్నాడని, 75 వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టాడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. విశాఖలోని జగదాంబ సమీపంలోగల సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 ప్రకారం గ్రామసభ అనుమతి లేకుండా భూముల బదలాయింపు చేయకూడదన్నారు. దీనికి భిన్నంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అదానీకి చెందిన సంస్థకు హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చి, ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించాలని చూడడం తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘనని చెప్పారు. విశాఖ నగరంలోని మధురవాడలో అదానీ డేటా సెంటర్ పేరుతో రూ.వేల కోట్లు విలువైన 400 ఎకరాల భూమిని కేవలం రూ.130 కోట్లకే అదానీకి ధారాదత్తం చేయడం, గంగవరం పోర్టులోని ప్రభుత్వ వాటాను ఎలాంటి బిడ్డింగూ లేకుండా బదలాయించడం వంటి అంశాలను శ్రీనివాసరావు తప్పుబట్టారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఎపి జెన్‌కోను కూడా అదానీకి అప్పగిస్తున్నారని అన్నారు. దోచుకోవాలని చూస్తోన్న హిందూజా సంస్థకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. హిందూజా యాజమాన్యం తన లాభాల కోసం ఎక్కువ మొత్తానికి కొనాలని ప్రభుత్వాన్ని కోరగా, ప్రభుత్వ ఖజానాకు కన్నం పడుతుందని తెలిసి కూడా జగన్ ఎలా న్యాయ సలహాకు వెళతారని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధికి, వికేంద్రీకరణకు ఎలాంటి సంబంధమూ లేదని, నిజంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలంటే సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులివ్వాలని, గిరిజన యూనివర్సిటీ కావాలని, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా కార్మికవర్గం, ప్రజానీకం రెండేళ్లుగా ఉద్యమం చేస్తోన్నా దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీకెళ్లి ప్రధాని మోడీతో నేరుగా మాట్లాడలేదన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని వైసిపి పెద్దలు చెప్పి ఇంతవరకూ తీసుకెళ్లలేదని, ఇప్పటికైనా తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. పోస్కో పేరును ముందుకు తీసుకొచ్చి అదానీ ఈ ప్లాంట్‌ను కాజేయాలని చూస్తున్నాడని తెలిపారు. ప్రజల్లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై వ్యతిరేకత తీవ్రంగా ఉందనేది జగన్ ప్రభుత్వం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిద న్నారు. రాష్ట్రంలో త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లతో వైసిపి అభ్యర్థులు గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎక్కడికక్కడే నకిలీ, దొంగ ఓట్లు వివరాలు వెల్లడవుతున్నాయని, విద్యావంతులంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రాష్ట్రంలో కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరాగా చేసుకుని సభలు, ధర్నాలు, రోడ్ షోలు పెట్టనివ్వకుండా జగన్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధించాలనుకోవడం సరైన విధానం కాదని శ్రీనివాసరావు తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాన్ని జగన్ సర్కారు జిఒ నెంబరు 1 పేరుతో తేవడం ప్రజల గొంతు నొక్కడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. 1860 నాటి ఈ చట్టాన్ని 1996లోనే సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి జగన్ సర్కారు తెలుసుకోవాలన్నారు. దీనిపై త్వరలో విజయవాడలో పౌర హక్కుల సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ నిర్వహిస్తామని, త్వరలో భవిష్యత్తు కార్యాచరణ సమావేశాలు జరగనున్నాయని, సిపిఎం వీటికి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

కనుమ రోజూ సెలవే

- 12 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాఠశాలలకు ఈ నెల 12 నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. కనుమ రోజుతో కలిపి మొత్తం ఏడు రోజులు సెలవులుంటాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఎస్‌సిఇఆర్‌టి విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 11 నుంచి 16 వరకు (6 రోజులు) సంక్రాంతి సెలవులుగా ప్రకటించారు. అయితే రాష్ట్రంలో 17వ తేదీన కనుమ కావడంతో ఆ రోజు కూడా సెలవు మంజూరు చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఉపాధ్యాయ సంఘాలు వినతిపత్రాలు అందించాయి. దీంతో కనుమతో కలిపి ఈ నెల 12 నుంచి 18వ తేది వరకు (7 రోజులు) సెలవులుగా ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా ఇచ్చిన కనుమ రోజు సెలవును మరో సెలవు రోజులో పాఠశాల నిర్వహించి భర్తీ చేయాలని పేర్కొంది.

రాజ్యాంగ విలువల నిర్వీర్యం

- ఫాసిస్ట్ హిందూ రాజ్యాన్ని సృష్టించే ప్రయత్నం
- ఐలు సదస్సులో జస్టిస్ గోపాల గౌడ



సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ గోపాల గౌడ


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో మతోన్మాద హిందూ శక్తులు అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో ఫెడరలిజంతో సహా రాజ్యాంగ ప్రాథమిక విలువలు నిర్వీర్యం చేశారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ విమర్శించారు. ఫాసిస్ట్ హిందూ రాజ్యాన్ని సృష్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. సెక్యులర్ డెమోక్రటిక్ రిపబ్లిక్ భావనకు తీవ్ర ముప్పు పొంచి ఉందని చెప్పారు. శనివారం నాడిక్కడ ఇండియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్నేషనల్ లాలోని వికె కృష్ణ మీనన్ భవన్‌లో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు), ఢిల్లీ జర్నలిస్ట్ యూనియన్ (డియుజె), డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ (డిటిఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన "రాజ్యాంగం పరిరక్షణ - ప్రజాస్వామ్యం పరిరక్షణ" జాతీయ సదస్సును జస్టిస్ గోపాలగౌడ ప్రారంభించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలుగా కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు నిర్వచించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావనలు ప్రస్తుతం తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయని అన్నారు. మతపరమైన మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులు కూడా భయంతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, కోవిడ్ కాలంలో దేశంలో డాలర్ మిలియనీర్ల సంఖ్య బాగా పెరిగిందని తెలిపారు. గవర్నర్లు కేంద్రం చేతిలో సాధనాలుగా మారారని, ఫెడరలిజాన్ని తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కొలీజియం వ్యవస్థను నాశనం చేయడమే కేంద్రం ప్రయత్నమని అన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా లేదని, దేశంలో స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలను చూడలేమని జస్టిస్ గౌడ అన్నారు. ఇటీవల జరిగిన గుజరాత్, యుపి, బీహార్ ఎన్నికలు తటస్థంగా ఉన్నాయని చెప్పలేమన్నారు. ఎన్నికల కమిషన్, సిబిఐతో సహా అన్ని రాజ్యాంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి సాధనాలుగా మారాయని విమర్శించారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు

దేశంలో పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారని, హత్రాస్ ఘటనను నివేదించేందుకు వెళ్లిన మలయాళీ జర్నలిస్టు సిద్ధిక్ కప్పన్‌కు అన్యాయం జరిగిందని గౌడ అన్నారు. బాంబే హైకోర్టులో బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, బిజెపి మద్దతుదారు అర్నాబ్ గోస్వామికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. తొలుత సిద్ధిక్ కప్పన్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా అలహాబాద్ హైకోర్టుకు వెళ్లమని చెప్పిందని జస్టిస్ గౌడ గుర్తు

మిగతా 7లో



అమెరికా స్పీకర్‌గా కెవిన్

- ఎట్టకేలకు ఎన్నిక

వాషింగ్టన్ : ఎట్టకేలకు రిపబ్లికన్ నేత కెవిన్ మెక్ కార్తీ అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా శనివారం తెల్లవారుజామున ఎన్నికయ్యారు. స్పీకర్‌గా 14 సార్లు ఓటమి పాలైన ఆయన 15వ సారి పోటీ చేసి విజయం సాధించారు. స్పీకర్ ఎన్నికల్లో ఇంత సుదీర్ఘంగా ప్రతిష్టంభన సాగడం 160 ఏళ్లకు పైగా సాగిన సభా చరిత్రలో ఎన్నడూ లేదు. కెవిన్‌ను సొంత పార్టీ సభ్యులే అడ్డుకుంటూ వుండడంతో వారం రోజులుగా సభలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త కాంగ్రెస్‌లో పాలసీ ఎజెండాలో తమ డిమాండ్లన్నింటినీ కెవిన్ అంగీకరించే వరకు ఓటు వేసేది లేదంటూ రిపబ్లికన్ పార్టీలోని మితవాద ఫ్రీడమ్ కాకస్ సభ్యులు తిరస్కరిస్తూ వచ్చారు. ఎట్టకేలకు కెవిన్ తన సహచరుల్లో చాలామందిని ఒప్పించగలగడంతో ఆయనకు ఈ పదవికి ఎన్నికయ్యారు.

బీహార్‌లో కులగణన ప్రారంభం

5.24 లక్షల మంది సర్వేయర్ల నియామకం



పాట్నా : బీహార్‌లో కులాల వారీగా జన గణన సర్వే తొలి దశ శనివారం ప్రారంభమైంది. కుటుంబాల ఆర్థిక హోదాను కూడా నమోదు చేయనున్న ఈ సర్వేలో రాష్ట్రంలోని 38 జిల్లాల్లో 12.70 కోట్ల జనాభా సామాజిక, ఆర్థిక వివరాల డేటా రూపొందుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సర్వేతో రాష్ట్రంలోని కులాలు, కమ్యూనిటీల పరంగా సవివరమైన రికార్డు వుంటుందని, అది వారి అభివృద్ధికి దోహదపడు తుందని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చెప్పారు. సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన వర్గాలు, గ్రూపులకు సంక్షేమ పథకాలను మరింత మెరుగైన రీతిలో అమలు చేయడానికి ఈ సర్వే నివేదిక సాయపడుతుందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు దీనివల్ల ప్రయోజన ముంటుందని చెప్పారు. ప్రజలకు ఏమి అవసరం, మనం ఇంకా ఏం చేయాలి అనేది తెలుసుకోవడానికి వారి ఆర్థిక హోదా వివరాలు నమోదు చేయడం ముఖ్యమని అన్నారు. 5.24 లక్షల మంది సర్వేయర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వీరిలో టీచర్లు, వ్యవసాయ కో-ఆర్డినేటర్లు, ఆశా వర్కర్లు, ఇతర ప్రభుత్వ పథకాల్లోని సిబ్బంది ప్రధానంగా వుంటారు.

చారిత్రాత్మక చర్య : తేజస్వి యాదవ్

కులాల సర్వేను చారిత్రాత్మక చర్యగా డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ వ్యాఖ్యానిం చారు. ఈ సర్వేతో శాస్త్రీయపరమైన డేటా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పేదల వ్యతిరేక పార్టీ అయిన బిజెపి ఈ సర్వేను వ్యతిరేకిస్తోందని విమర్శించారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనర్హుల ఓట్లను తొలగించండి

ప్రజాశక్తి-నెల్లూరు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల రూపొందించిన ఓటర్ల జాబితాలో అనర్హులైన వారిని తొలగించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని నెల్లూరు డిఆర్‌ఒ నారాయణమ్మకు సిపిఎం, సిపిఐ జిల్లా కమిటీలు వినతిపత్రం అందజేశాయి. నెల్లూరు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన అఖిల పక్ష రాజకీయ పార్టీల సమావేశంలో సిపిఎం ఎమ్మెల్సీ పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ.. డ్రాఫ్ట్ లిస్టులోని అనర్హులైన ఓట్లపై అభ్యంతరాలను రాతపూర్వకంగా అధికారులకు తెలియజేశామని తెలిపారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అధికార పార్టీ అనేక అక్రమాలకు పాల్పడిందని, రెండవ విడతలో సైతం అనర్హులైన అనేక మందిని ఓటర్లుగా నమోదు చేశారన్నారు. జిల్లా అధికారులు వెరిఫికేషన్ చేపట్టి అనర్హులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్ .నగేష్ ,సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు సిరాజ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

జిఓలో లేని దానిని ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పార్టీలపై అనర్హత వేటు వేయాలని, జిఓ నెంబరు 1 చదవకుండానే విమర్శలు చేయడం సరికాదని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిఓలో లేనిదానిని ఉన్నట్లు ప్రచారం చేసి యాగీ చేస్తున్నారని వివరించారు. టిడిపి, ఇతర ప్రతిపక్షాలు అబద్దాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. టిడిపి కార్యక్రమాలు చేయలేననుకుంటే చంద్రబాబు హైదరాబాద్ వెళ్లి ఇంట్లో కూర్చోవాలని, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని అన్నారు.

బాలకృష్ణ చాపర్ అత్యవసర ల్యాండింగ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

వాతావరణం అనుకూలించక సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రయాణించే చాపర్ శనివారం అత్యవసరంగా ల్యాండింగ్ అయ్యింది. 'వీరసింహారెడ్డి' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌ను నుంచి చాపర్‌లో ఆయన ఒంగోలుకు వచ్చారు.

తిరిగి శనివారం ఉదయం పది గంటలకు ఒంగోలు పిటిసి మైదానం నుంచి బయలుదేరారు. అయితే బయలుదేరిన 20 నిమిషాల తర్వాత వాతావరణం అనుకూలించకపోవడంతో చాపర్‌కు సిగ్నల్ అందలేదు. బయలుదేరిన చోటే దిగాలని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు సూచించడంతో తిరిగి పిటిసి మైదానంలోనే ల్యాండింగ్ చేశారు. చాపర్‌లో ఎటువంటి సాంకేతిక లోపం లేదని, వాతవరణం అనుకూలించకపోవడంతోనే అత్యవసర ల్యాండింగ్ అయ్యామని పైలెట్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి క్లియరెన్స్ రావడంతో తిరిగి హైదరాబాద్‌కు చాపర్‌లో బాలకృష్ణ చేరుకున్నారు.

నేడు ఎయులో 'వాల్తేరు వీరయ్య' ప్రీ రిలీజ్ వేడుక

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా ప్రీ రిలీజ్ వేడుకలను ఎట్టకేలకు పోలీసులు అనుమతి ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించడానికి పోలీసులు అనుమతులు మంజూరు చేయడంతో అనుమానాలకు, వదంతులకు తెరపడింది. మొదట ఈవెంట్‌కు విశాఖలోని ఆర్కే బీచ్‌లో అనుమతులు కోరినప్పటికీ ఆదివారం కావడం, వాహనాల రద్దీ, సందర్శకులు తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున మరొక ప్రత్యామ్నాయం చూసుకోవాలని నిర్వాహకులకు పోలీసులు సూచించారు. ఈ క్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించేందుకు షరతులతో కూడిన అనుమతిని వైజాగ్ ఈస్ట్ ఎసిపి డివిఎస్‌వై.మూర్తి మంజూరు చేశారు.

లేబర్ కోడ్‌లతో ప్రమాదం

- పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే కార్మిక చట్టాల్లో మార్పులు
- ఐక్యపోరాటాలతోనే వీటికి అడ్డుకట్ట
- 'ప్రజాశక్తి'తో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె హేమలత



ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

కార్మిక చట్టాల స్థానే తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను హరిస్తాయని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలు సవరించిందని విమర్శించారు. ఐక్య పోరాటాలతోనే వీటికి అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు, ఇతర వృత్తుల్లో పని చేసేవారు పెద్ద ఎత్తున పెరుగుతున్నారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, వీరంతా కలిసి పోరాటాలను తీవ్రతరం చేస్తేనే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టగలమని అన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, హక్కుల కోసం పోరాటాలు జరుగుతున్నప్పటికీ రోజువారీ సమస్యలకు ప్రభుత్వ విధానాలు ఏ విధంగా కారణమో క్షేత్రస్థాయిలో ప్రతి కార్మికునికీ వివరించడమే లక్ష్యంగా సిఐటియు ముందుకు సాగుతోందని తెలిపారు. భీమవరంలో జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు విచ్చేసిన ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే... కరోనాతో ఎంతోమంది ఉద్యోగాలు, ఆదాయాలు కోల్పోయారు. అయినా, ప్రభుత్వం ప్రస్తుతం ప్రజావ్యతిరేక సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తోంది. రైల్వే, బ్యాంక్, బీమా కంపెనీలను ప్రయివేటీకరించేందుకు పూనుకుంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. 2008లో మొదలై కరోనాలో మరింత తీవ్రస్థాయికి చేరింది. దీని నుంచి బయటపడేందుకు పెట్టుబడిదారీ సమాజం తీవ్ర ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే లేబర్ కోడ్‌లు తెచ్చారు. మన దేశంలోనే కాకుండా యూరప్, అమెరికా వంటి అనేక పెట్టుబడిదారీ దేశాల్లోనూ ధరలు, నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. వేతనాల్లో కోత, కార్మికులు సంఘం పెట్టుకోకుండా నిరోధించడం, హక్కులపై దాడి వంటి చర్యలు ప్రపంచవ్యాప్తంగా సాగుతున్నాయి. ప్రజలపై భారాలు వేయడం, కార్మికులను దోచుకోవడం, లాభాలు పెంచుకోవడం ద్వారా సంక్షోభం నుంచి బయటపడాలని పెట్టుబడిదారీ వర్గం చూస్తోంది. అందుకే కార్మికుల హక్కులపై దాడి, దోపిడీ తీవ్రతరమవుతోంది. కార్మిక చట్టాల మార్పు వెనుక ఉద్దేశం ఇదే.

సహజ వనరుల దోపిడీ అందులో భాగమే

ఆస్తుల పెంపు కోసం దేశ సంపదను లూటీ చేయడం, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలను సొంతం చేసుకోవడం వంటివి జరుగుతున్నాయి. పెట్టుబడిదారీ సమాజాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాలు వీటిని అమలు చేస్తున్నాయి. సహజ వనరులైన భూమి, అడవులు, గనులు, సముద్రాలను సైతం వారిపరం చేస్తున్నాయి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో నాలుగేళ్లలో రైల్వే స్టేషన్లు, హైవేలు, బిఎస్ఎన్ఎల్ టవర్లను కట్టబెడుతున్నాయి. ఆయిల్, గ్యాస్, పోర్టులను వారిపరం చేస్తున్నాయి. ఇప్పటికే విద్య, వైద్యం ప్రయివేటీకరించారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడి పోరాటాలు పెరుగుతున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, యూరప్ దేశాల్లోనూ పోరాటాలు జరుగుతున్నాయి. ఎప్పుడూ బయటకు రాని నర్సులు సమ్మె చేయడం, బ్రిటన్‌లో రైల్వే కార్మికులు రోడ్డెక్కడం వంటివి కొనసాగుతున్నాయి. ఎక్కడైతే ఈ పోరాటాలను సమర్థవంతంగా మలచగలుగుతున్నారో అక్కడ ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. లేనిచోట మనదేశంలోలా బిజెపి మాదిరిగా అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వస్తున్నాయి. హక్కుల కోసమే కాకుండా సమస్యల పరిష్కారానికీ విధానాల సంబంధిత వ్యతిరేక పోరాటాలు సాగాల్సి ఉంది. అనేక విషయాలపై పోరాటాలు జరుగుతున్నప్పటికీ రోజువారీ సమస్యలు, వాటిని ప్రభావితం చేసే విధానాలను అర్థం చేసుకోవడం లేదు.

సిఐటియు క్షేత్రస్థాయిలో ఇప్పటి వరకూ చేరని ప్రతి కార్మికుని వద్దకూ ఇది చేరాల్సి ఉంది. దీని వెనుక ఉన్న రాజకీయం చెప్పాల్సి ఉంది. బిజెపి, వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అన్నీ ఇవే పాలసీలను అమలు చేస్తున్నాయి. తమ విధానాల అమలుకు ప్రజల ఐక్యతను పాలకవర్గాలు దెబ్బతీస్తున్నాయి. మతం, కులాలు, ప్రాంతం, భాష వంటి చీలికలు తెస్తున్నాయి. పోరాటాలను నిర్వీర్యం చేయడం వంటివి చేస్తున్నాయి. హౌస్ అరెస్టులు, జైళ్లో పెట్టడం వంటి చర్యలన్నీ ఇందులో భాగమే. ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించి కొనుగోలు శక్తి పెంచి సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నా అవి చేసేందుకు పెట్టుబడిదారీ విధానం ఒప్పుకోదు. ప్రజల మధ్య ఐక్యతను కాపాడుతూ క్షేత్రస్థాయిలోకి పోరాటాలను తీసుకెళ్లాలి. కార్మికులతోపాటు రైతులూ పోరాడుతున్నారు. ఢిల్లీలో రైతుల పోరాటం వెనుక కార్మికవర్గం సైతం నిలబడింది. కార్మికులు, రైతుల ఐక్యపోరాటం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. దీన్ని మరింత బలపరచాల్సి ఉంది. ప్రస్తుతం కార్మిక వర్గం పట్టణాలకే పరిమితం కాలేదు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఏప్రిల్ ఐదో తేదీన పెద్ద ఎత్తున ఆందోళనకు నిర్ణయించాయి. ఐదు లక్షల మందికిపైగా ఆ పోరాటంలో పాల్గొనున్నారు. ఒక్క సిఐటియు నుంచే మూడు లక్షల మంది రానున్నారు. రాబోయే రోజుల్లో జరగబోయే సిఐటియు అఖిల భారత మహాసభలోనూ వీటిపై చర్చలు జరగనున్నాయి.

మరో ప్రభుత్వమయితే సిగ్గుతో చచ్చేది

హైకోర్టు వ్యాఖ్యలపై చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రహైకోర్టు అడిగిన ప్రశ్నలకు ఇంకో ప్రభుత్వం అయితే సిగ్గుతో ఉరేసుకుని చచ్చేదని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వివిధ శాఖల్లో ప్రభుత్వ వైఫల్యాలు, తప్పిదాలపై హైకోర్టు అడిగిన ప్రశ్నలపై శనివారం తన ట్విట్టర్ ఖాతాలో స్పందించారు. హైకోర్టు వ్యాఖ్యాలుపై మీడియాలో వచ్చిన కథనాలను కూడా ఆయన తన పోస్టుకు జత చేశారు.

పేదల బియ్యంలో జగన్ రూ.6 వేల కోట్ల దోపిడీ

- టిడిపి ఎమ్మెల్యే నిమ్మల ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని విదేశాలకు తరలించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.6 వేల కోట్లు కొట్టేశారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించారు.

టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అరకొరగా పేదలకు ఇచ్చే రేషన్ కోసం జగన్ ఆర్భాటంగా తన బొమ్మలతో వాహనాలు ప్రారంభించి వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితులకు రూపాయి ఖర్చు చేయలేదు..

దళితుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదన్న నిజం న్యాయస్థానం సాక్షిగా తేలిపోయిందని మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు.

తిరుమలలో చార్జీల దరువు..

తిరుమలలో యాత్రికుల సౌకర్యం కోసం నిర్మించిన వసతి గృహాల ధరలను భారీగా పెంచి ప్రజలపై భారం మోపడం సరైంది కాదని మాజీమంత్రి కళా వెంకట్రావు పేర్కొన్నారు. మొన్న లడ్డూ రేట్లను, నిన్న బస్ చార్జీలను, నేడు వసతి రేట్లు పెంచి తిరుమలకు భక్తులను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

లౌకికవాదాన్ని, మానవ హక్కులను రక్షించుకోవాలి

- ప్రపంచ నాస్తిక మహాసభలో వక్తలు



ప్రపంచ నాస్తిక మహాసభల్లో మాట్లాడుతున్న మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

లౌకకవాదాన్ని, మానవ హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని బెంజిసర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రంలో శనివారం ప్రపంచ నాస్తిక మహాసభ ప్రారంభమైంది. ఈ మహాసభలో తమిళనాడుకు చెందిన ది మోడరన్ రేష్నలిస్టు జాయింట్ ఎడిటర్ కుమరేశన్ ముఖ్య వక్తగా మాట్లాడుతూ నేడు మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శాసనసభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో రావాల్సిన మార్పుల గురించి వివరించారు. అమెరికాకు చెందిన ఫ్రీడమ్ ఫ్రమ్ రిలీజియన్ ఫౌండేషన్ కో ఫౌండర్ బారన్ బర్కర్, జర్మనీకి చెందిన అమరదేవ్, ఇంగ్లాండ్‌కు చెందిన ఉత్తమ్ నిరుల తదితరులు నాస్తిక వాద ఉద్యమాల గురించి వివరించారు. మతానంతర సమాజంవైపు ఏవిధంగా చూడాలో తెలియజేశారు. మీడియా - సెక్యులరిజం, వైజ్ఞానిక యుగంలో రావాల్సిన మార్పులు, సెక్యులరిజం దృక్పథంతో సామాజిక సేవ, అంతర్జాతీయ మానవవాద ఉద్యమాల గురించి గోష్టులు జరిగాయి. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర నాయక్ మహాత్యాల గుట్టు రట్టు చేస్తూ ప్రసంగించారు. నాస్తికవాద ఉద్యమకారులు గోరా - సరస్వతీ గోరాపై ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. సభకు అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, నేపాల్ తదితర దేశాల నుండి నాస్తిక, హేతువాద, మానవవాద ఉద్యమాల నాయకులు హాజర య్యారు. తొలుత నాస్తిక కేంద్రం చైర్మన్ డాక్టర్ సమరం స్వాగతం పలకగా, వికాస్ గోరా ఈ మహాసభ ఉద్దేశాన్ని వివరించారు.

వన్యప్రాణుల విక్రయ ముఠా అరెస్టు

- అలుగులను విక్రయిస్తుండగా పట్టుకున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం)



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న అలుగులు

వన్యప్రాణులను విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును అటవీశాఖ అధికారులు రట్టు చేశారు. అటవీశాఖ అధికారులే కొనుగోలు దారులుగా అవతారమెట్టి వన్యప్రాణుల ముఠాను అరెస్టు చేశారు. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా పలాసలో శనివారం చోటు చేసుకుంది.

అటవీశాఖ అధికారి ఎ.మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాశీబుగ్గకు చెందిన బమ్మిడి రవితేజ, ఎ.సాయి, మెళియాపుట్టి మండలం మజ్జోడిపేటకు చెందిన సనపల రుషి, మందస మండలం బొందుకారికి చెందిన సవర కోదండ మహేంద్ర తనయ అటవీ ప్రాంతంలో అరుదుగా లభించే అలుగులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు రేంజర్ మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యాన ప్రత్యేక బృందం నిఘా పెట్టింది. కొనుగోలుదారుల వేషంలో అటవీశాఖ అధికారులు కాశీబుగ్గలోని సూర్య లాడ్జిలో నిందితులను కలిశారు. రెండు అలుగులను రూ.50 లక్షలకు విక్రయిస్తుండగా వారిని అరెస్టు చేశారు. వణ్యప్రాణులను అమ్మడం నేరమని అటవీశాఖ అధికారి మురళీకృష్ణనాయుడు తెలిపారు. పట్టుకున్న అలుగులను విశాఖ జూకు తరలిస్తామని చెప్పారు.

అర్చకులకు వైద్య ఖర్చులు ఇక నూరుశాతం చెల్లింపు

- దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన వైద్య ఖర్చులను నూటికి నూరు శాతం అర్చకనిధి నుంచి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రస్తుతం వైద్య ఖర్చుల్లో 50 శాతాన్ని మాత్రమే తిరిగి ఇస్తున్నామని, ఇకనుంచి పూర్తిగా చెల్లిస్తామని తెలిపారు. ఇనాం భూములపైన వంతుల వారీగా పనిచేస్తున్నవారు, ధూపదీప నైవేద్యం పథకం కింద, నెలసరి వేతనంపై పనిచేస్తున్న అర్చకులకు నూరు శాతం తిరిగి చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులను మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమ నిధి ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.aparchakawelfare.org ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కేసులు అక్రమమో, సక్రమమో కోర్టులు తేలుస్తాయి

- సిఐడి డిజిపి సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఐడి నమోదు చేస్తున్న కేసులు అక్రమమో, సక్రమమో అనేది కోర్టులు తెలుస్తాయని సిఐడి డైరెక్టర్ జనరల్ పి.వి.సునీల్ కుమార్ అన్నారు. గుంటూరులో ఇన్విటేల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సునీల్‌కుమార్ వచ్చాక సిఐడి వెలుగులోకి రాలేదని, పరిస్థితులే వెలుగులోకి తెచ్చాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏర్పడిన కొన్ని పరిస్థితుల దృష్ట్యా సిఐడికి ప్రాధాన్యత ఏర్పడిందని తెలిపారు. గుంటూరులో టెన్నిస్ క్రీడలను బాగా అభివృద్ధి చేశారని, వీటిల్లో టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

భూ పంపిణీకి కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పేద రైతులకు అసైన్డ్ భూమిని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రెవెన్యూ అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ ప్రక్రియను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి నదీ పరీవాహక ప్రాంతాల్లో (లంక భూములు) 10 వేల ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటితో పాటు మరో 6642 మందికి పట్టాలు ఇచ్చేందుకు అసైన్డ్ భూమిని గుర్తించారు. అసైన్డ్, 22(ఎ) నిషేధిత జాబితాలోని భూములు, చుక్కల భూములు, అనాదీనం, ఖాళీగా ఉన్న భూములను క్రమబద్ధీకరించేందుకు వీలుగా ప్రభుత్వం ఇటీవల ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. షరతుల గల పట్టాలతో పాటు, నిరుపయోగమైన భూమి (గయాల) కింద పేర్కొన్న భూముల సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అసైన్డ్ పట్టా ఉన్న రైతులతో పాటు భూమిని దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న ఆయా రైతులకు కూడా రీ సర్వే అనంతరం భూ హక్కులు కల్పించనున్నట్లు సమాచారం. ఈ మేరకు కోస్తా ఆంధ్ర, రీజినల్ కాన్ఫరెన్స్‌లో సిసిఎల్‌ఎ ఆయా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డిఆర్‌ఓ, ఆర్‌డిఓలను ఆదేశించినట్లు తెలిసింది. భూపంపిణీ లబ్దిదారులను జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఏర్పడిన అసైన్‌మెంట్ కమిటీలో అప్రూవల్ చేయించుకోవాలని, అందుకోసం రెవెన్యూ యంత్రాంగం ఇప్పటి నుంచే కసరత్తును వేగవంతం చేయాలని నిర్దేశించినట్లు తెలిసింది.



దీక్షల్లో కూర్చున్న మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆదినారాయణ

'ఉక్కు' దీక్షల్లో మహిళలు

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 695వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మాతృశ్రీ నగర్, ద్వారకాపురి కాలనీలకు చెందిన మహిళలు, ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్, నాయకులు ఎన్.రామచంద్రరావు, కెఎస్ఎన్.రావు, వైటి.దాస్ మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపదని, దీన్ని అమ్మే అధికారం ప్రభుత్వాలకు లేదని తెలిపారు. మహిళలు దీక్షలో కూర్చోవడం సంతోషదాయకమని, చరిత్రలో జరిగిన ఏ ఉద్యమాలలోనైనా మహిళల పాత్ర ఎంతో గణనీయమని తెలిపారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన ఈ ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించడం సరైంది కాదని దీక్షలో పాల్గొన్న మహిళలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, కారు రమణ, గుమ్మడి నరేంద్ర, బిఎంఎల్.నాయుడు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ నిధుల మళ్లింపుపై పునరాలోచన చేయాలి : కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్సి కార్పొరేషన్ నిధుల మళ్లింపుపై ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ హైకోర్టు చేసిన వ్యాఖ్యల పట్ల కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) హర్షం వ్యక్తం చేసింది. కార్పొరేషన్ నిధులను నవరత్నాలకు ఎలా మళ్లిస్తారన్న హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలోనైనా రాష్ట్ర ప్రభుత్వం నిధుల మళ్లింపుపై పునరాలోచన చేయాలని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నిధుల మళ్లింపుపై హైకోర్టులో విచారణ వేగవంతం చేసి దళితులకు న్యాయం చేయాలని కోరారు. రూపాయి మళ్లించినా సంబంధిత అధికారిపై తమను ఆశ్రయించవచ్చునని హైకోర్టు వ్యాఖ్యానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.7 వేల కోట్ల బడ్జెట్‌లో స్వయం ఉపాధికి ఖర్చు చేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోరారు. భూమి కొనుగోలు పథకాన్ని అమలు చేయాలని, భూమి లేని పేదలకు భూములు కొనివ్వాలని ఆదేశాలు ఇవ్వాని హైకోర్టును కోరారు. ఎస్సి కార్పొరేషన్ ఉద్దేశం నెరవేర్చేలా రాష్ట్రప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



పురస్కారాలను అందుకుంటున్న శైలజ, మాధవపెద్ది సురేష్

ఇద్దరికి మాధవపెద్ది సత్యం పురస్కారాలు

- అందుకున్న గాయని శైలజ, సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

ప్రముఖ సినీ నేపథ్య నాయకులు మాధవపెద్ది సత్యం శతజయంతి ఉత్సవాన్ని గుంటూరు జిల్లా తెనాలి నాజరుపేటలోని ఎన్‌విఆర్ కన్వెన్షన్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. నిర్వహణ కమిటీ చైర్మన్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్‌పి శైలజ, సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు మాధవపెద్ది సత్యం పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. శివ ఫౌండేషన్ నిర్వాహకులు మాధవపెద్ది మూర్తి సహకారంతో పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కళల కాణాచి తెనాలిలో సాహితీ సౌరభం గుభాళిస్తోందని తెలిపారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ మధురమైన పాటలతో తెలుగు ప్రేక్షకులను మైమరపించిన మాధవపెద్ది పురస్కారాన్ని అందుకోవడం చారిత్రక ఘట్టంగా వర్ణించారు. కళాకారులకు నిలయమైన తెనాలిలో అరుదైన గౌరవం పొందామని అన్నారు. తానా మాజీ అధ్యక్షులు డాక్టర్ టి.ప్రసాద్, రామినేని ఫౌండేషన్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, చైర్మన్ ధర్మ ప్రచారక్ రామినేని, సినీనటి సిహెచ్ జయలలిత, గుంటూరు కళాధర్బార్ అధ్యక్షులు డాక్టర్ రంగారావు ప్రసంగించారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరిలో సత్యం పాటలతో ప్రేక్షకులను అలరింపజేశారు.



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజని

గర్భాశయ కేన్సర్‌ను అరికట్టేందుకు చర్యలు

- మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

గర్భాశయ కేన్సర్‌ను నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడుదల రజని అన్నారు. విశాఖలోని మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రిలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజాన్ (ఎఎపిఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ఏడాది గర్భాశయ కేన్సర్ సుమారు 1.25 లక్షల మంది మహిళలకు సోకుతోందని, అందులో 75 వేల మంది చనిపోతున్నారని తెలిపారు. అటువంటి మహమ్మారిని అరికట్టవలసిన అవసరముందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఎపిఐ సహకారంతో గర్భాశయ కేన్సర్‌ను అరికట్టే చర్యల్లో భాగంగా శనివారం సుమారు వంద మంది 9 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులకు వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. అనంతరం విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఎఎపిఐ అధ్యక్షులు డాక్టర్ రవి కొల్లి, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ, నగర మేయర్ హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ విజయనిర్మల, మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగులకు ఉచితంగా మూడు చక్రాల వాహనాలు

- నియోజకవర్గానికి పదేసి కేటాయింపు
- గణతంత్ర దినోత్సవ రోజున పంపిణీకి ఏర్పాట్లు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వికలాంగులకు (ఆర్థోపెడిక్) మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను ఉచితంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను వెలువరించింది. వాహనాల పంపిణీ, లబ్ధిదారుల ఎంపికకు అర్హతలు, తదితర అంశాలతో పలు మార్గదర్శకాలు సూచించింది. కొన్ని జిల్లాల్లో ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. కొన్ని జిల్లాలకు ఇప్పటికే వాహనాలు చేరుతున్నాయి. అర్హులైన వారికి ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ రోజున రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన వికలాంగులకు వంద శాతం సబ్సిడీతో మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ కోసం ప్రభుత్వం నియోజవర్గానికి పదేసి చొప్పున కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాలకు 1750 వాహనాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో మహిళలకు 875 (50 శాతం), ఎస్‌సిలకు 140 (16 శాతం), ఎస్‌టిలకు 61 (7 శాతం), జనరల్‌కు 674 (77 శాతం) కేటాయించారు. వాహనాలను పొందడానికి 18 నుంచి 45 సంవత్సరాలు వయస్సు కలిగి 70 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారిని ఎంపిక చేస్తున్నారు. డిగ్రీ ఆపైఅర్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వయం ఉపాధి, ప్రయివేట్ ఉద్యోగాలు చేస్తున్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. వార్షికాదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న వారినే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఏజెన్సీ, ప్రయివేట్ ఏజెన్సీ నుంచి గతంలో మోటార్ వాహనాలు పొందని వారినే అర్హులుగా గుర్తిస్తున్నారు. సొంత వాహనం ఉన్న వికలాంగులను అనర్హులుగా పక్కన పెడుతున్నారు.

దరఖాస్తుల వెల్లువ

మూడు చక్రాల వాహనాల కోసం వికలాంగుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. శ్రీకాకుళం జిల్లాకు 80 వాహనాలను కేటాయించగా 267 దరఖాస్తులు వచ్చాయి వీటిని అధికారులు స్క్రూటినీ చేసి అర్హులను ఎంపిక చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఎనిమిది సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ తుది జాబితాను సిద్ధం చేస్తోంది. నియోజకవర్గానికి పదేసి చొప్పున కేటాయించినా ఇంకా పూర్తి స్థాయిలో జిల్లాలకు చేరలేదు. శ్రీకాకుళం జిల్లాకు 80 వాహనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 30 వాహనాలు చేరాయి. మరికొద్ది రోజుల్లో మిగిలిన వాహనాలు జిల్లాకు చేరుకుంటాయని అధికారులు చెప్తున్నారు

రాజకీయ సిఫార్సులతో ఆందోళన!

వికలాంగులకు ఇచ్చే వాహనాలకూ రాజకీయ పైరవీలు తప్పడం లేదు. వాహనం ఖరీదు రూ.1.30 లక్షల వరకూ ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పూర్తి సబ్సిడీపై అందిస్తుండడంతో కొంతమంది ఎమ్మెల్యేలతో సిఫార్సు చేయిస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేల లేఖల వల్ల తమకు వాహనాలు అందుతాయో లేదోనన్న ఆందోళన పలువురు దరఖాస్తుదారుల్లో నెలకొంది.

బీ ఫార్మసీలో సీటు రాలేదని.. విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - పాములపాడు (నంద్యాల జిల్లా)

బీ ఫార్మసీలో ప్రభుత్వ సీటు రాలేదని నంద్యాల జిల్లా పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన విద్యార్థి మహేష్ (18) ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి లింగస్వామికి ఒక కుమారుడు, ఇద్దరు కూతురులు ఉన్నారు. కుమారుడు మహేష్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఎంసెట్ రాశాడు. బీఫార్మసీ చదవాలని ఎంతగానో ఆశపడ్డాడు. ఇటీవల కాలంలో కౌన్సిలింగ్‌కి వెళ్ళగా గవర్నమెంట్ కోటాలో బీ ఫార్మసీ సీటు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో పాటు కుటుంబంలో ఇద్దరు చెల్లెలు ఉండడంతో బీ ఫార్మసీ చదవలేనని, ప్రైవేట్ కాలేజీలో పేమెంట్ సీటుకు ఫీజు కట్టే ఆర్థిక స్థోమత లేదని మదనపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో అందరూ పొలానికి వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో కొక్కానికి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వేకువజామున విషాదం

- ఎద్దుల బండిని ఢీకొన్న ఐచర్
- అక్కడికక్కడే ఇద్దరు కూలీలు మృతి

ప్రజాశక్తి-రొళ్ల (సత్యసాయి జిల్లా)

వేకువజామున కూలీల ఇంట విషాద ఘటన చోటు చేసుకుంది. సొంత పనుల నిమిత్తం ఎద్దుల బండిలో బయటకు వెళ్లిన వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎద్దుల బండిలో వస్తున్న వీరిని వెనుక వైపు నుంచి ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎద్దుల బండిలో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు ఒక ఆవు కూడా మరణించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అగిళి మండలం నరసాంబూది పంచాయతీ కసాపురం గ్రామానికి చెందిన గోవిందప్ప(37), తిన్నేగౌడా(41), శివన్నలు శనివారం ఉదయం ఎద్దుల బండిలో పొలం వద్దకెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని రామన్నపల్లి నుంచి అగళి మీదుగా గ్రామానికి బయల్దేరారు. ఎద్దుల బండి అగళి హైవే వద్దకు రాగానే రొళ్ల నుంచి కర్నాటక వైపు వెళ్తున్న ఐచర్ వాహనం వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఎద్దుల బండి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో గోవిందప్ప, తిన్నేగౌడలు తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇదే బండిలో ఉన్న ఎంపిటిసి గోవిందప్ప సోదరుడు శివన్న తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద ధాటికి ఓ ఆవు మృతి చెందింది. మరో ఆవు తీవ్రంగా గాయపడింది. ఘటనకు కారణమైన డ్రైవర్ ఐచర్ వాహనాన్ని రోడ్డుపై వదిలి పారిపోయాడు. ప్రమాద విషయం తెలియగానే సిఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108లో హిందూపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరోసారి 'ల్యాంకో దౌర్జన్యం'

- చిందేపల్లి రోడ్డున తవ్విన వైనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్

ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ (ల్యాంకో) మరోసారి దౌర్జన్యానికి ఒడిగట్టింది. చిందేపల్లి రోడ్డును తవ్వేసి తమ దౌర్జన్య కాండను కొనసాగించింది. గ్రామస్తులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తులకు అండగా సిఐటియు నాయకులు నిలవడంతో పిఆర్‌ఒను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. వివరాల్లోకి వెళితే... శ్రీకాళహస్తి-తిరుపతి ప్రధాన రోడ్డు మార్గం నుండి చిందేపల్లికి లింకు రోడ్డు అనాధిగా వాడుకలో ఉంది. అది ఆర్‌అండ్‌బి రోడ్డుగా రికార్డుల్లో ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే గతంలో ల్యాంకో ఈ రోడ్డును మూసివేసి రాకపోకలను అడ్డుకోవడంతో గ్రామస్తులు తిరగబడ్డారు. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు, ల్యాంకో యాజమాన్యం, గ్రామస్తులతో కలిసి ఓ ఒప్పందానికి వచ్చి చిందేపల్లి లింకు రోడ్డును యధావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు. అయితే ఇటీవల తిరిగి రోడ్డును మూసి వేయడమే కాకుండా ఆక్రమణలకు పూనుకోవడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ల్యాంకో మరోసారి రోడ్డును మూసివేసి గుంతలు తీయడం దుర్మార్గమని సిఐటియు నాయకులు పెనగడం గురవయ్య మండిపడ్డారు. ల్యాంకో పిఆర్‌ఒగా వ్యవహరిస్తున్న ఓ మాజీ పోలీస్ అధికారి ఈ దౌర్జన్యకాండకు నాయకత్వం వహిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, ల్యాంకో యాజమాన్యంతో కుమ్మక్కై, చిందేపల్లి రోడ్డును దగ్గరుండి కబ్జా చేయించడం అత్యంత బాధాకరమని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చిందేపల్లి రోడ్డుకు అడ్డంకులు సృష్టిస్తున్న ల్యాంకో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ల్యాంకో పిఆర్‌ఒపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సుబ్రమణ్యం రెడ్డి, వెంకటయ్య, రంగయ్య, బాలకృష్ణ, చిందేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో 42 మందికి కారుణ్య నియామకం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం రవాణాసంస్థలో పనిచేస్తూ గతంలో మరణించిన వారికి నియామకపు ఉత్తర్వులను ఇవ్వడం జరిగిందని, కుటుంబ సభ్యుల పేర్లు నిలబడేలా వత్తికి గౌరవం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట మేరకు 42 మందికి నియామకపత్రాలను కలెక్టర్ శనివారం సాయంత్రం అందించారు. ఆర్టీసీలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు న్యాయం చేస్తానని చెప్పిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 42మందికి పోస్టింగులు ఇచ్చారు. వీరిలో వీఆర్వో గ్రేడ్-2, 11 మందికి, గ్రామ సర్వేయర్లుగా ఇద్దరు, సభార్డినేట్లు 13 మందికి, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లుగా 8 మంది , పంచాయతీ కార్యదర్శులుగా 8మందికి నియామకపు ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అందించారు. నియామకపు ఉత్తర్వులు అందుకున్న వారు హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ కాదు రైతు వ్యవసాయం కావాలి

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్
- జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి - కోడుమూరు (కర్నూలు జిల్లా)

దేశంలో, రాష్ట్రంలో కార్పొరేట్ వ్యవసాయం కాదని, రైతు వ్యవసాయం కావాలని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి బి.వెంకట్‌అన్నారు. శనివారం కోడుమూరు సంత మార్కెట్ లో వ్యవసాయకార్మిక సంఘం కర్నూలు జిల్లా 12వ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో వెంకట్‌మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం మూడు నల్లచట్టాలనుతెచ్చి వ్యవసాయ రంగాన్ని, కార్పొరేట్‌శక్తులయిన అంబానీ, ఆదానీలకు, కట్టబెట్టాలని చూసిందని అన్నారు. దేశావ్యాప్తంగా రైతుల ఉద్యమాన్ని చూచి నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నారని అన్నారు. అటువంటి మోడీకి రాష్ట్రంలో ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రి మద్దతు నిస్తున్నాడని, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కూడా ముఖ్యమంత్రి పదవులకోసం మోడీ, రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నించకుండా భజన చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంమగా అమలు చేయడం లేదని, 200 పని దినాలు కల్పించడంలేదని అన్నారు. దాని ఫలితంగా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో, వ్యవసాయ కూలీలు వలసలు వెళుతున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలేక, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతును, వ్యవసాయాన్ని కాపాడాలి, ఉపాధి హామీ పనులు కల్పించాలన్న తీర్మానాలతో మహాసభలో చర్చిస్తారని అన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున, ఎర్ర జండాకు మద్దతుగా నిలిచి మా పోరాటాలకు మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, పశ్చిమ ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కూలీలు వలసలు పోతుంటే, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. సాక్షాత్తు, జిల్లాలో ఆలూరు నియోజకవర్గంలో, మంత్రి, రైతుల భూములను లాక్కున్నారని అన్నారు. జిల్లాలో రైతులకు కంపెనీలు నకిలీ ప్రత్తి విత్తనాలు అమ్మి మోసపోయినా, నష్టపోయినా కంపెనీలపై జగన్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. వ్యవసాయాన్ని కాపాడుతానని, చెప్పిన జగన్ రైతులకు సాగు నీరు ఇవ్వకుండా, గిట్టు బాటు ధరలు కల్పించ ప్రైవేట్టు కంపెనీలకు మద్దతిస్తున్నారన్నారు.

వేదవతి, రిజర్వాయర్, ఆర్‌డిఎస్, కాలువల, నిర్మాణం చేపట్టడంలేదని అన్నారు. ప్రాజెక్టులు కట్టి సాగునీరు, ఇవ్వలేని, జగన్ రైతు సంక్షేమ ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్నాడని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున ఉద్యమించి, కేంద్ర, రాష్ట్ర రైతు వ్యతిరేక విధానాలుకు, వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఈ మహాసభలా ద్వారా తెలియజేయాల్సి ఉందని అన్నారు. ప్రజనాట్యమండలి కళాకారులు గీతాలను పాడి సభను ఉత్తేజ పరిచారు. సభకు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లింగన్న సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో, వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శికెవి.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు వీరశేఖర్, ఆహ్వాన సంఘం కార్యదర్శి గపుర్ మియా, చేనేతకార్మికసంఘం, జిల్లా అధ్యక్షులు, లక్ష్మన్న, కార్యదర్శి రాజు, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జె. మోహన్, మండల కార్యదర్శి పెద్ద ఈరన్న, సిపిఎం పట్టణ సభ్యులు టి.వీరన్న, ప్రజానాట్యమండలి కళాకారులూ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నన్నయ విశ్వవిద్యాలయ విసి జగన్నాథరావుకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - రాజానగరం

ఉద్యోగ విమరణ పొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావుకు సిబ్బంది శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ సభలో విసి మాట్లాడారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివద్ధిలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు ఎంతో సహకరించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అనుబంధ కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి విసిగా ప్రసాదరాజు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసిగా ఆచార్య జివిఆర్.ప్రసాదరాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన జెఎన్‌టియుకె ఉపకులపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జగన్నాథరావు ఉద్యోగ విరమణతో ప్రసాద్‌రాజుకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలను తీసుకోనున్నారు.

సంపాదకీయం

కొక్కొరోకో...

సంప్రదాయమో...వ్యసనమో కానీ...కోస్తా జిల్లాల్లో కోడిపందేలనూ సంక్రాంతి పండుగనూ వీడదీసి చూడలేం. గ్రామీణ జీవనానికి కోడిపుంజుకు అనుబంధం వుంది. 'తెల్లారింది లెగండో కొక్కొరోక్కో/ మంచాలింక దిగండో కొక్కొరోక్కో' అంటాడో సినీకవి. కొక్కొరోక్కో అనే కోడికూత మనిషిలోని మత్తును వదలగొట్టి... మేల్కొలుపుతుంది. పల్లెను నిదుర లేపుతుంది. సంక్రాంతి రోజుల్లో కోడి కూసిందంటే... పౌరుషంతో బరిలోకి దిగడానికి సిద్ధమని మీసాలు మెలేస్తాడు ఆసామి. పల్లె సంస్కృతితో పెనవేసుకుపోయిన ఈ సంప్రదాయానికి వందల ఏళ్ల చరిత్రే ఉందంటారు. 15వ శతాబ్దపు సామాజిక పరిస్థితులకు అద్దంపట్టే పద్య కావ్యం 'హంసవింశతి'లో అప్పట్లో కోడిపందేలు ఎలా జరిగేవో సోదాహరణంగా వివరిస్తాడు అయ్యలరాజు నారాయణ కవి. 'కోడిపుంజును యుద్ధానికి సన్నద్ధం చేస్తూ... దాని కాళ్లకు పాతలు చుట్టారు. కత్తులు కట్టారు. రెండు వైపులవారు తమ పుంజులను పొదివి పట్టుకుని, ఎదురెదురుగా నిల్చున్నారు. అంతే! ఆ పుంజులు చేతిలో వుండగానే జూలు విదిలించాయి. కయ్యానికి ముక్కులు దువ్వాయి!...' అంటూ వర్ణిస్తాడు అయ్యలరాజు కవి. కోడి కాలు దువ్వినా, కూత కూసినా కోడి పందెం అనగానే చప్పున గుర్తొచ్చేది పల్నాటి యుద్ధం. బ్రహ్మ నాయుడి చిట్టిమల్లు... నాగమ్మ సివంగిల పోరు, యుద్ధానికి దారితీసిన తీరు... కథలు కథలు తెలుగునాట సుప్రసిద్ధమే. ఈ కోడి పందేలు సంక్రాంతితో ఎలా ముడిపడ్డాయో స్పష్టంగా చెప్పలేము కాని, సంప్రదాయం పేరుతో... వినోదం మాటున క్రమంగా జూద క్రీడగా మాత్రం మారింది.

'కాయ్ రాజా కాయ్/ కాస్తే వుంది చూస్తే లేదు/ ఒకటికి మూడు రెట్లు/ స్వర్గానికివే మెట్లు/ క్షణంలో సగంలో కుబేరుడివి/ కనురెప్పపాటులో కుచేలుడివి' అంటాడు తిలక్. కోడిపందేలు...వినోదం, సంస్కృతి అని చెబుతున్నప్పటికీ సంక్రాంతి ముందునుంచే లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. వీటిపై నిషేధం వుండటంతో...ఆన్‌లైన్ కోడిపందేలు ఇటీవల ఒక ట్రెండ్‌గా మారింది. రూ.500 నుంచి లక్షల్లో బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఒకప్పుడు పండుగ సమయంలోనే కోడిపందేలు నిర్వహించేవారు. ఆన్‌లైన్‌లో ఏడాది పొడవునా పందేలు నడుపుతున్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఆన్‌లైన్ గ్రూపుల ద్వారా పందేలు వేస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి యాప్‌లు వర్చువల్ బరిగా మారుతున్నాయి. వందలు, వేలు దాటి, లక్షల్లో బెట్టింగ్‌లు కడుతున్నారు. పందేనికి ముందుగానే బెట్టింగ్ డబ్బు కూడా పేమెంట్ యాప్‌ల ద్వారా కట్టించుకుంటున్నారు. వాట్సప్ నుంచి వీడియో కాల్స్ ద్వారా ఈ పందేలు చూస్తున్నారు. ఈ బెట్టింగ్‌లు కట్టేవారిలో ఎక్కువగా విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రాజకీయ నాయకులతో పాటు కొంతమంది మహిళలు, సినీ సెలబ్రిటీలు సైతం వుంటున్నట్లు చెబుతున్నారు. అంతేకాదు...ఇప్పటికే ఆన్‌లైన్‌లో ప్రముఖంగా వున్న బిట్ కాయిన్స్, రమ్మీ, రెబల్‌కాక్ ఫైట్స్ వంటి పేర్లతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఇవే గ్రూపుల్లో కోడిపుంజుల ఫొటోలు, పోరాట దృశ్యాల వీడియోలు పెట్టడం ద్వారా కోడి పేరు, రంగును బట్టి పెద్దఎత్తున బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా... సాంకేతికతను వాడుకుంటూ కథ నడిపిస్తున్నారు.

ఆడేవాళ్లకు డబ్బులు పోతున్నా.. జీవితాలు రోడ్డున పడుతున్నా... వినోదం పేరుతో ఒక్కరి సరదా కోసం కుటుంబమంతటినీ విచారంలోకి నెట్టేస్తుంటారు. బహిరంగంగా నిర్వహించే కోడిపందేలు, పేకాటలపై నిషేధం వుండటంతో... ఆన్‌లైన్ జూదం ఇప్పుడు మూడు పువ్వులు, 36 కాయలుగా మారుతోంది. నిర్వాహకులు రెండింతలు, మూడింతలు డబ్బు వస్తుందంటూ ఆశ చూపి.. వేలు, లక్షలు కాజేస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టినా...వారు తెలుసుకునేలోపు ఫోన్లు, సిమ్‌కార్డులు మారిపోతున్నాయంటున్నారు. 'చినిగిన స్వప్నపు సంచీలో/ చితికిన బాష్పం నిలవదు/ అందుకే నేస్తం జీవితమే ఒక జూదం/ ఖేదానికి మోదానికి లేదసలే భేదం' అంటాడు తిలక్ 'కాయ్ రాజా కాయ్' కవితలో. వినోదపు చలువ జోళ్లద్దాల నుంచి అంతా ఆనందంగానే కనిపిస్తుంది. ఆ జోడు తీసి చూస్తేనే వాస్తవం అవగతమౌతుంది.

మహనీయుల మాట



కూలి పని వల్ల కార్మికుడికి ఆస్తి ఏమైనా పోగు పడుతోందా? వీసమంత కూడా లేదు. కూలి పని పెట్టుబడిని సృష్టిస్తుంది. అంటే కూలి పనిని దోచుకునే ఆస్తిని పుట్టిస్తుంది. మళ్లీ తాజాగా దోచుకోడానికి కూలీలను పుట్టిస్తే తప్ప పెరగలేని ఆస్తిని సృష్టిస్తుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్,

కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక.

అప్రజాస్వామిక పోకడలు రాజకీయ సవాళ్లు

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, ప్రతిపక్షాల నిరసన ఇప్పుడు జీవో నెంబర్1పై కేంద్రీకృతమై వున్నాయి. ఇటీవల కందుకూరు, గుంటూరులలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్న సభలూ సందర్భాలలో సంభవించిన మరణాలను కారణంగా చూపి జగన్ ప్రభుత్వం ఈ జీవో తీసుకొచ్చింది. ఆ విషాద ఘటనలు నిస్సందేహంగా చాలా బాధాకరమైనవి. ఆధ్వర్యం వహించిన తెలుగుదేశం, వారి నాయకులు, అభిమానులు తప్పక భద్రతా చర్యలు తీసుకోవలసింది. కనీసం రెండవ ఘటనైనా జరగకుండా చూడాల్సింది. అదే సందర్భంలో వరుసగా రెండవసారి కూడా ఇలాంటి తప్పు జరగడానికి పోలీసుల పాత్ర లేదా నిఘా లోపం తక్కువ కాదు. జరిగిన ఈ దుర్ఘటనలను సాకుగా చూపి రాష్ట్రంలో మరెక్కడా రోడ్‌షోలు జరగకూడదని నిర్ణీత ప్రదేశాల్లో, స్థలాల్లో అది కూడా పోలీసులు పూర్తి అనుమతినిచ్చిన తర్వాత మాత్రమే సభలు, సమీకరణలు జరుపుకోవాలని ఉత్తర్వునివ్వడం దారుణం. రోగమొకటైతే మందొకటి ఇచ్చిన చందం. చాలా కాలంగా ప్రజా ఉద్యమాలు కార్మిక ఉద్యోగ నిరసనలు, రాజకీయ పార్టీల పిలుపులు పర్యటనలు విఫలం చేయడానికి పోలీసులు గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేయడం సర్వసాధారణం అయిపోయింది. ముందుగానే వాటిని అడ్డుకుంటూ ప్రత్యేక ఉత్తర్వులు ఆంక్షలు, పొలిమేరల్లో అరెస్టు చేయడం జరిగిపోతున్నది. అంగన్‌వాడీలు, వివోఏలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ ఈ చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నవారే. ఇటీవలనే విశాఖపట్నంలో జనసేన అధినేత పర్యటన విషయంలోనూ అదే చూశాం. వామపక్ష నాయకులకు ఇది నిరంతర అనుభవమే. గతంలో తమ పాలనలో ఇదే విధానం అనుసరించిన తెలుగుదేశం ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటు న్నది. ఈ నేపథ్యంలో జీవో1 తీసుకొచ్చిన తర్వాత కదలికలపై ఆంక్షలు తప్పవని అన్ని ప్రతిపక్షాలూ భావిస్తున్నాయి. ఆందోళన చెందుతున్నాయి. నిజానికి ఈ విషాద ఘటనలను ముందు జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ అఖిలపక్ష సమావేశం నిర్బంధాలను, ఆంక్షలను అడ్డుకోవాలని పిలుపు నిచ్చింది. ఇంతలోనే టిడిపి సభల్లో ఈ మరణాలు సంభవించాయి. అలాంటివి జరగకుండా అడ్డుకోవాలనే పేరిట జీవో వెలువడింది.

విషాదంపై విచారణ ఏదీ?

టిడిపి సభలలో నాలుగు రోజుల వ్యవధిలోనే రెండు తొక్కిసలాటలు జరిగాయి గనక ఆ పార్టీ నాయకత్వం ప్రధాన బాధ్యత కాదనలేనిది. కందుకూరులో ఇరుకైన స్థలంలో కటౌట్లు, ఫ్లెక్సీలు పెట్టి మరింత ఇరుకు చేయడం పక్కనే డ్రైనేజీ నుంచి భద్రత లేకపోవడం నిర్లక్ష్య ఫలితాలే. కానీ ఇరుకు రోడ్లలో సభలు పెట్టి వచ్చిన వారిని ఎక్కువచేసి చూపుతు న్నారని ఆరోపించే ప్రభుత్వం పోలీసులు ముందే ఎందుకు చర్య తీసుకోలేదనేది కూడా ప్రశ్నే. నాలుగు రోజులలో అదీ నూతన సంవత్సరాన గుంటూరు వంటి కేంద్రంలో దానధర్మాలతో కలగలిపి రాజకీయ సభ పెట్టినప్పుడు పోలీసులు మరింత జాగ్రత్త పాటించవ లసింది కదా? ఉయ్యూరు ఫౌండేషన్ పేరిట ఈ కార్యక్రమం జరిగినా టిడిపి ప్రత్యక్ష పాత్ర కనిపిస్తూనే వుంది. ఉచితాలపై నిరంతర చర్చ జరుగుతుండగా రాజకీయ సభలో దానాలు చేస్తామని టోకెన్లు ఇచ్చి మరీ రప్పించడం తీవ్రమైన విషయమే, వారికి కొద్ది సమయం ఇచ్చి ఆపేయడం మరింత తొక్కిసలాట ఎవరైనా వూహించగలరు. ఘటన జరిగిన తర్వాతనైనా పశ్చాత్తాపంకన్నా ఎదురు దాడి అధికంగా వుంది. టిడిపి కావాలనే ఇదంతా చేసిందని వైసీపీ అంటే, వైసీపీ వారే కుట్రతో ఇదంతా జరగడానికి కారకులైనారని టిడిపి తీవ్ర ఆరోపణ చేస్తున్నది. ఉభయులూ తమ ఆధారాలు చెప్పడం లేదు. రెండు ఘటనల నిర్వాహకులను అరెస్టు చేస్తే కోర్టు విడుదల చేసింది.

ఇక్కడే సమస్య ఉత్పన్నమవుతుంది. సభలలో తొక్కిసలాటకు కారణమైన వారిపై దర్యాప్తు న్యాయపరమైన చర్య తీసుకోవడం జరగాలి. పోలీసులు ఎందుకు ఉపేక్ష వహించారా అన్నదీ చూడాల్సిందే. మొత్తంగా ఈ దుర్ఘటనల నుంచి రాజకీయ పార్టీలు, సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నది చర్చ జరిపి సూచనలు చేయొచ్చు. అవసరమైతే అఖిలపక్షం జరపొచ్చు. దానికి బదులు రోడ్ల పక్కన సభలే పెట్టరాదనీ, రోడ్ షోలు కుదరవనీ జీవో ఇవ్వడమేమిటి? ఎవరిది తప్పు ఎవరికి శిక్ష? రెండు చోట్ల జరిగిన ఘటనలకు ఇంకెక్కడా సభలే వద్దనడం ఏం ప్రజాస్వామ్యం?

ఉద్యమాలకే ఎక్కువ నష్టం

కుప్పంలో చంద్రబాబు పర్యటనలో అడ్డుకోవడాన్ని ప్రతిపక్షాలు ఖండించాయి. రాజకీయ వివాదం నడిచినా, ఆయన యాత్రలూ ప్రసంగాలూ మామూలు కంటే అధికంగా ప్రచారంతో నడిచాయి. పోలీసుల వైఖరిపై ఆయన లేఖలు రాశారు. ఆయనపై పోలీసులు కేసులు పెట్టారు. వీటి తదుపరి మలుపులు చూడవలసివుంది గానీ మొత్తంమీద టిడిపికి కోరుకున్న ఫోకస్ రానే వచ్చింది. ఒక కార్మిక సంఘానికో అంగన్‌వాడీలకో ఇంత అనుకూలత అవకాశం వుండదు. ఇదే సమయంలో భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభకు వచ్చే ప్రతినిధులను కూడా ఆపేయడం, దింపేయడం ఇందుకు ఉదాహరణ. తెలుగుదేశం హయాంలోనూ ఇలాంటి అప్రజాస్వామిక ప్రతిబంధకాలు తీవ్రంగానే వుండేవి. మోడీ ప్రభుత్వం సంగతి చెప్పక్కరలేదు. తెలంగాణలోనూ యాత్రలను అడ్డుకోవడం వంటివి చూశాం, అందుకే హక్కుల రక్షణ అన్నది ఏ ఒక్కరికో లేక ఏ ఒక్క పార్టీకో సంబంధించిన సమస్య కాదు. సరికదా సామాన్య ప్రజానీకానికి మరింత ముఖ్యం. ఒక ధోరణిగా పాలకవర్గాలు దాడి చేస్తున్నప్పుడు ప్రజలు, ప్రజాతంత్రవాదులకు మరింత అప్రమత్తతా అవసరమవుతుంది. అనుమతి అంత తేలిగ్గా ఇచ్చేట్టయితే ఇక ప్రత్యేకంగా ఈ జీవో అవసరమే అయ్యేది కాదు. ఏ ప్రత్యేకతా లేని ఉత్తుత్తి జీవో అయితే ఎత్తివేయడానికి అభ్యంతరమేమిటి? దీనివల్ల సినిమా వేడుకలకు కూడా అనుమతి నిరాకరిస్తున్నారని మరోసారి సినిమానూ రాజకీయాలను కలగాపులగం చేసే ప్రయత్నమూ జరిగింది. ఎట్టకేలకు బాలకృష్ణ చిత్రం ఫంక్షన్ ముగిసి చిరంజీవి చిత్ర వేడుకకు రంగం సిద్ధమవడం మంచి పరిణామమే.



> **కుప్పంలో చంద్రబాబు పర్యటనలో అడ్డుకోవడాన్ని ప్రతిపక్షాలు ఖండించాయి. రాజకీయ వివాదం నడిచినా, ఆయన యాత్రలూ ప్రసంగాలూ మామూలు కంటే అధికంగా ప్రచారంతో నడిచాయి. పోలీసుల వైఖరిపై ఆయన లేఖలు రాశారు. ఆయనపై పోలీసులు కేసులు పెట్టారు. వీటి తదుపరి మలుపులు చూడవలసివుంది గానీ మొత్తంమీద టిడిపికి కోరుకున్న ఫోకస్ రానే వచ్చింది. ఒక కార్మిక సంఘానికో అంగన్‌వాడీలకో ఇంత అనుకూలత అవకాశం వుండదు. ఇదే సమయంలో భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభకు వచ్చే ప్రతినిధులను కూడా ఆపేయడం, దింపేయడం ఇందుకు ఉదాహరణ. తెలుగుదేశం హయాంలోనూ ఇలాంటి అప్రజాస్వామిక ప్రతిబంధకాలు తీవ్రంగానే వుండేవి. మోడీ ప్రభుత్వం సంగతి చెప్పక్కరలేదు. తెలంగాణలోనూ యాత్రలను అడ్డుకోవడం వంటివి చూశాం. అందుకే హక్కుల రక్షణ అన్నది ఏ ఒక్కరికో లేక ఏ ఒక్క పార్టీకో సంబంధించిన సమస్య కాదు. సరికదా సామాన్య ప్రజానీకానికి మరింత ముఖ్యం. ఒక ధోరణిగా పాలక వర్గాలు దాడి చేస్తున్నప్పుడు ప్రజలు, ప్రజాతంత్రవాదులకు మరింత అప్రమత్తతా అవసరమవుతుంది.**

కందుకూరు, కుప్పం పరిణామాలపై మీడియాలో షరామామూలుగా రెండు రకాల కథనాలూ నడుస్తున్నాయి. ప్రజలు రాకున్నా ఫేక్ చిత్రాలతో ఎక్కువ మందిని చూపిస్తున్నారనీ, గాయపడిన వారిని చంద్రబాబు పరామర్శించడం బూటకమేననీ కథనాలు నడుస్తున్నాయి. మరో వంక రాజమండ్రి లో ముఖ్యమంత్రి సభ సందర్భంలోనూ ఒక మహిళ కాలు దెబ్బతిందని వార్తలు. వాటితో సంబంధం లేదని పాలకపక్షం సమర్థన. ఏది నిజమో ఏది కల్పితమో తెలియని సోషల్‌మీడియా యుద్ధాల స్థాయికి వార్తా కథనాలు దిగజారిపోయిన వేళ సత్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత కూడా ప్రజలపై పరిశీలకులపై పడుతున్నది. ఈ సమయంలోనే రాజ్యాంగపరమైన పాత్రలో వుండాల్సిన ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు బయిలుదేరి టిడిపి ఆరోపణలనూ మీడియా కథనాలనూ సంపాదకీయాలనూ ఖండించే బాధ్యత నెత్తిన వేసుకున్నారు. జరిగిన ఘటనల్లో పోలీసుల పాత్ర లోపరహితమని తనే కితాబునివ్వడం విపరీతం.

వైసీపీలోనూ అలజడి

ఇలాటి అత్యుత్సాహాలు, ప్రతిపక్షాల నిరసనలపై ముఖ్యమంత్రి అసహనం ఎలా వున్నప్పటికీ పాలకపక్షంలోనూ కలకలం పెరుగుతున్నది. వైసీపీ ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాద్ గుంటూరులో సభ నిర్వహించిన వ్యక్తికి మద్దతుగా మాట్లాడారు. పాలనా లోపాలు దిద్దుకోకుండా ఎన్నికలు త్వరగా వస్తే ఎలా గెలవగలమని ప్రశ్నించిన మాజీ మంత్రి పాలకపక్ష ఎంఎల్ఎ ఆనం రామ నారాయణ రెడ్డిపై నాయకత్వం చర్య తీసుకుంది. భిన్నాబి ప్రాయాలుగల మరో ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ముఖ్యమంత్రి జగన్ పిలిపించి బుజ్జగించేందుకు ప్రయత్నించినా ఫలితం సందేహంగానే వుంది. గతంలో ప్రతిపక్షాలపై దాడులు, కేసులు వంటివాటికి బాధ్యత వహించిన మాజీ హోం మంత్రి సుచరిత టిడిపితో సంబంధాలున్న తన భర్త ఏ పార్టీలో చేరితే తనూ అటే వుంటానని ప్రకటించారు. గతంలో ముఖ్యమంత్రి అభిశంసనకు గురైన సీనియర్ నాయకుడు, ప్రస్తుత రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఏకంగా మూడు రాష్ట్రాల గురించిన వివాదం రగిలిస్తుంటే ప్రభుత్వ స్పందన నాస్తి. ఉద్యోగుల జీతభత్యాల జాప్యం నుంచి పెన్షన్ల లబ్ధిదారులకు నోటీసులు. రైతాంగ సమస్యలు, వరకూ అనేక సమస్యలు ముందుకొస్తుంటే సమస్యలే లేనట్టు అంతా ప్రతిపక్షాల కల్పన అన్నట్టు కొట్టిపారేయడం, నిరంతర ఆత్మస్తుతి, పరనిందలోనే మునిగితేలడం ఏ ప్రభుత్వానికీ చెల్లుబాటు కాదు. స్వయానా ముఖ్యమంత్రి తమ పార్టీ ఎంఎల్ఎల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం నిజం కాదా?

బిఆర్ఎస్ ప్రవేశం, బిజెపి వ్యూహాలు

ఈ సమయంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ఎ.పి లో ప్రవేశించేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. పవన్‌కల్యాణ్ జనాకర్షణ పోరాటాలతో నాయకులు వరసకట్టి చేరబోతున్నారని జనసేన చెప్పుకుంటుంటే ఆ పార్టీకి చెందిన కీలక నేతలు తోట చంద్రశేఖర్ వంటి వారు, బిజెపి మాజీ మంత్రి రావెల కిశోర్ వంటి వారు బిఆర్ఎస్‌లో చేరిపోయారు. తోట అధ్యక్షుడుగా నియమితులై అమరావతి రాజధానిగా వుండాలని తొలి ప్రకటన చేశారు.

కెసిఆర్ అభివృద్ధి నమూనాలో పనిచేస్తామన్నారు. బిజెపి మతతత్వ విధానాలు కేంద్రీకృత పెత్తనం గురించి ప్రధానంగా విమర్శలతో బిఆర్ఎస్ తెచ్చామంటున్న కెసిఆర్ ఈ సందర్భంలో విశాఖ ఉక్కు గురించి మాత్రమే ప్రత్యేకంగా చెప్పారు. వైసీపీ బిఆర్ఎస్ వస్తే అభ్యంతరం లేదనీ, తమపై ఏ ప్రభావం చూపబోదనీ అంటున్నది. రెండు పాలక పార్టీలూ పరస్పర అవగాహనతోనే ఈ పరిణామాలు జరుగుతున్నాయని మీడియాలో కథనాలు నడవడం కూడా గమనించదగింది. తెలంగాణలో బిజెపి ఎవరితో పొత్తు వుండదని ప్రకటిస్తే, టిడిపి దానికి మేలు చేయడానికే ప్రవేశించిందనే అంచనాలు చాలా వున్నాయి. మొత్తంపైన రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు అనేక విధాల కలిసి నడిచే కొత్త వాతావరణం ఏర్పడిందని గతంలో ఈ శీర్షికలో చెప్పుకున్న విషయాలు గుర్తుచేసుకోవాలి. ఈ క్రమంలో బిజెపి పరోక్ష హస్తం, వ్యూహం అడుగడుగునా దర్శనమిస్తున్నది. కేవలం వచ్చే ఎన్నికలలో అధికారానికి రావడమే లక్ష్యంగా అవకాశవాద వ్యూహాలకు పాల్పడే పార్టీలు పొంచికూచున్న బిజెపి ఎత్తుగడలు విస్మరించడం వాటికీ ప్రజలకూ చేటు తెస్తుంది.

విశ్లేషణ



పాతూరి సురేష్ కుమార్

నెంబర్ వన్ నిర్బంధం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.1, ప్రజాస్వామిక హక్కులపై నెంబర్ వన్ నిర్బంధంగా ఉంది. జాతీయ, రాష్ట్ర రహదారులు, వీధులలో ప్రధానంగా సమావేశాలు నిర్వహించుకోవటానికి అనుమతించకపోవడం మంచిదని అధికారులకు సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోని తీసుకు వచ్చింది. అక్కడ సభలకు అనుమతిస్తే లాజిస్టిక్ చలనంపై వ్యతిరేక ప్రభావం పడుతుందని చెబుతున్నారు. అంటే...పోలీస్ చట్టం–1861, సెక్షన్.3 ఇచ్చిన పర్యవేక్షణ అధికారంతో సెక్షన్ 30 ప్రకారం సమావేశాలను క్రమబద్ధీకరించా ల్సిందిగా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

అలాగే మున్సిపాలిటీ, పంచాయితీ రహదారులపై కూడా సమావేశాలకు సాధారణ పరిస్థితులలో అనుమతించరాదని, కేవలం ప్రత్యేక పరిస్థితులలో అరుదుగా మాత్రమే అలాంటి రహదారులపై అనుమతించాలని ఆదేశించింది. ఈ రహదారులు ఇరుకుగా, సన్నగా ఉంటాయి. ఈ రహదారులు స్థానికంగా నివాసం ఉండే ప్రజలు స్వేచ్ఛగా తిరగటానికి ఉద్దేశించబడినవి. ఈ రహదారులలో ఎటువంటి అంతరాయం కల్గించినా అది ఆ ప్రాంత ప్రజల ప్రాణాలకు హాని ఏర్పడుతుంది. పౌర జీవనానికి, అత్యవసర సేవలకు ఆటంకం. సాధారణ ప్రజలకు అసౌకర్యం– అంటూ ఈ రహదారులపై నిషేధానికి చెప్పిన ప్రత్యేక కారణాలే కాకుండా సాధారణ కారణాలను కూడా ఇదే జీవోలో చెప్పారు. రహదారులపై సమావేశాలు పెట్టుకోవటం వలన సాధారణ ప్రజలకు భారీ అసౌకర్యం కలుగుతుందని, అలాగే రహదారులపై మీటింగ్ గాయాలకు, మరణాలకు కారణమౌతుందని చెప్పారు. ఈ జీవో 6వ పేరాలో కొన్ని కారణాలను ప్రస్తావించారు. రహదారులు లేక రహదారుల అంచున సమావేశాలు నిర్వహించటం వలన మరణాలు సంభవిస్తాయని, ట్రాఫిక్ అంతరాయం, వాహనాలకు భారీ అంతరాయం కలుగుతుందని అన్నారు. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దటానికి ఎక్కువ సమయం తీసుకుంటుందన్నారు. దీనివలన అనారోగ్యంతో వున్నవారు, వృద్ధులు, గర్భిణులు, గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్ళి చికిత్స చేయటానికి వీలుపడక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు.


కారణాలు - సహేతుకత

జీవోలో పేర్కొన్న కారణాలను చూసినప్పుడు అవి సహేతుకమైనవి కావని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆరవ పేరాలో పేర్కొన్న కారణాలన్నీ ఒక సమావేశంలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించినవి. వాటిని అన్ని సమావేశాలకూ ఆపాదించటంలో ఎటువంటి సహేతుకత లేదు. ఇప్పటిదాకా రహదారులపై కొన్ని వేల సమావేశాలు జరిగి ఉంటాయి. అలాంటి ఒక్క సంఘటనలో జరిగిన ప్రమాదానికి గల కారణాలను అన్ని సందర్భాలలో జరగటానికి అవకాశం ఉందని సూత్రీకరించటం సరైనదికాదు. ఇప్పటికీ ఆ సంఘటన మెజిస్టీరియల్ విచారణలో ఉందని అదే జీవోలో పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే ఆ కారణాలన్నీ కూడా నివారించదగినవి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని...నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగినవి. ఆ సంఘటనలో నిర్వాహకుల లోపం ఎంత ఉందన్నది విచారణలో వెలుగు చూడవలసి ఉంది. ట్రాఫిక్ అంతరాయాలు, సాధారణ ప్రజల తాత్కాలిక అసౌకర్యాలు అనేకసార్లు అనేక రూపాలలో జరుగుతున్నాయి. మంత్రులు, ముఖ్యమంత్రుల పర్యటనలు, రాకపోకల సందర్భంగా జరుగుతుంటాయి. అనేక మతపరమైన, ఇతర సందర్భాలలో జరుగుతున్నాయి. అంతరాయాలు, అసౌకర్యాలు లేకుండా పోలీసులు ప్రజలను తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలలో పంపించాలి. పోలీసుల పనే అది. అది కూడా చేయనప్పుడు, చేయలేనప్పుడు సెక్షన్ 30 అమలులో పోలీసులు వైఫల్యం చెందినట్లు. జాతీయ, రాష్ట్ర మున్సి పాలిటీ, పంచాయితీ రహదారుల న్నింటిలోను సమావేశాలు రద్దు చేయడమంటే ఇంక ఎక్కడా నిర్వహించుకోవటం సాధ్యం కాదు. సమావేశాలు, ప్రదర్శనలు లాంటివి ప్రజాసామ్యానికి ప్రాణం లాంటివి. ప్రాథమికమైనవి. అభిప్రాయాలను పంచుకోవటానికి, ప్రభుత్వాలకు తెలియ చేయటానికి అవి మార్గాలు. వాటిని అడ్డుకోవటమంటే ప్రజాస్వామిక హక్కులపై ప్రత్యక్ష దాడికి దిగడమే.

కోర్టులు ఏం చెప్పాయి?

ప్రభుత్వం ఊహిస్తున్న ప్రమాదాలు వాస్తవ దూరమైనవి, ఊహాజనితమైనవి కాకూడదని... వాస్తవానికి దగ్గరగాను, ప్రత్యక్ష సంబంధం కలిగి వుండాలని కోర్టులు చెప్పాయి. ఈ విధంగా చూసినప్పుడు ప్రభుత్వం చెప్పిన కారణాలు చెల్లవు.

> **జీవోలో పేర్కొన్న కారణాలను చూసినప్పుడు అవి సహేతుకమైనవి కావని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆరవ పేరాలో పేర్కొన్న కారణాలన్నీ ఒక సంఘటనలో చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించినవి. వాటిని అన్ని సమావేశాలకూ ఆపాదించటంలో ఎటువంటి సహేతుకత లేదు. ఇప్పటిదాకా రహదారులపై కొన్ని వేల సమావేశాలు జరిగి ఉంటాయి. అలాంటి ఒక్క సంఘటనలో జరిగిన ప్రమాదానికి గల కారణాలను అన్ని సందర్భాలలో జరగటానికి అవకాశం ఉందని సూత్రీకరించటం సరైనదికాదు. ఇప్పటికీ ఆ సంఘటన మెజిస్టీరియల్ విచారణలో ఉందని అదే జీవోలో పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే ఆ కారణాలన్నీ కూడా నివారించదగినవి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకొని...నిర్వాహకులు, పోలీసులు అప్రమత్తంగా ఉంటే నివారించదగినవి.**



నిషేధం అనే పదమే లేదా?

ఆ జీవోలో నిషేధం అనే పదం లేదు. సమావేశాలు పెట్టుకోవద్దు అని మేమనలేదు అంటున్నారు. ఏ దరఖాస్తును అనుమతించవద్దు అంటే అది నిషేధం కాదా? అన్ని రహదారులను ప్రస్తావిస్తూ అనుమతి నిరాకరించమని ఆదేశిస్తే అది నిషేధం కాదా? కేవలం అరుదుగా మినహాయించదగిన కేసులలోనే అనుమతి ఇవ్వాలని ఆదేశించటం నిషేధం కాదా? అనుమతించటానికి కారణాలు తెలియచేయాలని ఆదేశించటమంటే వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితిలోకి నెట్టివేయటమే. కాబట్టి ఆచరణలో ఇది నిషేధంగానే మారుతుంది.

ప్రదర్శనలపై స్పష్టత

ఒకవేళ ప్రదర్శనలకు అనుమతి ఉంటే వాటిని జీవోలో ఎందుకు ప్రస్తావించలేదు? ఈ జీవో సాకుగా చూపి ప్రజా సంఘాలు చేస్తున్న ప్రదర్శలను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఈ జీవోలో కేవలం మీటింగ్‌లు అనే పదం ఉంది. ప్రదర్శనలకు పంబంధించిన ఎలాంటి పరిమితులు చర్చించలేదు. అలాగని వాటికి మినహాయింపు ఇస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించ లేదు. ప్రభుత్వం దానిమీద స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ సలహాదారు ఇచ్చిన స్పష్టత అధికారయుతంగా ఉండాలి.

ఆచరణ సాధ్యం కాని ప్రత్యామ్నాయాలు

జీవోలో చెప్పిన ప్రత్యామ్నాయ స్థలాలు, మైదానాలు ఎన్ని ప్రాంతాలు, నగరాలు, పట్టణాలలో గుర్తించబడి ఉన్నాయి? అవి ప్రజలకు అందుబాటులో లేకుండా, సభ నిర్వహణ అసాధ్యమనే పరిస్థితి ఉంటే అది నిషేధం కాదా? ఇప్పటివరకు అధికారికంగా చాలా కొద్దిపాటి నగరాలు, పట్టణాలలోనే అలాంటి స్థలాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించకూడదా? ప్రజా సమావేశాలకు ప్రైవేటు స్థలాలు ఎవరైనా ఇస్తారా? పబ్లిక్ మీటింగ్‌లను ప్రైవేటు స్థలాల్లో పెట్టుకోవలసిన దుస్థితి ప్రజాస్వామ్యంలో ఉంటుందా?

సెక్షన్ 29పై స్పందన ఏది?

రెండు సంఘటనలు జరిగాయని పోలీస్ చట్టం–1861 సెక్షన్ 30ను రాష్ట్రమంతటా ప్రయోగించిన ప్రభుత్వాలు... పోలీసులు తమ కస్టడీలో ఉన్న వారిపై హింసను ప్రయోగించకూడదనే సెక్షన్ ఉల్లంఘనలకు సంబంధించి మాత్రం స్పందించలేదు. ఈ సెక్షన్ 29 ప్రకారం కస్టడీలో వ్యక్తులపై హింస నేరం. ఇంత వరకు పోలీసులు తమ కస్టడీలోని వ్యక్తులపై హింస ప్రయోగించలేదా?

ప్రతిపక్షాలు– ప్రజాసంఘాలతో చర్చలు

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ముఖ్యంగా ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేటప్పుడు రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలతో సంప్రదింపులు జరపాలి. సమావేశం ఏర్పాటు చేయాలి.

సెక్షన్ 30 దుర్వినియోగం

ఈ సెక్షన్ నిరంతరం దుర్వినియోగం అవుతూంటుంది. సెక్షన్ 144 సి.ఆర్.పి.సి ప్రకారం పౌరహక్కులపై పరిమిత కాలం పాటు షరతులు విధించి నియంత్రించటానికి కార్యనిర్వాహక వర్గానికి అధికారం ఉంది. కాని ఆ పేరుతో అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలలో చట్టంలో పేర్కొన్న కాల పరిమితి కంటే ఎక్కువ సమయం నియంత్రిస్తున్నారు. ఆచరణలో రాజ్యాంగం ఇచ్చిన పౌరహక్కులను నిషేధిస్తున్నారు. ఈనెల 6న విజయవాడ కమిషనర్ ఇచ్చిన ('సాక్షి') ప్రకటన ప్రకారం జనవరి 6వ తారీకు నుంచి మార్చి 31వ వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుంది. అంటే ఒకేసారి 85 రోజులు ఈ చట్టాన్ని విధించారు. అంతటి ప్రత్యేక పరిస్థితులు (ప్రమాదాలు) ఏం ఉన్నాయో ప్రభుత్వమే చెప్పాలి. అన్ని నగరాలు, పట్టణాలలో ఈ చట్టాన్ని నిరంతరం ప్రయోగిస్తూనే ఉన్నారు.

1861 చట్టమా? 1859 చట్టమా?

అసలు పోలీస్ చట్టం–1861 ఆంధ్రప్రదేశ్‌కి వర్తిస్తుందా అనేది సందేహం. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకించి 1859లో ఆమోదించబడిన ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) డిస్ట్రిక్ట్ యాక్ట్– 1859, యాక్ట్ నెం. 24 (రోమన్ అంకెలు) ఆఫ్ 1859 ఉన్నది. ఈ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వాలకు పోలీసులపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. ఈ చట్టం ఉండగా 1861 చట్టం సెక్షన్ 3లో ఉన్న అధికారాలను ఉపయోగిస్తూ ప్రభుత్వం జీవో నెం.1 తీసుకు వచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేక చట్టం ఉండగా వేరే చట్టాన్ని ఉపయోగించి జీవో తీసుకురావటమనేది చట్టపరంగా నిర్ధారణ కావాల్సి వుంది.

1861వ చట్టం మార్పు అవసరం

ప్రజాస్వామ్య పోలీసింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఈ చట్టం ఏ విధంగాను సహాయపడదు. ప్రభుత్వానికి పోలీసులపై ఎటువంటి మార్గదర్శకాలు, నియంత్రణలు లేని పర్యవేక్షణ అధికారాన్ని ఈ చట్టం ఇచ్చింది. ఫలితంగా పోలీసు వ్యవస్థలో రాజకీయ ప్రభావం విపరీతంగా పెరిగి...చట్టబద్ధంగా నడుచుకోవాల్సిన పోలీసులు...రాజకీయ నాయకుల చట్ట వ్యతిరేక సిఫార్సులకు తలొగ్గి పనిచేస్తున్నారు. పోలీసు జవాబుదారీతనానికి సరైన యంత్రాంగాన్ని ఈ చట్టం కల్పించలేదు. 1857లో జరిగిన సిపాయి తిరుగుబాటు తరువాత వచ్చిన ఈ చట్టం బ్రిటీషు అవసరాలకు అనుగుణంగా ఉన్నది. నేషనల్ పోలీసు కమిషన్ 1981లో ఇచ్చిన 8వ నివేదికలో ...ఒక నమూనా పోలీసు చట్టాన్ని తయారు చేసి అందించింది. అంటే 1861వ చట్టం స్థానంలో అలాంటి చట్టం వుండాలని సూచించింది.

ఉపసంహరించాల్సిందే!

ఏదో ఒక కారణంతో ప్రశ్నించే వారి గొంతు నొక్కి పౌరహక్కులపై నిర్బంధం తీసుకురావటం సరైన చర్య కాదు. సభలు, సమావేశాలపై సహేతుక షరతులు విధించి ప్రజా భద్రతను, సౌకర్యాలను కాపాడవచ్చు. కనుక ప్రభుత్వం వెంటనే ఈ జీవోను ఉపసంహరించాలి.

/ వ్యాసకర్త : ఎ.పి.సి.ఎల్.ఎ ప్రధాన

19న సికింద్రాబాద్ - విజయవాడ మధ్య వందే భారత్ రైలు ప్రారంభం

- జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 19 తేదీన సికింద్రాబాద్ - విజయవాడ మధ్య నడిచే వందే భారత్ రైలును ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో జరిగే ఈ కార్యక్రమంలో వందే భారత్ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీంతో పాటు మరికొన్ని రైల్వే ప్రాజెక్టులకూ ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఖాజీపేటలో నిర్మించనున్న పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాప్ ప్రాజెక్టు టెండర్ పనులను రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ కొద్దిరోజుల క్రితమే ఖరారు చేసింది. ఆ పనులకు ప్రధాని శంకుస్థాపన చేసే అవకాశముంది. అలాగే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు సంబంధించి రూ.700 కోట్ల ప్రాజెక్టు టెండర్లు ఇటీవలే ఖరారయ్యాయి. ఈ పనులనూ ప్రధాని ప్రారంభించేలా రైల్వేశాఖ కార్యక్రమం రూపొందిస్తోంది. సికింద్రాబాద్-మహబూబ్ నగర్ రెండో లైన్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే అవకాశం ఉంది.

FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/1168/2018 23-11-2022

Canara Bank, Hindu College High School Campus Branch, Guntur District
Versus
M/s Vijayalakshmi Raghavendra Cotton Mill & Others

To
(CD 1) M/s Vijayalakshmi Raghavendra Cotton Mill Rep by its Prop Smt Mandala Venu Kumari, Ward No. 3, C/o. Sri Vigneswara Cotton Ginning Mill, S.K.R. Estate, Eturkuru Road, Guntur District.
(CD 2) Smt Mandala Venu Kumari, W/o Pamula Reddy, D.No. 25/10-78/B, 3rd Lane, Srinivasarao Thota, Guntur District.
(CD 3) Sri Pamula Reddy, W/o Venkata Subba Reddy, D.No. 25/10-78/B, 3rd Lane, Srinivasarao Thota, Guntur District.
(CD 4) Sri Yenumala Rajesh, S/o Venkateswarulu, 6th Line, Srinivasarao Peta, Guntur District.
(CD 5) Sri Ramireddy Satish Reddy, S/o Yogi Reddy, 8-3-677/41, Sri Krishna Devarayanagar, Hyderabad-500009.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in OA/897/2017 an amount of **Rs.10,57,14,316.00/- (Rupees Ten Crores Fifty Seven Lakhs Fourteen Thousand Three Hundred Sixteen Only)** along with pendentellite and future interest @ 12.15 % p.a. with monthly rests w.e.f. 20/10/2017 till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **11/01/2023** at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

Given under my hand and the seal of the Tribunal, on this date: 23/11/2022
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No.456 of 2018 in OA No.531 of 2017

Canara Bank, Chandramouli Nagar Branch, Guntur District
Versus
M/s Touch Textiles & Others

To :
(CD-1) M/s Touch Textiles, Rep by its Proprietor office at D.No.3-18-41/9, Kundula Road, Krishna Nagar, Guntur.
(CD-2) Sri G.V.Krishna Varma, S/o Kanyasara Kasparaju, Flat No.413, My Home Apartments, Navoday Colony, Besides Ganapathy Complex, Guntur.
(CD-3) Sri K.J.A.A.R. Prasad, S/o Kanyasara Kasparaju, D.No.3-33-54, NGO Colony area, Narasaraopet, Guntur District.
(CD-4) Chintamalla Palankaiah. S/o Gopaiah, D.No.5093-30,6/13, Brodipet, Guntur District.

Whereas in execution of Recovery Certificate dated 23.05.2018 in O.A. No.531/2017 for **Rs.1,03,41,901/-** with future interest @ 13.15% p.a. with monthly rests from 27.07.2017 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors / Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SPECIFICATION OF PROPERTIES

SCHEDULE-B: Property belonging to Ch.Palankaiah, doc.no.2901/2011 dt.20.05.2011, SRO Piduguralla – Item No.1: All that is a land admeasuring an extent of Ac.0.55 cents out of total extent of Ac.0.75 cents of land situated at Piduguralla Village & Panchayat, Narasaraopet, Guntur District, SRO Limits of Piduguralla. Boundaries of site: East : Land of G. Mark, South: Land of M.Chandraiah West: Donka, North: Land belongs to G.Venkateswarulu

SCHEDULE-B: Property belonging to Sri K.J.A.Rajendra Prasad Regd. Gift deed Doc.no.10728/2010 dt. 27.07.2010, SRO Narasaraopet - Item No.2 All that is a site admeasuring an extent of 303.33 sq.yds together with 10 years old aged construction with ground, first, second, third floors residential building covered by D.No.28/4C, at Ravipadu Village, & Panchyat, Narasaraopet Mandal, Guntur District and SRO Limits of Narasaraopet. Boundaries of site: East: Road, South: Remaining Land of Vendor, West: Site of P.Innaiah and others, North Land belonged to P. Archamma.

Given under my hand and the seal of the Tribunal, on this date: 30/11/2022
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION

RC/360/2019 30-11-2022

CANARA BANK
Versus
M/s. Mukesh Rice Industries, Rep. by its Prop. Mrs Dalavayi Nagamalleswari

To
(CD1) M/s. Mukesh Rice Industries, rep. by its Prop. Mrs Dalavayi Nagamalleswari, Bondaru Veeraiah Street, Kamma Seshaiah Grounds, Suryadeavara Estate, Etukuru Road, Guntur.
(CD2) Smt. Dalavayi Nagamalleswari, W/o Subba Rao, D.No 3/7, Vidyanagar, Guntur

Whereas in execution of Recovery Certificate dated 31/12/2019 in OA/91/2018 for **Rs.2,18,93,038.16 ps.** (Rupees Two Crore Eighteen Lakhs Ninety Three Thousands Thirty Eight And Paise Sixteen Only) along with pendentellite and future interest @ 13.00 % per annum Compound Interest Monthly w.e.f. 08/02/2019 till realization and costs forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You are hereby informed that the **11/01/2023 at 10.30 A.M.** has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attached to the said properties or any portion thereoff.

SPECIFICATION OF PROPERTIES

SCHEDULE-A: Vacant site of 290.4 sq.yds situated at D.No. 393/BA of Guntur, near Door No. 7-6-710/1, Rajiv Gandhi Nagar, 10th line, Opp New Guntur Railway station, SRO Guntur (R.O), Guntur District with the following boundaries: East: Railway Road, West: Srimarthi Venkateswarlu, North: Road, South: V Venkata Subesh.

SCHEDULE-B: Rice Mill along with sheds/buildings thereon situated in D.No. 1123/1, 1133,1134 near D.No. 19- 8-113/8, Kammaseshaiah Ground, Etukuru Road, SRO Guntur (R.O), Guntur District with the following boundaries: East : Road, West: G Kondala Rao, North: K Nagamalleswara Rao, South: Road.

SCHEDULE-C: Vacant site of 70 sq.yds situated at D.No. 169, New ward no.5, Block no.12, T.S.No. 714, Door No 7-16-157, Besides Pamulapati Heights, Arundalpeta 10th line, Donka Road, Guntur SRO Guntur (R.O), Guntur District with following boundaries: East: Pamulapati Heights apartment, West P Venkataramana, North: Pamulapati Heights Passage, South: Donka Road

Given under my hand and the seal of the Tribunal, on this date: 30/11/2022
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

ఫ్రెంచ్‌లో కొనసాగుతున్న ఫ్యామిలీ డాక్టర్ల సమ్మె



పారిస్ : ఫ్రెంచ్‌లో ఫ్యామిలీ డాక్టర్లు వీధుల్లోకి వచ్చి సమ్మె చేస్తున్నారు. తమ పని పరిస్థితులను మెరుగుపరచాలని, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ రుసుమును పెంచాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లోని ఫ్యామిలీ డాక్టర్లు సమ్మెబాట పట్టారు. ఈ సమ్మెలో 'మేము మిమ్మల్ని నయం చేస్తున్నాము. మీరు మమ్మల్ని నయం చేయండి' అంటూ డాక్టర్లు నినాదాలు చేశారు. ఈ సమ్మెలో పాల్గొన్న వైద్యుడు అలెక్సియా గ్రెడెక్ మాట్లాడుతూ.. 'పెద్ద పట్టణాల్లో ఉన్న ఫ్యామిలీ డాక్టర్లు వనరుల కొరతతో రోగులకు సరైన చికిత్స చేయలేకపోతున్నారని' అన్నారు. మొదట డాక్టర్ల యూనియన్లు డిసెంబర్ 26 నుండి జనవరి 2 వరకు సమ్మెకు పిలుపునిచ్చాయి. వారి డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోవడంతో జనవరి 8 వరకు సమ్మెను కొనసాగించనున్నాయి. డాక్టర్లు సమ్మెబాట పట్టడంతో వారి డిమాండ్ల పరిష్కారానికి మాక్రాన్ ప్రభుత్వం కొత్త విధానాలను ప్రకటించే యోచనలో ఉన్నట్లు మీడియా వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణలో రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు

- రెండు గంటల్లో ఆరు చోట్ల చేతివాటం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో చైన్‌స్నాచర్లు మరోసారి రెచ్చిపోయారు. రెండు గంటల వ్యవధిలోనే ఆరు చోట్ల చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. పక్కా పథకం ప్రకారం రాచకొండ, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని ఉప్పల్ రాజధాని, కల్యాణపురి, నాచారం నాగేంద్రనగర్, ఓయూలోని రవీంద్రనగర్, చిలకలగూడలోని రామాలయం గుండు, రామ్‌గోపాల్‌పేట్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వారిని లక్ష్యంగా చేసుకున్న దోపిడీ దొంగలు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. మాస్క్‌లేసుకుని బైక్‌పై వచ్చిన నిందితులు మహిళల మెడలోని బంగారు ఆభరణాలను లాక్కెళ్లారు. ఉప్పల్‌లో ఉదయం 6:20 నుంచి 6:40 నిమిషాల్లోనే రెండుచోట్ల.. నాచారంలో 7:10 గంటలకు, ఓయూలో 7:40గంటలకు, చిలకలగూడలో ఎనిమిది గంటలకు, రామ్‌గోపాల్‌పేట్‌లో 8:20 నిమిషాలకు చోరీలకు పాల్పడ్డారు. కేవలం రెండు గంటల్లో పనిముగించుకుని ఉడాయించారు. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు నిందితులను పట్టుకునేందుకు పది ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. పలు బస్తీల్లో తనిఖీలను నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని పోలీసులు ప్రశ్నించారు. నిందితులు ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని సికింద్రాబాద్ ప్యారడైస్ హోటల్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నార్త్ ఇండియాకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. స్నాచింగ్‌ల అనంతరం రైలులో పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

మరో ఆరు నెలల గడువు పొడిగింపు!

- సిఎఎ నిబంధనల రూపకల్పనకు హోం మంత్రిత్వశాఖ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నిబంధనలు రూపొందించేందుకు మరో ఆరు నెలలు గడువు పొడిగించాలని పార్లమెంట్ లెజిస్లేషన్ సబ్ కమిటీని కోరినట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ నిబంధనలు రూపొందించకుండా సిఎఎ అమలు చేయడం సాధ్యం కాదు. మోడీ ప్రభుత్వం 2019లో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సిఎఎ బిల్లును ఆమోదింపజేసుకున్న సంగతి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబర్ 31కి ముందు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలో ప్రవేశించిన హిందూ, సిక్కు, పార్సీ, క్రిస్టియన్, బౌద్ధ, జైన మతాలకు చెందిన వారికి ఎటువంటి పత్రాలు లేకపోయినా పౌరసత్వం ఇచ్చే అవకాశముంది. సిఎఎపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సిఎఎ నిబంధనల రూపకల్పనకు జూన్ 30 వరకూ గడువు పొడిగించాలన్న మంత్రిత్వశాఖ అభ్యర్థనకు రాజ్యసభ కమిటీ ఆమోదించింది. లోక్‌సభ కమిటీ ఈ నెల 9వ తేదీ వరకూ గడువు కోరింది. పార్లమెంటరీ వర్క్ మేన్యువల్ ప్రకారం చట్టం ఆమోదించబడిన ఆరు నెలల వ్యవధిలో ఆ మంత్రిత్వశాఖ చట్టానికి సంబంధించిన నిబంధనలను రూపొందించలేకపోతే, అందుకు కారణాలను పేర్కొంటూ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ నుంచి సమయం పొడిగించేందుకు అనుమతి కోరాల్సి ఉంది. ఈ నిబంధనల రూపకల్పనకు గడువు పెంచాలన్న హోం మంత్రిత్వశాఖ విజ్ఞప్తి మేరకు ఇప్పటివరకూ ఆరుసార్లు గడువు పొడిగించారు. తాజాగా ఆ కమిటీలు ఆమోదిస్తే గడువును ఏడోసారి పొడిగించినట్లవుతుంది.

పైలట్‌సహా నలుగురు సిబ్బందిపై షోకాజ్ నోటీసులు

- ఎయిర్ ఇండియా సిఇఒ క్షమాపణలు
- విమానాల్లో ఆల్కహాల్ సర్వీస్ విధానంపై సమీక్ష..!

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణికురాలిపై ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై తాజాగా ఎయిర్ ఇండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్ స్పందించారు. ఘటన జరగడం దురదృష్టకరమని.. ఇందుకు గానూ, క్షమాపణలు కోరుతున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మరోవైపు అంతర్జాతీయ విమానాల్లో ఆల్కహాల్ సర్వీస్ విధానాన్ని సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. విమానంలో ఆల్కహాల్ సర్వీస్, సంఘటనల మేనేజ్‌మెంట్, బోర్డులో ఫిర్యాదుల నిర్వాహణ, నమోదుతోపాటు సిబ్బంది వల్ల ఇతర లోపాలు ఉన్నాయా అనే దానిపై అంతర్గత దర్యాప్తులు వంటి అంశాలపై ఎయిర్‌లైన్ సమీక్ష చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలోని ముంబైకి చెందిన శంకర్ మిశ్రా నవంబర్ 26న న్యూయార్క్ నుంచి ఢిల్లీకి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించాడు. బిజినెస్ క్లాస్‌లో ట్రావెల్ చేసిన మిశ్రా మద్యం మత్తులో ఒక వృద్ధురాలిపై మూత్ర విసర్జన చేసిన విషయం తెలిసిందే. ఈ విషయం ఇటీవల వెలుగులోకి రావడంతో ముంబై పోలీసులు కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో పైలట్, నలుగురు సిబ్బందిపై ఎయిర్ ఇండియా చర్యలు చేపట్టింది. వారికి షోకాజ్ నోటీస్ జారీ చేయడంతోపాటు విధులకు దూరంగా ఉంచి గ్రౌండ్ చేసింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న మిగతా సిబ్బందిపై అంతర్గత దర్యాప్తు జరుపుతున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.

మందకొడిగా రబీ నాట్లు..!

- రెండు జిల్లాల్లో మూడున్నర లక్షల ఎకరాల్లో సాగు
- ఇప్పటి వరకూ 70 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు
- జనవరి రెండో వారం వచ్చినా 20 శాతం దాటని దుస్థితి
- నెలాఖరు వరకూ నాట్లు కొనసాగే అవకాశం
- 20వ తేదీ తర్వాత వంతుల విధానం అమల్లోకి!
- కొల్లేరు భూములు ఇ-క్రాప్ సంగతేమిటి?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ మందకొడిగా రబీనాట్లు సాగుతున్నాయి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఆలస్యం రబీ సాగుపై పడింది. దీంతో జనవరి రెండో వారం వచ్చినా 20 శాతం మాత్రమే రబీ నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుత రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 1,09,895 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తున్నారు. ఖరీఫ్ మాసూళ్లు త్వరితగతిన పూర్తయినప్పటికీ ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఇబ్బందులతో రైతులు రబీ సాగులో ముందుకెళ్లలేకపోయారు. దీంతో జనవరి రెండోవారం వచ్చినప్పటికీ పశ్చిమగోదావరి జిల్లాలో 43 వేల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 27 వేల ఎకరాల్లో మాత్రమే రబీ నాట్లు పూర్తయ్యాయి. అంటే రెండు జిల్లాల్లోనూ కలిపి 20 శాతం వరకూ నాట్లు జరిగాయి. ఇంకా దాదాపు 80 శాతం నాట్లు వేయాల్సి ఉంది. జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు సాగే అవకాశం ఉందని దీన్నిబట్టి తెలుస్తోంది. జనవరి 20వ తేదీ తర్వాత వంతులవారీ విధానం అమల్లోకి తెచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. దీంతో రైతుల్లో ఒకింత ఆందోళన సైతం నెలకొంది. రబీలో నాట్లు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకోలేకపోయారనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లోనూ అత్యధికంగా బెంగాలీ కూలీలు రబీ నాట్లు వేసే ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఎకరానికి రూ.నాలుగు వేలు చొప్పున కాంట్రాక్ట్‌కు తీసుకుని జిల్లాలో నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు రబీ మాసూళ్ల సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన సైతం ఇప్పటి నుంచే వెంటాడుతోంది. ఖరీఫ్‌లో తెచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తేమశాతం, తూకం తేడాల పేరుతో రైతుల నుంచి మిల్లర్లు డబ్బు తిరిగి కట్టించుకోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే పరిస్థితి రబీలో ఎదురైతే ఏమిటనే ప్రశ్న రైతులను వెంటాడుతోంది.

కొల్లేరు భూములకు ఇ-క్రాప్ ఎలా..!

రెండు జిల్లాల పరిధిలోని దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ఆకివీడు, కైకలూరు వంటి పలు మండలాల పరిధిలో కొల్లేరు భూముల్లో రైతులు సాగు చేశారు. వీటిని అనసరి భూములంటారు. ఈ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండవు. వందల ఏళ్ల నుంచి రైతులు పన్ను కట్టి సాగు చేసుకుంటున్న భూములివి. ఇ-క్రాప్ కాని భూములకు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం చెబుతోంది. మరీ పట్టాదారు పాస్ పుస్తకాలు లేని కొల్లేరు భూములను రైతులు ఇ-క్రాప్ ఏవిధంగా చేసుకోవాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇ-క్రాప్ చేయకపోతే రబీ సాగు పూర్తయ్యాక రైతులు ధాన్యం ఏవిధంగా విక్రయించాలో తెలియని పరిస్థితి ఏర్పడనుంది. కొల్లేరులో సాగైన వరి భూములకు సంబంధించి ఇ-క్రాప్ నమోదుపై జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటి నుంచే సరైన నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలులో ఇబ్బంది పెడితే తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని చెబుతున్నారు. కొల్లేరు భూముల్లోని ధాన్యం కొనుగోలుపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) — Andhra, Corporation

మాచవరం బ్రాంచి : ఏలూరు రోడ్డు, ఎస్.ఆర్.ఆర్. కాలేజ్ దగ్గర, మాచవరం, విజయవాడ, ఎపి-520004. ఫోన్ : 0866-243530, 2436767

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మాచవరం బ్రాంచి** ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మాచవరం బ్రాంచి, వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 25-01-2023న** ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది :** ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

1) ఋణగ్రహీత : శ్రీ రమేష్ బచ్చు, తండ్రి : నరసింహం బచ్చు, డి.నెం. 24-29-222/ఎ, శ్రీ సాయి బాబా వీధి, గులాబీతోట, గాంధీనగరం, విజయవాడ-520003. **తనఖాదారు : శ్రీ రమేష్ బచ్చు,** తండ్రి : నరసింహం బచ్చు, డి.నెం. 24-29-222/ఎ, శ్రీ సాయి బాబా వీధి, గులాబీతోట, గాంధీనగరం, విజయవాడ-520003. **కో ఆబ్లిగెంట్ : శ్రీమతి వెంకట తరుణ కుమారి బచ్చు,** భర్త : రమేష్ బచ్చు, డి.నెం. 24-29-222/ఎ, శ్రీ సాయి బాబా వీధి, గులాబీతోట, గాంధీనగరం, విజయవాడ-520003.
బకాయి మొత్తం : ది. 30-04-2021 నాటికి బకాయి రూ. 29,28,565.66 (అక్షరాలా ఇరవై తొమ్మిది లక్షల ఇరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై ఐదు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే) ది. 01-05-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : విజయవాడ, సింగ్ నగర్, నందమూరి నగర్, డి.నెం. 43-106-1-58, ఆర్.ఎస్.నెం. 17 వద్ద 39 చ॥గ॥ల అవిభక్త వాటాతో కలిపి మొత్తం 1661.31 చ॥గ॥ల విస్తీర్ణంలో సియంఆర్ హ్యాపీ హెూమ్స్ నందు ప్లింత్ ఏరియా 741 చ॥అ॥, కామన్ ఏరియా 287.59 చ॥అ॥లు మరియు పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥తో గ్రౌండ్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 103. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ ఆస్తి, **దక్షిణం :** ఎస్. లలితాదేవి గారి ఆస్తి, **పడమర :** 33 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** 33 అ॥ వెడల్పు రోడ్డు మరియు యలమంద గారి ఆస్తి. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** కామన్ కారిడార్ మరియు శూన్యాకాశము, **పడమర :** మెట్లు మరియు శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3070/2017, తేది : 22-03-2017, ఎస్.ఆర్.ఓ. విజయవాడ.**

రిజర్వు ధర : రూ. 22,70,000/-   ధరావత్తు : రూ. 2,27,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

2) ఋణగ్రహీత : శ్రీమతి గద్దం వెంకటరమణమ్మ, భర్త : జి. లక్ష్మి నరసరెడ్డి, డి.నెం. 6-223-1-1, శ్రీ లక్ష్మి నాగసాయి రెసిడెన్సీ, బడేవారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, రామవరప్పాడు, విజయవాడ - 521108. **తనఖాదారు : శ్రీమతి గద్దం వెంకటరమణమ్మ,** భర్త : జి. లక్ష్మి నరసరెడ్డి, డి.నెం. 6-223-1-1, శ్రీ లక్ష్మి నాగసాయి రెసిడెన్సీ, బడేవారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, రామవరప్పాడు, విజయవాడ - 521108. **కో ఆబ్లిగెంట్ : శ్రీ గద్దం లక్ష్మి నరసరెడ్డి,** తండ్రి : గద్దం చంద్రారెడ్డి, డి.నెం. 6-223-1-1, శ్రీ లక్ష్మి నాగసాయి రెసిడెన్సీ, బడేవారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, రామవరప్పాడు, విజయవాడ - 521108.
బకాయి మొత్తం : ది. 30-04-2021 నాటికి బకాయి రూ. 30,61,425.85 (అక్షరాలా ముప్పై లక్షల అరవై ఒక్క వేల నాలుగు వందల ఇరవై ఐదు రూపాయల ఎనభైఐదు పైసలు మాత్రమే) ది. 01-05-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : విజయవాడ, నందమూరి నగర్, ముత్యాలంపాడు, దగ్గరి డి.నెం. 43-106-1-58, ఆర్.ఎస్.నెం. 17 వద్ద 1661.31 చ॥గ॥ల విస్తీర్ణంలోని అవిభక్త వాటా 39 చ॥గ॥ల విస్తీర్ణంలో సీ.యం.ఆర్. హ్యాపీ హెూమ్స్ నందు ప్లింత్ ఏరియా 741 చ॥అ॥, కామన్ ఏరియా 287.59 చ॥అ॥లు మరియు పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥తో 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 403. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ ఆస్తి, **దక్షిణం :** ఎస్. లలితాదేవి గారి ఆస్తి, **పడమర :** 33 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** 33 అ॥ వెడల్పు రోడ్డు మరియు యలమంద గారి ఆస్తి. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** కామన్ కారిడార్ మరియు శూన్యాకాశము, **పడమర :** మెట్లు మరియు శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3283/2017, తేది : 27-03-2017, ఎస్.ఆర్.ఓ. విజయవాడ.**

రిజర్వు ధర : రూ. 22,70,000/-   ధరావత్తు : రూ. 2,27,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

3) ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) : శ్రీ పాణిగ్రాహి అశ్వని కుమార్, తండ్రి : జగన్‌మోహన్‌రావు, డి.నెం. 10-3-42, సంపర తాతబ్బయ్య వీధి, మల్లిఖార్జునపేట, విజయవాడ-520001. **2) శ్రీమతి పాణిగ్రాహి ప్రశాంతి,** భర్త : అశ్వని కుమార్, డి.నెం. 10-3-42, సంపర తాతబ్బయ్య వీధి, మల్లిఖార్జునపేట, విజయవాడ-520001.
బకాయి మొత్తం : ది. 02-04-2021 నాటికి రూ. 25,30,725.63 (అక్షరాలా ఇరవై ఐదు లక్షల ముప్పై వేల ఏడు వందల ఇరవై ఐదు రూపాయల అరవై మూడు పైసలు మాత్రమే) మరియు ది 02-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 5095/2016, తేది : 28-07-2016, ఎస్.ఆర్.ఓ. పటమట : తనఖా పెట్టబడిన ఆస్తి : భూమి మరియు నివాస భవనం - శ్రీ పాణిగ్రాహి అశ్వనీకుమార్ గారి పేరిట కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామం, మురళీనగర్, డోర్ నెం. 19-140/1, ఆర్.ఎస్.నెం. 22/2 వద్ద అవిభక్త వాటా 42 చ॥గ॥లు కలిపి మొత్తం 337 చ॥గ॥ల విస్తీర్ణంలో ప్లింత్ ఏరియా 800 చ॥అ॥ల విస్తీర్ణం (కామన్ ఏరియాతో కలిపి),కార్ పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లతో చెలసాని వారి నీలాద్రి నిలయం అపార్ట్‌మెంట్ నందు రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్ -1. **అపార్ట్‌మెంట్‌కు హద్దులు : తూర్పు :** 24 అ॥ వెడల్పుగల పంచాయితీ రోడ్డు, **దక్షిణం :** శ్రీ చాగంటిపాటి సుబ్బారావు గారికి చెందిన ఆస్తి, **పడమర :** ఇతరుల ఆస్తి, **ఉత్తరం :** శ్రీమతి కామరాల సూర్యాకాంతం గారికి చెందిన ఆస్తి. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** ఫ్లాట్ నెం. ఎస్ఎఫ్-2, మెట్లు, **దక్షిణం :** శూన్యాకాశము.

రిజర్వు ధర : రూ. 25,20,000/-   ధరావత్తు : రూ. 2,52,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

4) ఋణగ్రహీత : శ్రీ మేకల శివకృష్ణ, తండ్రి : మేకల నాగేంద్రరావు, డి.నెం. 2-17, ఫ్లాట్ నెం. 102, గ్రౌండ్ ఫ్లోర్, లక్ష్మి దేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా. **2. శ్రీమతి బి. ప్రవల్లిక,** భర్త : యం. శివ కృష్ణ, డి.నెం. 2-17, ఫ్లాట్ నెం. 102, గ్రౌండ్ ఫ్లోర్, లక్ష్మి దేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా. **తనఖాదారులు : 1. శ్రీ మేకల శివకృష్ణ,** తండ్రి : మేకల నాగేంద్రరావు, డి.నెం. 2-17, ఫ్లాట్ నెం. 102, గ్రౌండ్ ఫ్లోర్, లక్ష్మి దేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా. **2. శ్రీమతి బి. ప్రవల్లిక,** భర్త : యం. శివ కృష్ణ, డి.నెం. 2-17, ఫ్లాట్ నెం. 102, గ్రౌండ్ ఫ్లోర్, లక్ష్మి దేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా.
బకాయి మొత్తం : ది. 31-03-2021 నాటికి బకాయి రూ. 34,11,106.69 (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల పదకొండు వేల నూట ఆరు రూపాయల అరవై తొమ్మిది పైసలు మాత్రమే) ది. 01-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, విజయవాడ, ప్రసాదంపాడు, కానూరు రోడ్డు, ఏషియన్ పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆర్.ఎస్.నెం. 85/4, ఎల్‌పి. నెం. 1/97, ఫ్లాట్ నెం. 7 & 8 నందు అవిభక్త వాటా 30 చ॥గ॥తో కలిపి 507.24 చ॥గ॥తో లక్ష్మీ శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కు చెందిన భూమి మరియు అందలి బిల్డింగ్ నందు ప్లింత్ ఏరియా 900 చ॥అ॥, కామన్ ఏరియా 125 చ॥అ॥, కార్‌పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లో నిర్మితమైన ఫ్లాట్ నెం. 102. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 5 & 6, **పడమర :** 33 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** బి.ఎ. కుమార్ గారి ఆస్తి, **దక్షిణం :** ఫ్లాట్ నెం. 9, **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** లిఫ్ట్, కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 2056/2017, తేది : 18-04-2017, ఎస్ఆర్ఓ, గుణదల**

రిజర్వు ధర : రూ. 22,50,000/-   ధరావత్తు : రూ. 2,25,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

5) ఋణగ్రహీత : శ్రీమతి మొహ్మద్ ఆషాబేగం, భర్త : యం.డి. సుభాని, ఫ్లాట్ నెం. జి2, గ్రౌండ్ ఫ్లోర్, వెంకట రాఘవ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, దగ్గరి డి.నెం. 6-22, దేవి ప్లాజా రోడ్డు, ప్రసాదం పాడు గ్రామం, విజయవాడ రూరల్, కృష్ణా జిల్లా. **శ్రీ మొహ్మద్ సుభాని,** తండ్రి : యం.డి. సర్దార్, ఫ్లాట్ నెం. జి2, గ్రౌండ్ ఫ్లోర్, వెంకట రాఘవ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, దగ్గరి డి.నెం. 6-22, దేవి ప్లాజా రోడ్డు, ప్రసాదం పాడు గ్రామం, విజయవాడ రూరల్, కృష్ణా జిల్లా.
బకాయి మొత్తం : ది. 31-03-2021 నాటికి బకాయి రూ. 28,98,029.49 (అక్షరాలా ఇరవై ఎనిమిది లక్షల తొంభై ఎనిమిది వేల ఇరవై తొమ్మిది రూపాయల నలభైతొమ్మిది పైసలు మాత్రమే) ది. 01-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామం, ఆర్.ఎస్.నెం. 70/6 మరియు 88/1, దగ్గరి డోర్ నెం. 6-22, దేవి ప్లాజా రోడ్డు లో వెంకట రాఘవ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ నందు పేర్కొనబడని వాటా 30 చ॥గ॥లతో కలిపి 246 చ॥గ॥ విస్తీర్ణంలోని నివాస ఫ్లాట్ యొక్క ప్లింత్ ఏరియా 905 చ॥అ॥, కామన్ ఏరియా 120 చ॥అ॥, కార్ పార్కింగ్ ఏరియా 110 చ॥అ॥ల విస్తీర్ణంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం. జి-2. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** వి.కాశియ్య గారి ఆస్తి, **పడమర :** 18 అ॥ వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** సి. హెచ్. సాయి ప్రసాద్ గారి ఆస్తి, **దక్షిణం :** ఎన్. వేంకటరాజు గారి ఆస్తి, **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** మెట్లు, కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 5101/2016, తేది : 30-09-2016, ఎస్ఆర్ఓ, గుణదల**

రిజర్వు ధర : రూ. 20,70,000/-   ధరావత్తు : రూ. 2,07,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

6) ఋణగ్రహీత : 1) శ్రీమతి మొహ్మద్ రజియా బేగం, తండ్రి : మొహ్మద్ సుభాని, ఫ్లాట్ నెం. 403, 3వ అంతస్తు, లక్ష్మి శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆదర్శ మహిళా ప్రాథమిక పాఠశాల రోడ్డు, కానూరు రోడ్డు, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ రూరల్. **తనఖాదారు : శ్రీమతి మొహ్మద్ రజియా బేగం,** తండ్రి : మొహ్మద్ సుభాని, ఫ్లాట్ నెం. 403, 3వ అంతస్తు, లక్ష్మి శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆదర్శ మహిళా ప్రాథమిక పాఠశాల రోడ్డు, కానూరు రోడ్డు, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ రూరల్. **కో అబ్లిగెంట్ / హామీదారు : శ్రీ మొహ్మద్ సుభాని,** తండ్రి : సర్దార్, ఫ్లాట్ నెం. 201, 1వ అంతస్తు, లక్ష్మి శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆదర్శ మహిళా ప్రాథమిక పాఠశాల రోడ్డు, కానూరు రోడ్డు, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ రూరల్.
బకాయి మొత్తం : ది. 31-03-2021 నాటికి బకాయి రూ. 34,32,323.32 (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల ముప్పై రెండు వేల మూడు వందల ఇరవై మూడు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే) ది. 01-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, విజయవాడ, ప్రసాదంపాడు, కానూరు రోడ్డు, ఏషియన్ పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆర్.ఎస్.నెం. 85/4, ఎల్‌పి. నెం. 1/97, ఫ్లాట్ నెం. 7 & 8 నందు అవిభక్త వాటా 30 చ॥గ॥తో కలిపి 507.24 చ॥గ॥తో లక్ష్మీ శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కు చెందిన భూమి మరియు అందలి బిల్డింగ్ నందు ప్లింత్ ఏరియా 900 చ॥అ॥, కామన్ ఏరియా 125 చ॥అ॥, కార్‌పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లో నిర్మితమైన మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 403. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 5&6, **పడమర :** 33 అ॥ వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం :** బి.ఎ. కుమార్ గారి ఆస్తి, **దక్షిణం :** ఫ్లాట్ నెం. 9. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** లిఫ్టు, కామన్ కారిడార్, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 1870/2018, తేది : 27-03-2018, ఎస్ఆర్ఓ, గుణదల**

రిజర్వు ధర : రూ. 22,50,000/-   ధరావత్తు : రూ. 2,25,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

7) ఋణగ్రహీత : శ్రీమతి గందు దుర్గా భవాని, ఎస్ఎఫ్-7, బ్లాక్ నెం. 35, జక్కంపూడి కాలనీ, విజయవాడ-520012. **శ్రీ. జి. లక్ష్మయ్య,** ఎస్ఎఫ్-7, బ్లాక్ నెం. 35, జక్కంపూడి కాలనీ, విజయవాడ-520012.
బకాయి మొత్తం : ది. 31-03-2021 నాటికి బకాయి రూ. 34,37,010.47 (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల ముప్పై ఏడు వేల పది రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) ది. 01-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : శ్రీమతి గందు దుర్గా భవాని & జి. లక్ష్మయ్య గార్ల పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు గ్రామం, కానూరు రోడ్డు, ఆదర్శ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రోడ్డు, ఏషియన్ పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆర్.ఎస్.నెం. 85/4, ఎల్‌పి. నెం. 1/97, ఫ్లాట్ నెం. 7 & 8, డోర్ నెం. 2-17 వద్ద లక్ష్మీ శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కు చెందిన భూమి మరియు అందలి బిల్డింగ్ నందు ప్లింత్ ఏరియా 900 చ॥అ॥, కామన్ ఏరియా 125 చ॥అ॥, కార్‌పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లో రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 302. **అపార్ట్‌మెంట్‌కి తూర్పు :** ఫ్లాట్ నెం. 5&6, **పడమర :** 33 అ॥ వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం :** బి.ఎ. కుమార్ గారి ఆస్తి, **దక్షిణం :** ఫ్లాట్ నెం. 9. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** మెట్లు, కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 2055/2017, తేది : 18-04-2017, ఎస్ఆర్ఓ, గుణదల**

రిజర్వు ధర : రూ. 22,50,000/-   ధరావత్తు : రూ. 2,25,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

8) ఋణగ్రహీత : శ్రీ పరిమి పవన్, తండ్రి : పి. యజ్ఞనారాయణ, డి.నెం. 2-17, ఫ్లాట్ నెం. 104, గ్రౌండ్ ఫ్లోర్, లక్ష్మి శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, కానూరు రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ. **శ్రీ పరిమి యజ్ఞనారాయణ,** తండ్రి : పి. రాధాకృష్ణ మూర్తి, డి.నెం. 2-17, ఫ్లాట్ నెం. 104, గ్రౌండ్ ఫ్లోర్, లక్ష్మి శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, అశ్వని పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, కానూరు రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ.
బకాయి మొత్తం : ది. 31-03-2021 నాటికి బకాయి రూ. 33,04,334.80 (అక్షరాలా ముప్పై మూడు లక్షల నాలుగు వేల మూడు వందల ముప్పై నాలుగు రూపాయల ఎనభై పైసలు మాత్రమే) ది. 01-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, విజయవాడ, ప్రసాదంపాడు, కానూరు రోడ్డు, ఏషియన్ పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆర్.ఎస్.నెం. 85/4, ఎల్‌పి. నెం. 1/97, ఫ్లాట్ నెం. 7 & 8 నందు అవిభక్త వాటా 30 చ॥గ॥తో కలిపి 507.24 చ॥గ॥తో లక్ష్మీ శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కు చెందిన భూమి మరియు అందలి బిల్డింగ్ నందు ప్లింత్ ఏరియా 900 చ॥అ॥, కామన్ ఏరియా 125 చ॥అ॥, కార్‌పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో నిర్మితమైన ఫ్లాట్ నెం. 104. **అపార్ట్‌మెంట్‌కి తూర్పు :** ఫ్లాట్ నెం. 5&6, **పడమర :** 33 అ॥ వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం :** బి.ఎ. కుమార్ గారి ఆస్తి, **దక్షిణం :** ఫ్లాట్ నెం. 9. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** లిఫ్టు, కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 2057/2017, తేది : 18-04-2017, ఎస్ఆర్ఓ, గుణదల**

రిజర్వు ధర : రూ. 22,50,000/-   ధరావత్తు : రూ. 2,25,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

9) ఋణగ్రహీత : 1) శ్రీమతి వేమూరి నాగలక్ష్మి, భర్త : వేమూరి చంద్రశేఖర్, ఫ్లాట్ నెం. ఎఫ్-2, డోర్ నెం. 20-3/1-62 ఎ, రాజేశ్వరి నిలయం, చింతచెట్టు బజారు, ఆయోధ్యనగర్, విజయవాడ-520003, కృష్ణా జిల్లా. **2) శ్రీ వేమూరి చంద్రశేఖర్,** తండ్రి : వేమూరి నాగేశ్వరరావు, ఫ్లాట్ నెం. ఎఫ్-2, డోర్ నెం. 20-3/1-62 ఎ, రాజేశ్వరి నిలయం, చింతచెట్టు బజారు, ఆయోధ్యనగర్, విజయవాడ-520003, కృష్ణా జిల్లా. **తనఖాదారు : 1) శ్రీమతి వేమూరి నాగలక్ష్మి,** భర్త : వేమూరి చంద్రశేఖర్, ఫ్లాట్ నెం. ఎఫ్-2, డోర్ నెం. 20-3/1-62 ఎ, రాజేశ్వరి నిలయం, చింతచెట్టు బజారు, ఆయోధ్యనగర్, విజయవాడ-520003, కృష్ణా జిల్లా. **2) శ్రీ వేమూరి చంద్రశేఖర్,** తండ్రి : వేమూరి నాగేశ్వరరావు, ఫ్లాట్ నెం. ఎఫ్-2, డోర్ నెం. 20-3/1-62 ఎ, రాజేశ్వరి నిలయం, చింతచెట్టు బజారు, ఆయోధ్యనగర్, విజయవాడ-520003, కృష్ణా జిల్లా.
బకాయి మొత్తం : ది. 31-03-2021 నాటికి బకాయి రూ. 25,18,461.25 (అక్షరాలా ఇరవై ఐదు లక్షల పద్దెనిమిది వేల నాలుగు వందల అరవై ఒక్క రూపాయి ఇరవై ఐదు పైసలు మాత్రమే) ది. 01-04-2021 నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, విజయవాడ, ప్రసాదంపాడు, కానూరు రోడ్డు, ఏషియన్ పెయింట్స్ గోడౌన్ ఎదురు రోడ్డు, ఆర్.ఎస్.నెం. 85/4, ప్లాన్ నెం. 1/97, ఫ్లాట్ నెం. 7 & 8 నందు అవిభక్త వాటా 30 చ॥గ॥తో కలిపి 507.24 చ॥గ॥తో లక్ష్మీ శ్రీదేవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కు చెందిన భూమి మరియు అందలి బిల్డింగ్ నందు ప్లింత్ ఏరియా 900 చ॥అ॥, కామన్ ఏరియా 125 చ॥అ॥, కార్‌పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లో రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 304. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 5&6, **పడమర :** 33 అ॥ వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం :** శ్రీ బి.ఎ. కుమార్ గారి ఆస్తి, **దక్షిణం :** ఫ్లాట్ నెం. 9. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** లిఫ్టు, కామన్ కారిడార్, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 2054/2017, తేది : 18-04-2017, ఎస్ఆర్ఓ, విజయవాడ.**

రిజర్వు ధర : రూ. 22,50,000/-   ధరావత్తు : రూ. 2,25,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. **అధీకృత అధికారి** గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఋణ ఖాతాలు లేవు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు **అధీకృత అధికారి/ చీఫ్ మేనేజర్ శ్రీ మనీష్‌కుమార్ గుప్త** గారి మొబైల్ నెం. **7091377091, Mail ID: ubin0803715@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 07-01-2023
ప్రదేశం : మాచవరం

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఉత్తరాంధ్రకు ప్రభుత్వాల వెన్నుపోటు

- సుజల స్రవంతి, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, గిరిజన యూనివర్సిటీ కోసం ప్రజా ఉద్యమం
- 'ఉత్తరాంధ్ర చర్చా వేదిక' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలోని బిజెపి సర్కారు ఉత్తరాంధ్రపై వెన్నుపోటు విధానాలను అనుసరిస్తూ వస్తోందని, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని మూడేళ్లు ఇచ్చి నాలుగో ఏట నుంచి మానేసిందని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాగునీటి ప్రాజెక్టుకు నిధులివ్వడం లేదని, గిరిజన యూనివర్సిటీకి అతీగతీ లేదని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఉత్తరాంధ్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారు' అనే అంశంపై విశాఖలోని దసపల్లా హోటల్‌లో ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యాన శనివారం సదస్సు జరిగింది. బిజెపి, వైసిపి మినహా అన్ని పార్టీల ముఖ్యనేతలూ హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. సదస్సుకు ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అధ్యక్షత వహించారు.



అభివాదం చేస్తున్న పలు పార్టీల నాయకులు, మేధావులు

ఉత్తరాంధ్రలోని ఒక్కో జిల్లాకూ రూ.10 వేల కోట్లు ఇవ్వాలి : వి.శ్రీనివాసరావు

ఉత్తరాంధ్రలోని ప్రతి జిల్లాకు రూ.10 వేల కోట్లును కేంద్రం కేటాయిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఎలాగైతే జగన్ బటన్ నొక్కుతున్నాడో, పోలవరం, సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులకూ బటన్ నొక్కి నిధులు ఇచ్చినప్పుడే ఉత్తరాంధ్రకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తానని బిజెపి ఈ ప్రాంతాన్ని మోసం చేసిందని, మూడేళ్లపాటు రూ.50 కోట్లు ఇచ్చి తర్వాత ఎగ్గొట్టిందని తెలిపారు. ఎపికి హోదా లేకుండా చేసిందని, గిరిజన యూనివర్సిటీ రాలేదని, కొత్త రైల్వే జోన్ ఇచ్చినట్టే ఇచ్చి డివిజన్‌ను ఎత్తేసిందని అన్నారు. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ఉపసంహరించుకుని ఆదానీకి దాసోహం అయిందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో కేంద్రానికి వత్తాసు పలికేలా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉందని దుయ్యబట్టారు. ఈ ప్రాంతంలో ట్రేడ్ మార్క్‌గా ఉన్న కాఫీని ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ చేసి గిరిజనులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు.

భూములు కాజేశారు : మాజీ మంత్రి అయ్యన్న

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ విశాఖలో రూ.45 వేల కోట్ల విలువైన భూములను వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. మరో రూ.25 వేల కోట్ల విలువైన ప్రభుత్వ కార్యాలయ స్థలాలను బ్యాంకుల్లో కుదవబెట్టి జగన్ ప్రభుత్వం అప్పు తెచ్చుకోవడం సిగ్గుచేటన్నారు.

కేంద్రాన్ని అడిగే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి లేదు : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగినా, అందులో వాటా పేద, సాదలకు అందలేదన్నారు. పోలవరం పూర్తయితేనే సుజల స్రవంతి ఈ ప్రాంతానికి వస్తుందని తెలిపారు. పోలవరాన్ని జగన్ పూర్తి చేయలేడన్నారు. కేంద్రం దీనికి డబ్బులివ్వడం లేదని, అడిగే సత్తా వైసిపి ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.

ముఖ్య అతిథిగా హాజరైన లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్నికైన శాసనసభ్యులతో ప్రాంతీయ అభివృద్ధి బోర్డు ఏర్పాటు జరిగేలా కృషి చేయాలని, ఏ ప్రభుత్వమూ అభివృద్ధి చేయదని, అభివృద్ధిని మనమే చేసుకోవాలని అన్నారు. జనసేన రాష్ట్ర నేత నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రాజెక్టుల శంకుస్థాపనలే తప్ప పనులేవీ జరగడం లేదన్నారు. ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ వామపక్షాల పాత్ర ఈ ప్రాంత ప్రగతికి చాలా అవసరమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే కొనుక్కుంటే మంచిదని తెలిపారు. కేరళలో ఒక పేపరు మిల్లును అక్కడి సిపిఎం ప్రభుత్వం కొనుగోలు చేసి తర్వాతి సంవత్సరం నుంచే లాభాల బాటలో నడిపించిందన్నారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ మాజీ విసి బి.ముత్యాలనాయుడు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ, లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

జెపికి 'ఉక్కు' సెగ

ఉత్తరాంధ్ర చర్చా వేదిక సదస్సులో ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను కించపరుస్తూ, రెండేళ్లుగా కార్మికులు చేపడుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని దెబ్బతీసేలా లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ వ్యాఖ్యలు చేశారు. సదస్సులో మాట్లాడుతున్న ఆయనను 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మీ అభిప్రాయం చెప్పండి' అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు. జెపి వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభలో చాలాసేపు గలాటా సాగింది.


మహాసభ సందర్భంగా ముస్తాబైన గుంటూరు పట్టణం

నేటి నుంచి ఆవాజ్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని లాల్‌జాన్‌భాషా షాదిఖానాలో 8, 9 తేదీల్లో జరగనున్న అవాజ్ రాష్ట్ర 2వ మహాసభను జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.భాషా, ఎస్ఎకె జిలానీ పిలుపునిచ్చారు. గుంటూరు బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, ఆర్థిక వెనుకబాటుపై సమగ్రంగా చర్చించి, తగు కర్తవ్యాలు రూపొందిస్తామన్నారు. మహాసభ ప్రారంభం సందర్భంగా మొదటి రోజు ఉదయం 10.30 గంటలకు 'భారత రాజ్యాంగం, లౌకికవాద పరిరక్షణ' అంశంపై సదస్సు ఉంటుందని తెలిపారు. సదస్సులో ఎపి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్, ఆవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్, ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, షేక్.సాబ్జి, తెలంగాణ రాష్ట్ర అవాజ్ కార్యదర్శి ఎండి.అబ్బాస్, బ్రైట్ హారిజన్ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ చాంద్‌బాషా తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. ముస్లిం అభివృద్ధి, భద్రత, లౌకికవాదం లక్ష్యాలతో అవాజ్ పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో అవాజ్ నాయకులు ఖాసింవలి, సైదా, జానీ పాల్గొన్నారు.

మరో నాలుగు తుపాకులు స్వాధీనం

- అక్రమ ఆయుధాల కేసులో నిందితులకు ముగిసిన కస్టడీ
- 'అనంత' ఎస్‌పి ఫక్కీరప్ప

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారన్న కేసులో నిందితుల కస్టడీ శనివారంతో ముగిసింది. వారిచ్చిన సమాచారం మేరకు మరో నాలుగు తుపాకులు, రెండు తూటాలు, రెండు కిలోల గంజాయిని పట్టుకున్నట్టు అనంతపురం జిల్లా ఎస్‌పి కె.ఫక్కీరప్ప తెలిపారు. అనంతపురంలోని పోలీసు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారన్న కేసులో గత నెల 25న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన జంషీద్, ముబారక్, అమీర్ పాషా, గోవాకు చెందిన రియాజ్ షేక్, మధ్యప్రదేశ్‌కు చెందిన రాజపాల్ సింగ్ జునేజా, చోటు అలియాస్ చోటులాల్‌లు వారిలో ఉన్నారు. నిందితులను విచారించేందుకు కోర్టు గత నెల 31 నుంచి జనవరి 7వ తేదీ వరకు కస్టడీకి అనుమతినిచ్చింది. విచారణలో నిందితుల నుంచి పలు కీలక విషయాలను పోలీసులు రాబట్టారు. నిందితులు అక్రమంగా ఆయుధాలు, తూటాలు తయారు చేసి దేశంలోని పలు రాష్ట్రాలకు రవాణా చేయడమే కాకుండా మాదకద్రవ్యాలు కూడా విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజపాల్ సింగ్ జునేజా, చోటులాల్‌కు స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఆయుధాల తయారీ కుటీర పరిశ్రమగా ఉండేది. స్వాతంత్ర్యం తరువాత ప్రయివేటు వ్యక్తులెవరూ ఆయుధాలు చేయడానికి వీల్లేదు. అయినప్పటికీ కొంతమంది ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని ఎస్‌పి తెలిపారు. పట్టుబడిన రాజ్‌పాల్ సింగ్, చోటు కూడా అదే రకంగా ఆయుధాలను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో పని చేసిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

66 కేజీల గంజాయి స్వాధీనం

ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఆరుగురిని ఒంగోలు జిల్లా మద్దిపాడు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్‌పి మల్లికగర్గ్ మీడియాకు తెలిపారు. కడప జిల్లా సికె దిన్నె మండలం ఎంఎంఎస్ బిడియ గ్రామానికి చెందిన ఆవుల రాము, ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన పడిగ దేవతి, మేకల అలివేలు, పాటూరి నరసింహులు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కోర్ర సంజీవరావు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మోటుపలక కొసపురెడ్డి ఓ ముఠాగా ఏర్పడి విశాఖ ఏజెన్సీ చింతపల్లి గ్రామం నుంచి గంజాయి సేకరించి చిత్తూరు, కడప జిల్లాల్లోని కూలీలకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి ఓ కారులో 34 కేజీలు, ద్విచక్ర వాహనంపై 16 కేజీలు, మరో వ్యక్తి 16 కేజీలు తీసుకువస్తున్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు గుంటూరు నుంచి ఒంగోలు వెళ్లే ఎన్‌హెచ్-16 హైవే నుంచి రాచవారిపాలెం గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్డు దగ్గర నాకా బందీ చేపట్టారు. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు మహిళలతో సహా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు.66 కిలోల గంజాయి, కారు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

'హైడ్రో' ఒప్పందాలు రద్దు చేయాలి

- గిరిజన, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటును అదానీ, ఇతర కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని గిరిజన, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. 'హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో అదానీ, కార్పొరేట్ సంస్థలకు అడవులను అమ్మొద్దు' అంటూ శనివారం జగదాంబలోని సిఐటియు కార్యాలయంలో గిరిజన, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎర్రవరం, పెదకోట, చిట్టంవలస ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అదానీ, షిర్డీసాయి సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో అడవులను మోడీ, జగన్ ప్రభుత్వాలు అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల ఎనిమిదివేల మందికి ఉపాధి వస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సీలేరు, మాచ్‌ఖండ్ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన పవర్ ప్రాజెక్టుల్లో కేవలం 500 మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీటిలో స్థానిక గిరిజనులు నామమాత్రంగానే ఉన్నారని తెలిపారు. అలాంటిది ప్రైవేట్ సంస్థలు నిర్మిస్తోన్న హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో గిరిజనులకు ఉద్యోగాలు కల్పిస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. జోలాపుట్ డ్యాం నిర్మాణంలో వందల గ్రామాలు ముంపునకు గురయ్యాయని, నేటికీ వారికి పునరావాసం కల్పించలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకూ అన్యాయమే జరిగిందన్నారు. గిరిజన సలహా మండలి సమావేశంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పాడేరు ఏజెన్సీ ఐదో షెడ్యూల్ ప్రాంతం కావడంతో 1/70 చట్టం ప్రకారం ప్రైవేటు కంపెనీల ప్రవేశం నిషేధమని గుర్తు చేశారు. సమావేశంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొండా తౌడన్న, జిల్లా అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా నాయకులు శోభ దామోదర్, కె.చిన్నంనాయుడు, రూడ సత్యారావు, ఉల్లి బొంజుబాబు, కె.రామారావు, లకే చిట్టిబాబు, దిప్పల సాంబమూర్తి, కె.ప్రభుదాసు, ప్రజా సంఘాల నాయకులు ఎల్‌జె.నాయుడు, వై.రాజు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, అత్యాచారాలను నివారించేందుకు సామాజిక రక్షణ చట్టం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. రజకుల సంక్షేమం అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరింది. 'రజకుల ఉద్యమ చరిత్ర-సమస్యలు-ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం బాలోత్సవ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి రజక కుటుంబాల బాలిబాలికలు విద్యను ప్రభుత్వం ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రజక అభివృద్ధి-సంక్షేమ కార్పొరేషన్ వల్ల రాష్ట్రం ఒక్క రజక కుటుంబానికి కూడా ఉపయోగపడకుండానే కాలపరిమితి ముగిసిందన్నారు. రజకుల సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం విస్మరించి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. రజక కుటుంబాలపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, బాలికలపై అత్యాచారాలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. వీటిని నివారించడంలో కూడా వైసిపి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు స్థాయిలో రజకులు ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. రజక కుటుంబాల అభివృద్ధికి సంఘం ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంబివికె ఇన్‌చార్జ్ బిఆర్ తులసిరావు కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెల్త్ ఆఫీసర్ బద్వేల్ గురుమూర్తి, నిడుబ్రోలు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రూపొందించిన బుక్‌ను లక్ష్మణరావు ఆవిష్కరించారు.


సంఘం సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు తదితరులు

అమెరికాపై ఆశలు ఆవిరి..!

- భారత టెకీ ఉద్యోగార్థుల్లో నిరాశలు
- తొలగింపులతో ఆందోళనలు



హైదరాబాద్ : అమెరికాన్ టెక్ దిగ్గజ కంపెనీలు వరసగా ఉద్యోగులను తొలగించడంతో భారత టెకీల్లో గుబులు మొదలయ్యింది. మరోవైపు కొత్త నియామకాలను దాదాపుగా నిలిపి వేశాయి. దీంతో ఆ దేశంలో ఐటి ఉద్యోగం పొందాలనే అభ్యర్థుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఆర్థిక సంక్షోభం భయాలు అమెరికన్ కంపెనీలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడి కంపెనీలు పొదుపు చర్యల్లో భాగంగా వేల సంఖ్యల్లో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో అమెజాన్, సేల్స్‌ఫోర్స్, మెటా, ట్విట్టర్, ఉబెర్ లాంటి దిగ్గజ కంపెనీలు భారీ సంఖ్యలో సిబ్బందికి ఉద్వాసన పలుకుతున్నట్లు ప్రకటించగా.. కొత్త నియామకాలను దాదాపు నిలిపివేసినట్లు వెల్లడించాయి. దీంతో అమెరికన్ కంపెనీలపై భారత టెకీలు పెట్టుకున్న కలలు కల్లలుగా మారుతున్నాయి.

గడిచిన మూడు మాసాల్లో టెక్ పరిశ్రమల్లో తొలగించ బడిన ఉద్యోగుల్లో దాదాపుగా 21 శాతం మందికి ఇప్పటికీ ఉద్యోగులు లభించలేదని ఓ సర్వేలో వెల్లడయ్యింది. ఐటి పరిశ్రమలో 2023 అత్యంత చెత్త సంవత్సరంగా మారనుందని ఆ రంగం నిపుణులు పేర్కొంటున్నారు. ఇకపై హెచ్-1బి వీసాలు ఉన్నప్పటికీ ఉద్యోగాలు ఉండకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2022 చివరిలో అనేక మంది భారతీయ సంతతికి చెందిన ఉద్యోగులు నష్టపోయారు. అమెజాన్, సేల్స్‌ఫోర్స్ తాజాగా ప్రకటించిన ఉద్యోగుల తొలగింపు జాబితాలో అతి త్వరలోనే గూగుల్ కూడా చేరనుందని సంకేతాలు వస్తోన్నాయి. అదే జరిగితే అనేక మంది హెచ్-1బి వీసాదారుల పరిస్థితి తీవ్ర అనిశ్చిత్తిలోకి నెట్టబడే అవకాశాలున్నాయి. వాళ్లు అక్కడ 60 రోజుల్లో కొత్త ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉంటుంది. అలా కాకపోతే అమెరికా నుంచి తిరిగి వెళ్లిపోవాల్సి ఉంటుంది. మరోవైపు ఉద్యోగ ఆధారిత వీసాలపై అమెరికా చార్జీలను పెంచుతుంది. హెచ్1-బి వీసా దరఖాస్తు ఫీజును 70 శాతం పెంచి 780 డాలర్లకు చేర్చింది. ఇది కూడా ఉద్యోగార్థులకు భారం కానుంది. అమెరికన్ ఐటి దిగ్గజాలు అయినా అమెజాన్‌లో 10,000 మంది, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాలో 11,000 మంది, గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్‌లో 10వేలు, ట్విట్టర్‌లో 5,500 మంది చొప్పున ఉద్యోగాల తొలగింపునకు ఇప్పటికే ప్రకటనలు ఇచ్చాయి. ఈ తొలగింపులు గత ఆరు నెలల నుంచి ప్రారంభమయిన విషయం తెలిసిందే. ఉన్న ఉద్యోగాలు ఊడటం, కొత్త నియామకాలు లేకపోవడంతో ఈ రంగంలోని ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు సముద్ర జలాలు

- శుద్ధి చేసి అందించేందుకు ప్రణాళికలు
- ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజినీర్ వి.రవికుమార్

ప్రజాశక్తి - భోగాపురం

విజయనగరం జిల్లా భోగాపురంలో త్వరలో నిర్మించబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి సముద్ర జలాలను శుద్ధి చేసి అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజినీర్ వి.రవికుమార్ అన్నారు. ఎయిర్‌పోర్టుకు నీటి సరఫరా కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నీటి వనరులను పరిశీలించేందుకు విమానాశ్రయ ప్రతిపాదిత ప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు. విమానాశ్రయం కోసం ఐదు మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉండగా, భోగాపురం, పూసపాటిరేగ మండలాల మధ్యలో 1.5 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే సేకరించే అవకాశం ఉందని తెలిపారు. మిగతా 3.5 మిలియన్ల లీటర్ల నీటిని ఎక్కడి నుంచి తేవాలన్న దానిపై ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో చర్చించారు. సముద్ర జలాలను శుద్ధి చేసేందుకు మరో ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. గుర్ల సమీపంలో తారకరామాతీర్థసాగర్ నుండి నీరు తరలించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. భోగాపురం మండలం చేపల కంచేరు సముద్రతీరం నుండి నీటిని డి-శానిటేషన్ చేసేందుకు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఎవిఎస్ రాజన్, ఎస్‌ఇ ఉమాశంకర్, ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారి జి.అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ జమ్ము వైకుంఠంనాయుడు, జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు సుబ్బారావు, భాస్కరరావు, ఎజిఎం రామ్మోహన్ తదితరులు ఉన్నారు.


భోగాపురం సముద్ర తీరంలో పరిశీలిస్తున్న ఆర్డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్

దివాళా దిశగా ఎపి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నారనీ, పరిస్థితి దివాళా దిశగా పయనిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఉద్యోగస్తులకు ఫిబ్రవరి, మార్చి నెలలకు జీతాలుంటాయో లేదోనని, పెన్షన్ల చెల్లింపు కూడా జరగడం కూడా ప్రశ్నార్థకమన్నట్లుగా ఉందని తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఎపిలో జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి 'అప్పులు తేవడంపై ఉన్న శ్రద్ధ, అభివృద్ధిపై చూపలేదని విమర్శించారు. ఇప్పటికే రూ.8 లక్షల కోట్లకు చేరినట్లు ఆర్థిక వేత్తలు చెబుతున్నారని, ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసి, కొంతవరకు సంక్షేమ పథకాలకు వెచ్చిస్తున్నారేతప్ప, అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని పేర్కొన్నారు. ప్రతి నెలా ఇచ్చే పెన్షన్లు కూడా ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇస్తారా లేదా ? అనే సందేహం కలుగుతోందని విమర్శించారు.

వైసిపి ఎంపిటిసి ఇంట్లో గంజాయి

ప్రజాశక్తి - చినగంజాం (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లాలోని సూర్యలంక కేంద్రంగా సాగిన గంజాయి అక్రమ రవాణా కేసులో విచారణ చేపట్టిన పోలీసులు ఇందులో ఒక సూత్రధారిని గుర్తించారు. చినగంజాం మండలం మోటుపల్లికి చెందిన వైసిపి ఎంపిటిసి గోవింద్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 15 కిలోల గంజాయిని ఆయన ఇంటిలో స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల సూర్యలంకలోని పలు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ దుకాణంలో గంజాయి లభించడంతో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు దృష్టి పెట్టారు. గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను గత నెలలో పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా స్టూవర్టుపురానికి చెందిన మరోకరిని అదుపులోకి తీసుకున్నారు. తాను మోటుపల్లి నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు చెప్పడంతో సదరు వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించగా 15 కేజీల గంజాయి లభించింది. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను మోటుపల్లి గ్రామ వైసిపి ఎంపిటిపి గోవింద్ అని విచారణలో తేలింది. పోలీసుల అదుపులో ఉన్న గోవింద్‌ను విడిపించేందుకు అధికార పార్టీ నేతల నుంచి సిఫార్సులు వచ్చినట్లు తెలుస్తోంది.

జాక్‌మాకు యాంట్ గ్రూపు షాక్



బీజింగ్ : చైనాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అయినా జాక్ మా పట్ల యాంట్ గ్రూపు వాటాదారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫిన్‌టెక్ సంస్థ యాంట్ గ్రూప్‌పై ఓటింగ్ హక్కులను మారుస్తూ కంపెనీ వాటాదారులు నిర్ణయం చేశారు. ఈ మేరకు కంపెనీ వ్యవస్థాపకుడు, మేనేజ్‌మెంట్, ఉద్యోగుల ఓటింగ్ హక్కుల్లో మార్పులు చేశారు. ఈ నిర్ణయం వల్ల వాటాదారుల ఆర్థిక ప్రయోజనాలకు ఏమాత్రం ఆటంకం ఏర్పడబోతోందని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. తాజా నిర్ణయంతో జాక్ మా కంపెనీపై తన నియంత్రణను కోల్పోనున్నారు. జాక్ మా చైనా ఇ-కామర్స్ దిగ్గజం అలీబాబా, యాంట్ గ్రూపు వ్యవస్థాపకులు.

బిఎండబ్ల్యు నుంచి కొత్త ఇవి కారు

ధర రూ.1.95 కోట్లు



న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు ఇండియా తన కొత్త 2023 బిఎండబ్ల్యు 740ఐ ఎం స్పోర్ట్, బిఎండబ్ల్యు ఐ7 వేరియంట్లను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. శనివారం ఆవిష్కరించిన బిఎండబ్ల్యు ఐ7 విద్యుత్ కారు ఎక్స్‌షోరూం ధరను రూ.1.95 కోట్లుగా నిర్ణయించింది. దీనికి బుకింగ్స్‌ను తెరిచినట్లు వెల్లడించింది. మార్చి నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. చెన్నయ్ ప్లాంట్‌లో దీన్ని తయారు చేసినట్లు తెలిపింది. ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 625 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని పేర్కొంది. ఇందులో రెండు విద్యుత్ మోటర్లను అమర్చింది. బిఎండబ్ల్యు740 ఐ ఎం స్పోర్ట్ వేరియంట్‌ను పెట్రోల్ వర్షన్‌లో ఆవిష్కరించగా.. దీని ధరను రూ.1.70 లక్షలుగా ప్రకటించింది. ఈ ఏడాది చివరి నాటికి దీన్ని డీజిల్ వేరియంట్‌లోనూ తీసుకురానున్నట్లు పేర్కొంది.

భారత్‌లో 1000 మందికి ఉద్వాసన

అమెజాన్ యోచన

న్యూఢిల్లీ : టెక్, ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో 1,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా తమ ఉద్యోగుల్లో 18వేల మందికి ఉద్వాసన పలకనున్నట్లు గురువారం ఆ కంపెనీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భారత్‌లో పని చేస్తున్న లక్ష మంది ఉద్యోగుల్లో వెయ్యి మందిని ఇంటికి పంపించడానికి కసరత్తు చేస్తోందని సమాచారం. దీంతో ఒక్క శాతం ఉద్యోగులపై ప్రభావం పడనుంది. 2022 డిసెంబర్‌లో భారత్‌లో అమెజాన్ అకాడమీని మూసివేస్తున్నట్లు ప్రకటించగా.. ఫుడ్ డెలివరీ వ్యాపార విభాగం అయినా 'అమెజాన్ ఫుడ్' కార్యకలాపాలను కూడా నిలిపి వేసిన విషయం తెలిసిందే.

బీమాలో పన్ను ప్రయోజనాలు అందించాలి

బడ్జెట్‌పై ఐసిఐసిఐ లాంబర్డ్ జిఐసి ఎండి వినతి



హైదరాబాద్ : ప్రజల జీవితాల్లో బీమా అనేది ఎంతో ముఖ్యమైందని ఐసిఐసిఐ లాంబర్డ్ జిఐసి లిమిటెడ్ ఎండి, సిఇఒ భార్గవ్ దాస్ గుప్తా పేర్కొన్నారు. బీమా అనేది ఆవశ్యకమైన అంశంగా నిలుస్తోందని.. అవసర కాలంలో ఆదుకునే ఈ రంగానికి ఆర్థిక వెసులుబాటుని కల్పించడమే కాక, పన్ను ప్రయోజనాలు అందించాలని ఆయన కోరారు. దీంతో మరింత మంది ప్రజలు వారి కుటుంబాలకు రక్షణ కల్పించేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ఈ రంగానికి పన్నుల విధానంలో బడ్జెట్‌లో మరింత ప్రయోజనాలు అందించాలని కోరుకుంటున్నామన్నారు. అలా చేయడం ద్వారా ప్రజలు స్వయంగా వారికి, వారి కుటుంబాలకి బీమా కల్పించడానికి ఇది అదనపు ప్రేరణగా నిలుస్తుందన్నారు. దీర్ఘకాలంలో ఇది పాలసీదారులకు మెరుగైన అవకాశాలు కల్పించి, పరిశ్రమ ప్రజల్ని లోతుగా చేరుకోడానికి దోహదం చేస్తుందన్నారు.

కేరళ మార్గంలో ముందుకు

ఐద్వా మహాసభలో మరియం ధావలే




ఐద్వా మహాసభలో ప్రసంగిస్తున్న మరియం ధావలే, సౌహార్ద్ర సందేశమిస్తున్న విజూ కృష్ణన్

ఎం.సి. జోసఫిన్ నగర్ (తిరువనంతపురం) నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిది

పెద్ద ఎత్తున అణచివేతకు పాల్పడుతున్న మతోన్మాద విధానాలను కేరళ మహిళలు అత్యంత చైతన్యవంతంగా ప్రతిఘటించారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మరియం ధావలే చెప్పారు. తిరువనంపునంలోని ఎం.సి జోసఫిన్ నగర్‌లో జరుగుతున్న జాతీయమహాసభలో శనివారం ఆమె ఉద్యమ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా అణచివేత పెరిగిందని అన్నారు. మతం పేరుతో పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నారని, స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారని చెప్పారు. అధికారాన్ని కాపాడుకోవడం కోసం చరిత్రను సైతం వక్రీకరిస్తున్నారని చెప్పారు. తమ మాటాలతో ప్రజలను మతం మత్తులో ముంచుతున్నారన్నారు. అయితే, ఈ విధానాలను కేరళలో మహిళలు సమర్ధవంతంగా తిప్పికొట్టగలిగారని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇతర ప్రాంతాలతో పోలిస్తే కేరళలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు ఓటు వేశారన్నారు. ఈ చైతన్యాన్ని దేశ వ్యాప్తంగా తీసుకురావాలన్నారు. మరోవైపు కరోనా సమయంలో పేదలందరికీ 10 కేజీల బియ్యం ఇవ్వాలని ఐద్వా డిమాండ్ చేసిందని, కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు మాత్రమే ఇచ్చిందని చెప్పారు. అనేక మందికి అవికూడా అందలేదన్నారు. దీంతో చాలా కుటుంబాలు మైక్రో ఫైనాన్స్, రుణ యాప్‌ల బారిన పడుతున్నాయని చెప్పారు. దేశంలో ఆకలి సమస్య పెరిగిపోయిందని, ఒడిశా వంటి రాష్ట్రంలో పేదల ఒక్కపూట మాత్రమే తినే దుస్థితి ఏర్పడిందన్నారు. కులదురహంకార హత్యలు, గహహింసపైన, యువతులపై జరుగుతున్న లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలన్నారు



స్ఫూర్తి దాయక మహిళల చిత్రపటాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రతినిధులు

పెరుగుతున్న మహిళల పాత్ర : సౌహార్ధ సందేశాల్లో వివిధ సంఘాల నేతలు

దేశ వ్యాప్తంగా వివిధ సమస్యలపై జరుగుతున్న పోరాటాల్లో మహిళల పాత్ర పెరుగుతోందని, ఇది ఆహ్వానించదగిన పరిణామమని సౌహార్ధ సందేశాలిచ్చిన వివిధ సంఘాల నేతలు చెప్పారు. అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదన్నారు.

అందుకే భూమికి జాయింట్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షులు విజయరాఘవన్ మాట్లాడుతూ దేశాన్ని మతం, కులం ప్రాంతం పేరుతో చేస్తున్న విభజనలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం మహిళలను విద్యకు దూరం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. నూతన విద్యా విధానం దీనిలో భాగమేనని చెప్పారు.

పుస్తకావిష్కరణలు

1. "ఆన్ ఆలిండియా ఉమెన్స్ ఆర్గనైజేషన్ టేక్స్ షేప్". ఇందులో ఐద్వా మొదటి, రెండవ మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలను పొందిపరిచారు. ఐద్వా నాయకులు అర్చనాప్రసాద్, ఛాయ, మినతి, విమల ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.
2. "గుమ్ నామ్ వీరంగనాయి" అనే హిందీ పుస్తకాన్ని మంజీత్, చంద్రకళ ఆవిష్కరించారు.
3. "ఎర్లీ స్ట్రగుల్ ఫర్ లా రిఫామ్: డౌరీ అండ్ రేప్" అనే పుస్తకాన్ని సతీ, సుధ ఆవిష్కరించారు.
4. చింత పబ్లికేషన్ వారు 30 మంది మహిళా నాయకుల జీవితాలతో తీసుకొచ్చిన మలయాళ సంపుటిని బందా కరత్ ఆవిష్కరించారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

మహాసభల సందర్భంగా స్ఫూర్తి దాయక మహిళల చిత్రపటాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోంది. మహాసభ ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించడానికి వస్తున్నారు.

ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నాం

చర్చల్లో సి.హెచ్ రమణి, సాయిలక్ష్మి




ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ నుండి చర్చల్లో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సిహెచ్ రమణి అన్నారు. అదే జరిగితే దాని ప్రభావం మహిళలపై తీవ్రంగా ఉంటుందని అన్నారు. ఈ కారణం వల్లే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో కార్మికులతో కలిసి ఐద్వా చురుకుగా పాల్గొంటోందని అన్నారు. కోవిడ సమయంలో దేశ వ్యాప్తంగా మహిళలపై హింస పెరిగిందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులపై చర్చల్లో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిలక్ష్మి అభివృద్ధి చెందిన దేశాలు కూడా కరోనా సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాయని, వామపక్ష ప్రభుత్వాలు ఉన్న దేశాలు మాత్రం దీనికి భిన్నంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాయని చెప్పారు. తెలంగాణ నుండి చర్చల్లో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు నాగలక్ష్మి అధిక ధరల ప్రభావం మహిళలపై తీవ్రంగా పడుతోందన్నారు. అనేక కుటుంబాల్లో తినడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మరో కార్యదర్శి వర్గ సభ్యురాలు రత్నమాల మాట్లాడుతూ బిజెపి ఒక వ్యూహం ప్రకారం రాష్ట్రంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందన్నారు. కులదురహంకార హత్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ చర్చల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా రంగాన్ని దెబ్బ తీసే చర్యలు

- విదేశీ విద్యపై యుజిసి చర్యల పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో ఖండన

న్యూఢిల్లీ : విదేశీ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు భారత్‌లో కేంపస్‌లను ఏర్పాటు చేసుకునేందుకు, 90 రోజుల అప్రూవల్ క్రమం పూర్తయిన తర్వాత టీచర్లను రిక్రూట్ చేసుకోవడానికి, ఫీజులు నిర్ణయించుకోవడానికి వాటికి స్వేచ్ఛను కల్పిస్తూ యుజిసి అనుమతినివ్వడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది, అధిక ఫీజులను వసూలుచేసే కేంద్రాలను, దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థ నిర్మాణాన్ని మరింతగా దెబ్బతీసే సంస్థలను స్థాపించడానికి దారి తీస్తుందని హెచ్చరించింది. ఇటువంటి కేంపస్‌ల ఏర్పాటుకు సంబంధించిన కార్యాచరణ వివరాలను చూసినట్లైతే, దేశీయ, విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి అవి, తమ సొంత అడ్మిషన్ క్రమాన్ని, ప్రామాణికాలను తామే రూపొందించుకోవచ్చు. తమ ఫీజుల వ్యవస్థ ఎలా వుండాలో అవే నిర్ణయించుకోగలిగే స్వయంప్రతిపత్తి వాటికి వుంటుంది. భారతీయ విద్యా సంస్థలపై విధించిన ఎలాంటి పరిమితులు విదేశీ కేంపస్‌లకు వుండవు. అలాగే విదేశీ కరెన్సీ ఖాతాల నిర్వహణ, చెల్లింపులు, చెల్లింపులను తిరిగి వారి స్వదేశానికి పంపడానికి కూడా అనుమతించనున్నారు. ప్రభుత్వం, ఉన్నత విద్యా శాఖాధికారులు అనుసరించే విద్యా విధానాలు దేశంలోని విద్యా క్రమం సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. 'జాతీయ సమున్నత' హోదానిస్తూ గతంలో, దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి భారత కార్పొరేట్ సంస్థలకు అనుమతించారు. కానీ ఆ తదుపరి పరిణామాలకు సంబంధించి ఎటువంటి సమాచారాన్ని ప్రజలకు బహిర్గతం చేయలేదు. అలాగే, నూతన విద్యా విధానం, కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ విద్యపై అత్యుత్సాహంతో ప్రస్తుతం భారత ఉన్నత విద్యారంగం కొట్టుమిట్టాడుతోంది. కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో డ్రాపౌట్ల రేట్లు బాగా పెరిగాయని అన్ని అధ్యయనాలు వెల్లడించాయి. ఆర్థిక, సామాజిక అసమానతలను ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందడం కష్టతరమవుతుంది. ప్రతిపాదిత చర్యలతో ప్రస్తుతం దేశ ఉన్నత విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించలేమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ ముసాయిదా ప్రతిపాదనను యుజిసి, ప్రభుత్వం రద్దు చేయాలని పొలిట్‌బ్యూరో కోరింది. ఉపాధ్యాయుల సంఘాలు, విద్యార్థుల సంఘాలు, ఉన్నత విద్య భవిష్యత్ పట్ల తీవ్రంగా ఆందోళన చెందే వారందరితో చర్చలు జరపాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా చర్యలు తీసుకోవడానికి యుజిసికి చట్టబద్ధంగా ఎలాంటి హక్కు, అర్హత లేదని పేర్కొంది. యుజిసి, ప్రభుత్వం ఈ ఏకపక్షవాదాన్ని ఇంతటితో నిలుపు చేసేలా అన్ని ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులు పోరాడాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది.

సిజెఐ చంద్రచూడ్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానం చేయనున్నట్లు హార్వర్డ్ లా స్కూల్ సెంటర్ శనివారం ప్రకటించింది. న్యాయశాఖలో జీవితకాల సేవలకు గుర్తింపుగా ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే ఆన్‌లైన్‌లో కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తారు. జస్టిస్ చంద్రచూడ్ అమెరికాలోని హార్వర్డ్ లా స్కూల్‌లో ఎల్ఎల్ఎం డిగ్రీ, జురిడికల్ సైన్సెస్‌లో డాక్టరేట్ చేశారు. సిజెఐ చంద్రచూడ్ తో పాటు సమంతా పవర్ (అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో ఐక్యరాజ్యసమితికి మాజీ యుఎస్ శాశ్వత ప్రతినిధి, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ అధిపతి), బ్రాడ్ స్మిత్ (మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్) ఈ అవార్డుకు ఎంపికయ్యారు. "భారతదేశానికి, వాస్తవానికి ప్రపంచానికి జస్టిస్ చంద్రచూడ్ నాయకత్వం ఎంత అవసరమో మాకు తెలుసు. మానసిక ఆరోగ్యం, న్యాయవాదుల శ్రేయస్సు వంటి సమస్యలపై ఆయన 2017లో సదస్సులో చాలా అనర్గళంగా మాట్లాడారు" అని హార్వార్డ్ లాస్కూల్ ఫ్యాకల్టీ డైరెక్టర్ డేవిడ్ విల్కిన్స్ తెలిపారు.

ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌ను చూపడం జోడో యాత్ర ఉద్దేశం కాదు : జైరాం రమేశ్

భోపాల్ : భారత్ జోడో యాత్ర ఎన్నికల యాత్ర కాదని, రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా చూపించడం యాత్ర ఉద్దేశం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. ఇది సైద్ధాంతిక యాత్ర అని, అందులో రాహుల్ ప్రముఖంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించేందుకు 'భారత్ జోడో యాత్ర' కసరత్తు చేస్తుందనే వాదనలను ఆయన శనివారం కొట్టిపారేశారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీనే ప్రధాని అభ్యర్థి అంటూ ఇటీవల మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత కమల్ నాథ్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం హర్యానాలోని కర్నాల్ మీదుగా కొనసాగుతున్న జోడో యాత్ర త్వరలో కాశ్మీర్‌లో ప్రవేశించనుంది. సెప్టెంబర్ 7న తమిళనాడు కన్యాకుమారి నుంచి ప్రారంభమైన 'భారత్ జోడో యాత్ర' 12 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా సాగుతూ ఈ నెలాఖరున కాశ్మీర్‌లో ముగియనుంది.

అరబిందో శరత్ చంద్రారెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయిన అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది. మద్యం కుంభకోణంలో ఇడి దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసులో శరత్ చంద్రారెడ్డి బెయిల్ పిటిషన్‌పై శనివారం రౌస్ ఎవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. మద్యం కుంభకోణంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ అరెస్ట్ చేసిన నిందితులు శరత్ చంద్ర రెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్ బాబు, విజయ్ నాయర్లు ప్రస్తుతం తీహార్ జైళ్లో ఉన్నారు. గతంలో కోర్టు ఈ నలుగురికి విధించిన జ్యూడిషియల్ రిమాండ్ శనివారంతో ముగిసింది. ఇడి అధికారులు శనివారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జి ఎంకె నాగ్ పాల్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా నిందితులతో జడ్జి మాట్లాడారు. సప్లిమెంటరీ ఛార్జిషీట్ పై ఈ నెల 20న విచారణ చేపడతామని, నలుగురికి జ్యూడిషియల్ కస్టడీని ఈ నెల 28 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు.

ఢిల్లీ ఎల్‌జి నివాసం ఎదుట ఆప్ నిరసన

న్యూఢిల్లీ : ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని విమర్శిస్తూ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శనివారం గవర్నర్ నివాసం వెలుపల నిరసన చేపట్టింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులచే ప్రమాణస్వీకారం చేయించడానికి ముందుగా నామినేటెడ్ సభ్యులతో ప్రమాణం చేయించడాన్ని ఆప్ తప్పుబట్టింది. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఓటు వేయడానికి వీలుగా అమలు చేసిన కుట్రలో భాగమని పాలక పార్టీ విమర్శించింది. నామినేట్ అయినవారందరూ బిజెపి కార్యకర్తలేనని తెలిపింది. ఇదిలా వుండగా, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఆప్ కౌన్సిలర్లు గలాటా చేశారంటూ ఢిల్లీ బిజెపి నేతలు రాజ్‌ఘాట్ సమీపంలో ధర్నా నిర్వహించారు.

ఇద్దరు హిజాబ్ వ్యతిరేక నిరసనకారులకు ఉరిశిక్ష

టెహ్రాన్: హిజాబ్ వ్యతిరేక ఆందోళనల్లో భద్రతా అధికారిని చంపినందుకు ఇద్దరిని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. హిజాబ్ ధరించలేదంటూ పోలీసులు అదుపులోకి తీసుకున్న యువతి మరణించడంతో నిరసనలు చెలరేగిన సంగతి తెలిసిందే. పారామిలటరీ దళ సభ్యుడైన రుహొల్లా అజామియన్‌ను గత ఏడాది నవంబర్ 3న హత్య చేసిన కేసులో ప్రధాన నిందితులైన మహ్మద్ మహదీ కరామి, సయ్యద్ మొహమ్మద్ హెుస్సేనీలను శనివారం ఉదయం ఉరితీశారని వార్తా సంస్థ మిజాన్ ఆన్‌లైన్ నివేదించింది. డిసెంబర్ ప్రారంభంలో ఈ ఇద్దరికీ న్యాయస్థానం మరణశిక్ష విధించింది. నిరసనలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రదర్శనలకు సంబంధించి 14 మందికి కోర్టులు మరణశిక్ష విధించగా, నలుగురికి ఉరిశిక్ష అమలైంది.

పెరూలో మూకుమ్మడి నిరసనలు

- మిలటరీ, పోలీసుల అణచివేత చర్యలు



లిమా : పెరూ వ్యాప్తంగా బుధవారం నుంచి మరోసారి ప్రారంభమైన మూకుమ్మడి నిరసనలు, రహదారుల దిగ్భంధనాలు కొనసాగుతున్నాయి. అక్రమంగా అధికారంలోకి వచ్చిన దినా బొలూర్టె ప్రభుత్వం రాజీనామా చేయాలని, పార్లమెంట్‌ను రద్దు చేసి, సార్వత్రిక ఎన్నికలు జరపాలని తొలుత డిమాండ్లు చేసినప్పటికీ, ఇప్పుడు అధికమవుతున్న జీవన వ్యయం, పెరుగుతున్న సామాజిక అసమానతలు వంటి అంశాలు కూడా ఆందోళనకారుల నినాదాల్లో చోటు చేసుకుంటున్నాయి. గత నెల 7వ తేదీన అధ్యక్షుడు పెడ్రో కేస్టిలోను అభిశంసించి, అరెస్టు చేసినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ప్రదర్శనలు వెల్లువెత్తాయి. అదే రోజు ఉపాధ్యక్షుడు బొలూర్టెకు అధికారం అప్పగించారు. దీనివెనుక మితవాద పార్టీల నియంత్రణలో వున్న పార్లమెంట్, అమెరికా ఎంబసీ, పెరూ మిలటరీ నాయకత్వం పన్నిన కుట్ర వుంది. మిలటరీ, పోలీసులు సాగించిన అణచివేత చర్యలతో 28మంది ప్రదర్శకులు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. మధ్యలో క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవులు రావడంతో ఆందోళనా కార్యక్రమాలు తగ్గినా మళ్లీ బుధవారం నుండి నిరసనలు ఊపందుకున్నాయి. బుధవారం నుండి జాతీయ సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో వేలాదిమంది రాజధాని లిమాకు ప్రదర్శనగా బయలుదేరారు. వారిని అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా రహదారులను పలుచోట్ల దిగ్బంధించారు. శుక్రవారం నాటికి మొత్తంగా 46 చోట్ల అడ్డంకులను ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. పోలీసులు, మిలటరీ అధికారులు ప్రదర్శకులపై వేధింపు చర్యలు తీసుకుంటున్నారు. బాష్పవాయు గోళాలతో, రబ్బర్ బుల్లెట్లతో, బూట్లతో వారిని కొడుతూ వెనక్కి పంపేందుకు ప్రయత్నిస్తున్నారు.

బొలీవియా రాయబారి తొలగింపు

బొలీవియాలో తమ రాయబారి కారినా పాలాసియోని తొలగించినట్లు పెరూ ప్రభుత్వం ప్రకటించింది.

డిసెంబర్‌లో రూ.232.10 కోట్ల ఎన్నికల బాండ్ల విక్రయాలు

- ముంబయిలో కొనుగోళ్లు.. ఢిల్లీలో నగదీకరణ

న్యూఢిల్లీ : గత డిసెంబర్ నెలలో రూ.232.10 కోట్ల విలువైన ఎన్నికల బాండ్ల అమ్మకం జరిగింది. ముంబయిలో ఈ బాండ్లు కొనుగోలు ఎక్కువగా జరిగినట్లు సమాచార హక్కు దరఖాస్తుల ద్వారా వెల్లడైందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా కథనం పేర్కొంది. ఈ బాండ్లలో మెజారిటీ వాటిని నగదుగా మార్చుకునే నగరంగా ఢిల్లీ కొనసాగుతోంది. ఎన్నికల బాండ్లు విక్రయించడానికి అధికారమిచ్చిన ఏకైక బ్యాంక్ ఎస్‌బిఐ అందజేసిన డేటా ప్రకారం, 24వ దఫా విక్రయాల్లో భాగంగా డిసెంబరు 5 నుండి 12 వరకు 260 ఎన్నికల బాండ్లు విక్రయించబడ్డాయి. ముంబయిలో రూ.114 కోట్ల విలువైన బాండ్లు అమ్ముడుపోగా, ఆ తర్వాత స్థానాల్లో హైదరాబాద్ (రూ.56 కోట్లు), చెన్నై (రూ.30 కోట్లు) వున్నాయి. న్యూఢిల్లీ, కోల్‌కతా శాఖల్లో వరుసగా రూ.16.10, రూ.16 కోట్లు విలువైన బాండ్లు విక్రయించారు. ఇకపోతే ఈ బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకునే ప్రక్రియ ఢిల్లీ నగరంలో ఎక్కువగా సాగుతోందని ఆ వార్తా కథనం పేర్కొంది. మొత్తంగా రూ.232 కోట్లు విలువైన బాండ్లు అమ్ముడుపోగా, వాటిలో రూ.194.10కోట్లు ఢిల్లీలోనే నగదుగా మారాయి. మిగిలిన స్థానాల్లో హైదరాబాద్ (రూ.21కోట్లు), కోల్‌కతా (రూ.17కోట్లు) వున్నాయి. 2018 నుండి ఎస్‌బిఐ మొత్తంగా రూ.11,699.83కోట్ల విలువైన 20,734 ఎన్నికల బాండ్లను విక్రయించినట్లు ఆర్‌టిఐ దరఖాస్తుదారునికి ఇచ్చిన సమాధానంలో బ్యాంక్ వెల్లడించింది. 22వ దఫా వరకు ఎన్నికల బాండ్లు జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు మాసాల్లో కేవలం పది రోజులే విక్రయించేవారు. లోక్‌సభ ఎన్నికలు జరిగే సంవత్సరాల్లో ఆ కాల పరిమితి 30రోజులవరకు వుండేది. కానీ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రం ఈ పథక నిబంధనలను సవరించింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగే సంవత్సరాల్లో మరో 15రోజులు పొడిగించింది.

ఎన్నికల బాండ్ల ద్వారానే టిఎంసికి 96 శాతం నిధులు

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 2021-22లో లభించిన నిధుల్లో 96 శాతం ఎన్నికల బాండ్ల ద్వారానే లభించాయని ఆ పార్టీ ఆడిట్ రిపోర్టులో పేర్కొంది. 2020-21లో రూ.42 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా లభిస్తే, 2021-22లో ఏకంగా 528.14 కోట్లు లభించినట్లు తెలిపింది. 2021-22లో మొత్తం రూ.545.74 కోట్ల పార్టీకి విరాళాలు, సభ్యత్వ రుసుము తదితర రూపాల్లో నిధులు వచ్చినట్లు పేర్కొంది.

చైనా సంగతి తేలుస్తాం

- అమెరికా ప్రతినిధుల సభ నూతన స్పీకర్ కెవిన్

వాషింగ్టన్ : చైనాపై ద్వైపాక్షిక సెలక్ట్ కమిటీని ఏర్పాటు చేస్తామని అమెరికా ప్రతినిధుల సభ నూతన స్పీకర్, రిపబ్లికన్ నేత కెవిన్ మెక్ కార్తీ అన్నారు. స్పీకర్‌గా శనివారం తెల్లవారుజామున ఎన్నికైన అనంతరం మాట్లాడిన ఆయన అమెరికా గురించి కాకుండా చైనా గురించి మాట్లాడటం గమనార్హం. చైనా కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదల వల్ల తలెత్తే సమస్యలను సభ పరిష్కరిస్తుందని కెవిన్ అన్నారు. చైనాతో కొనసాగే ఆర్థిక పోటీలో అమెరికా గెలుపొందాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. చైనాకు వెళ్లిపోయిన లక్షల ఉద్యోగాలను వెనక్కి ఎలా రప్పించాలనే విషయమై ద్వైపాక్షిక కమిటీ దర్యాప్తు చేస్తుందన్నారు. చైనాతో ఆర్థిక పోటీలో అమెరికా గెలుపొందేలా చేయడమే తన ప్రాధాన్యత అని అన్నారు. ప్రభుత్వ రుణాల సమస్యను సభ పరిశీలించగలదని హామీ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో, డెమొక్రాట్లతో తలపడేందుకు అత్యుత్సాహం కనబరుస్తున్న కెవిన్ 'ఇక కఠోర శ్రమ ప్రారంభమైంది' అని వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణ కీలకం

- అంగీకరించిన భారత్, అమెరికా

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌లో శాశ్వత శాంతిని పునరుద్ధరించడం అత్యంత కీలకమని భారత్, అమెరికా అంగీకరించాయని బైడెన్ ప్రభుత్వం తెలిపింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి నెడ్ ప్రైస్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌లో యుద్ధంపై భారత్‌తో సహ మిత్రపక్షాలతో, భాగస్వాములతో అమెరికా చర్చలు జరుపుతోందని తెలిపారు. ఈ పరిస్థితికి రష్యాను బాధ్యురాలిని చేయాలని అంతర్జాతీయ సమాజం గుర్తించిందని చెప్పారు. ఉక్రెయిన్ ప్రజలకు భారత్ మద్దతివ్వడాన్ని స్వాగతించామన్నారు. మానవతా సాయాన్ని కూడా భారత్ అందించిందని చెప్పారు. ఈనాటి శకం యుద్ధ శకం కాదన్న ప్రధాని మోడీ వ్యాఖ్యలతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామన్నారు. శుక్రవారం పత్రికా సమావేశంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అటు రష్యాతో, ఇటు ఉక్రెయిన్‌తో సంబంధాలు కలిగిన భారత్ వంటి దేశాలు చర్చలు, దౌత్యం జరిగేలా సహకరించగలవని అమెరికా విశ్వసిస్తోందని అన్నారు. చర్చల క్రమాన్ని మొదలు పెడితే ఏదో ఒక రోజు ఈ యుద్ధాన్ని అంతమొందించగలమని చెప్పారు.

ఉత్తరాఖండ్‌లో కుంగిపోయిన భూమి

- బాధిత ప్రాంతాన్ని సందర్శించిన సిఎం

డెహ్రాడూన్: హిమాలయ పట్టణం జోషిమఠ్ ప్రాంతంలో భూమి కుంగిపోయిన ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ ప్రాంతాన్ని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి శనివారం సందర్శించారు. బాధితులతో మాట్లాడి, వారిని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు నిర్వహణ అధికారులతో మాట్లాడారు. జోషిమఠ్‌లోని సింధర్ వార్డ్‌లో శుక్రవారం సాయంత్రం ఒక ఆలయం కూలిపోయింది. దీంతో, గుడి సమీపంలో నివసిస్తున్న వారు తీవ్ర ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, 15 రోజుల క్రితం భారీ పగుళ్లు ఏర్పడిన తరువాత ఆలయాన్ని మూసేశారు. సమీపంలోని పలు ఇళ్లలో భారీ పగుళ్లు వచ్చాయని, దాదాపు 50 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు. భూమి కుంగిపోవడం వల్ల జోషిమఠ్‌లోని సుమారు 600 ఇళ్లకు పెద్దపెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. భూమి నుంచి శబ్దాలు రావడం, నేలకింద నుంచి నీళ్లు ఇళ్లలోకి రావడంతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఎన్‌టిపిసి హైడ్రో పవర్ ప్రాజెక్టు వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా రోజుల నుంచి ఇలా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు గత అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి కాగడాలతో నిరసన తెలిపారు. బద్రినాథ్, హేమ్‌కుండ్ క్షేత్రాలకు వెళ్లే మార్గంలో ఉన్న ఈ ప్రాంతంలో భూమి కుంగిపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

పంజాబ్ మంత్రి రాజీనామా..

- కొత్త మంత్రిగా బల్బీర్‌సింగ్ ప్రమాణ స్వీకారం

చండీగఢ్ : పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంలో మరో మంత్రి శనివారం రాజీనామా చేయగా, కొత్తగా మరొకరు ప్రమాణ స్వీకారం చేశారు. కాంట్రాక్టుల విషయంలో డబ్బుతీసుకోవడం గురించి ఉద్యానవన శాఖ మంత్రి ఫౌజా సింగ్ సరారి తన సన్నిహితుడితో మాట్లాడుతున్న ఆడియో క్లిప్ నాలుగు నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. ఈ ఆడియో వివాదాస్పదం కావడంతో ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌కు శనివారం ఫౌజా రాజీనామా సమర్పించారు. వ్యక్తిగత కారణాల వల్లే బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ రాజీనామాను మాన్ ఆమోదించారు. ఆ ఆడియోలో ఉన్నది తన మాటలు కాదని, ఇదంతా కుట్రపూరితమంటూ ఫౌజా తనపై వచ్చిన విమర్శలను తోసిపుచ్చారు. అలాగే పార్టీలోనే కొనసాగుతానని వెల్లడించారు. పంజాబ్‌లో నూతన మంత్రిగా డాక్టర్ బల్బీర్‌సింగ్‌తో పంజాబ్ గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్ శనివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు కావొస్తుంది. ఇలా అవినీతి ఆరోపణలతో మంత్రి పదవిని పోగొట్టుకున్నవారిలో ఫౌజా రెండో వ్యక్తి. అంతకుముందు ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రిగా ఉన్న విజయ్ సింగ్లాను మాన్ మంత్రివర్గం నుంచి తొలగించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకే సింగ్లా అరెస్టయ్యారు.

టీచర్‌ను తుపాకీతో కాల్చిన ఆరేళ్ల విద్యార్థి

న్యూయార్క్: అమెరికాలో తుపాకీ సంస్కృతి పేట్రేగుతోంది. తూర్పు అమెరికాలోని వర్జీనియాలోని ఓ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో శుక్రవారం ఆరేళ్ల బాలుడు కాల్పులు జరపడంతో ఉపాధ్యాయురాలు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. రిచ్‌నెక్ ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగిన ఈ ఘటనలో విద్యార్థులెవరూ గాయపడలేదు. ఆరేళ్ల విద్యార్థి పోలీసుల కస్టడీలో ఉన్నట్లు పోలీస్ చీఫ్ స్టీవ్ డ్రూ వెల్లడించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిన కాల్పులు కాదని, కావాలనే విద్యార్థి టీచర్‌పై కాల్పులకు తెగబడినట్లు తెలిపారు. గాయపడిన 30 ఏళ్లలోపు వయసున్న ఉపాధ్యాయురాలి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

రాజ్యాంగ విలువల నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ప్రభుత్వానికి భయపడి చాలా మీడియా సంస్థలు మౌనంగా ఉన్నాయని, 2014కి ముందు సిబిఐని పంజరంలో బంధించిన చిలుక అని చెప్పిన సుప్రీంకోర్టు ఆ తరువాత చలించలేదని చెప్పారు. ఎనిమిదేళ్ల సుప్రీంకోర్టు కార్యకలాపాలపై కూడా తాను అసంతృప్తిగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రేఖా శర్మ, మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్ రాజు రామచంద్రన్, లాయర్స్ యూనియన్ ఆల్ ఇండియా అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపి బికాస్ రంజన్ భట్టాచార్య, ప్రధాన కార్యదర్శి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పివి సురేంద్రనాథ్, ఢిల్లీ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ (డియుటిఎ) మాజీ అధ్యక్షురాలు నందితా నరైన్, డియుజె అధ్యక్షుడు ఎస్ కె పాండే, డియుజె కార్యదర్శి సుజాత మదోక్ తదితరులు మాట్లాడారు.



గంగిరెద్దు నాట్యం



రాముడు భీముడు కవలపిల్లలు. ఇద్దరూ ఉదయాన్నే లేచారు. అప్పటికే తండ్రి బసవయ్య అలంకరించిన ఎద్దును చూశారు.

'నాన్నా! మమ్మల్ని పిలవకుండానే ఎద్దును మీరే అలంకరించారు ఎందుకు?' అడిగాడు రాముడు.

'ఇంట్లో ఉన్న పాత చీరలు, దుప్పట్లు వేసి అలంకరిస్తే ఇంకా బాగుంటుంది.' అన్నాడు భీముడు.


'గంగిరెద్దును ఇంటింటికి తిప్పుతూ నాట్యం చేయిస్తూ, నేను డోలు సన్నాయి వాయించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ పాతకాలం మనుషుల్లో వున్న దానగుణం ఈ కాలం మనుషుల్లో లేదులే. ఈ పండుగక్కే మనం ఎక్కువగా వెళ్లడం లేదు. పండుగ నెల కదాని మన ఎద్దును అలంకరించాను.' కొడుకులతో అన్నాడు నిరుత్సాహంగా.

'నాన్నా! మనం ప్రదర్శించే కళ వాళ్లకు నచ్చిందంటే దానం చేస్తారు.' అని తెలిసిన విషయం చెప్పారు అన్నదమ్ములు. 'ఈ సారి ఎద్దును తీసుకుని మేము వెళతాం. మీరు చూస్తూ ఉండండి' అన్నారు. బసవయ్య ఇష్టం లేకపోయినా అంగీకరించాడు.

ఒక్కొక్క ఇంటి ముందు ఆగి తమ ఫోన్లో కొత్తగా వచ్చిన సినిమా పాటలను వినిపిస్తున్నారు. దాంతో గంగిరెద్దు తల ఆడిస్తూ కాళ్లు అటు..ఇటు ఆడించసాగింది. ఎద్దు చక్కగా అభినయించింది అంటూ చాలా మంది మెచ్చుకొన్నారు. సంతోషంతో ఎక్కువ దానం ఇచ్చారు.

బసవయ్య ఆశ్చర్యపోయాడు. మునపటిలాగే ఎద్దు ఆడింది. అందుల మార్పు లేదు కదా! అని. 'జనరేషన్ మారుతోంది నాన్నా..మనమూ మారాలి'. అన్నారు రాముడు, భీముడు.

- ఓట్ర ప్రకాష్ రావు
097874 46026



బొమ్మ గీయండి!

చిన్నారులూ , ఈ రోజు అందమైన ఏనుగు పిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ



- పి. సౌమ్య,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి,
చిత్తూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మానవత్వానికి మరో చిరునామా 'శాంతోమ్'

అక్కడ పురుళ్లు పోసుకున్న తల్లులున్నారు. బిడ్డలొదిలేసిన అమ్మానాన్న ఉన్నారు. తల్లిదండ్రులు వద్దనుకున్న కన్నబిడ్డలున్నారు. వాళ్లంతా ఒకళ్లకి ఒకరు ఏమీ కారు. అసలు తాము అక్కడ ఎందుకున్నారో.. ఎక్కడి నుంచి వచ్చామో కూడా తెలియదు. వారిలో మతిస్థిమితం లేక రోడ్డుమీద అనాథల్లా పడున్న వారు కొందరైతే.. మానసిక వైకల్యంతో సంరక్షణ కరువై స్వయంగా బంధువులు, ఆప్తులు విడిచిపెట్టేసినవారు మరికొందరు. రోజుల తరబడి ఎండకు, వానకు తిరిగి అట్టలుకట్టిన జుట్టుతో, ఒంటినిండా పుండ్లతో దుర్వాసన వస్తున్న వీరిని చేరదీస్తున్న వ్యక్తికి నాలుగు పదుల వయస్సే ఉంటుంది. ఇరవై ఏళ్ల నుంచి ఈ మార్గంలో నడుస్తున్న ఆయన పొన్నూరు వడిముక్కల రోడ్డు నాడుట్రోలు ప్రాంత 'శాంతోమ్ కరుణాలయం' నిర్వాహకులు. గోనెసంచెనే వస్త్రంగా ధరిస్తూ ఆ ప్రాంతంలో ఆయన గోతాలస్వామిగా పిలవబడుతున్నారు.

హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన గోతాలస్వామి తన పాత పేరు, చిరునామా చెప్పడానికి ఇష్టపడరు. 'నేను ఈ మార్గంలో నడవాలనుకున్నప్పుడు నా పేరు, నా గుర్తింపు, 'నా' అనే ప్రతి ఒక్కదాన్నీ వదిలేయాలనుకున్నాను. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు నా వయసు 24, 25 ఏళ్లు ఉంటుంది. అందరి తల్లిదండ్రుల్లా నా అమ్మానాన్న కూడా నేను గొప్ప ప్రయోజకుడినవ్వాలని కలలుగన్నారు. కాని నేను వారు ఊహించని మార్గంలో నడిచాను. ఇది వారికి నచ్చలేదు. అందుకే నా గత చరిత్ర చెప్పడానికి ఇష్టపడను' అంటారు.

అందరి యువకుల్లానే ఫ్యాషన్‌గా జీవిస్తూ అతను ర్యాపర్ కావాలనుకున్నాడు. ఉన్నతవిద్య చదివి మంచి హోదాలో ఉండాలనుకున్నాడు. కాని ఒక ప్రమాదం అతని జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమై నెల తరబడి ఉండిపోయాడు. 'లేచి నడుస్తానని ఎవరూ అనుకోలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ నా మీద ఆశలు వదులుకున్నారని చెబుతున్న గోతాలస్వామి 'నా ప్రాణాపాయ స్థితే ఇలాంటి వారిని అక్కున చేర్చుకునేలా చేసిందంటున్నారు.

ఆశ్రమంలో ఒక్కొక్కరిది ఒక్కో కథ

వసంతకు అమ్మానాన్న ఉన్నారు. తన వయసు ఎంతో కూడా చెప్పలేని అయోమయ పరిస్థితిలో ఎన్నో ఆగచాట్లు పడి ఇక్కడికొచ్చానని మాత్రం చెబుతుంది. శివకన్యకు పెళ్లయి ప్రసవ సమయంలో మతిస్థిమితం కోల్పోయింది. బిడ్డ పుట్టడం, చనిపోవడం చూసిన ఆ తల్లి మానసికంగా కుంగిపోయింది. ఆ స్థితిలో ఆమెను అక్కున చేర్చుకోవాల్సిన కుటుంబం పిచ్చిదని ముద్ర వేసి గెంటేశారు. రోడ్డుమీద అనాథలా తిరుగుతున్న శివకన్యను పోలీసులు రక్షించి గోతాలస్వామికి అప్పగించారు. స్వయంగా తీసుకొచ్చిన వారు కొందరైతే.. పోలీసులు అప్పగించిన వారు మరికొందరు ఆ ఆశ్రమంలో కనిపిస్తారు. ఐదారేళ్ల చిన్న పిల్లవాడి అమ్మ మంచాన పడి ఉంది. ఆమె ఆలనాపాలనా చూసుకుంటున్న ఆ పసివాడు మందులు తేవడం, అమ్మకు అన్నం పెట్టడం చేస్తున్నాడంటూ ఓ రోజు పేపర్లో వచ్చిన వార్త గోతాలస్వామికి చేరింది. వెంటనే అక్కడకు వెళ్లి తల్లినీ, బిడ్డను ఆశ్రమానికి తీసుకువచ్చారు. పిల్లవాడిని స్కూల్లో చేర్పించి తల్లికి చికిత్స చేయించారు. ఇప్పుడు ఆ తల్లి చనిపోయింది. కాని ఆ పిల్లవాడు ప్రయోజకుడై కాలేజీ విద్య చదువుతూనే తనకెంతో ఇష్టమైన చిత్రకళలో రాణిస్తున్నాడు. 'గర్భం వచ్చిందని కూడా తెలియని ఎందరో తల్లుల బిడ్డలు ఇక్కడే పురుడుపోసుకుని, వైకల్యబాధితుల మధ్య పెరిగారు. వారు తినేదే తింటారు. వారికి సేవ చేస్తారు. తల్లి ఎవరో తెలియకపోయినా ఇక్కడున్నవారంతా తమవారే అన్నట్లుగా పెరిగి నేడు ఉన్నత విద్యావంతులుగా, ఉన్నత హోదాల్లో ఉన్నారం'టూ చెబుతున్నప్పుడు గోతాలస్వామి మాటల్లో సంతోషం ధ్వనిస్తుంది.



ఆశ్రమంలో పుట్టిన బిడ్డల చదువుసంధ్యలు స్వయంగా పర్యవేక్షించడమే కాదు, వారికి పెళ్లిళ్లు చేయడం, కొత్త జీవితాన్ని ఏర్పర్చడంలో కూడా ఆయన ముందుంటున్నారు. అలా ఆశ్రమంలో పుట్టి పెరిగిన పిల్లలు ఉద్యోగాల్లో స్థిరపడ్డాక ఆశ్రయం ఇచ్చిన గోతాలస్వామిని మర్చిపోకుండా తమకు చేతనైనంత సాయం చేస్తూ కృతజ్ఞతలు చెబుతుంటారని ఆ పిల్లలను దగ్గరుండి చూసిన ఓ నిర్వాహకురాలు చెబుతున్నారు. ఈ ఇరవై ఏళ్లలో దాదాపు 500 మంది పిల్లలను ఈ ఆశ్రమం తరఫున చదివించారని చెబుతారు. పుట్టిన పిల్లల్లో కూడా చాలామంది మానసిక వైకల్య బాధితులుగానే ఉంటారు. వారి ఆలనాపాలనా చూసుకోవడంలో కూడా వెనకడుగేయని లక్షణం నిర్వాహకుల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

వేర్వేరు ఆశ్రమాలు..

ఆడవాళ్లను, మగవాళ్లను ఒకే ఆశ్రమంలో ఉంచడం వల్ల మొదట్లో ఎన్నో ఇబ్బందులు చూసిన గోతాలస్వామి మగవారికి, మగపిల్లలకు 'కార్మెల్ సదన్' పేరుతో గుంటూరులో ప్రత్యేకంగా ఓ ఆశ్రమం నిర్వహిస్తున్నారు. 180 మంది మహిళలతో 'శాంతోమ్', 80 మంది పురుషులతో 'కార్మెల్' నిర్వహణ కత్తిమీద సామే. అయినా వీటి నిర్వహణ కోసం గోతాలస్వామి ఎవరి దగ్గరా చేయిచాచరు. వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు, పళ్లు, పిల్లల చదువు వంటివన్నీ దాతలు స్వచ్ఛందంగా ఇస్తారు.

వంటచేసేవారు కూడా వారే..

రోజూ మూడు పూటలా ఇంతమందికి వంటచేసేందుకు వారిలోనే కొంతమంది వాలంటీర్లుగా పనిచేస్తారు. మతిస్థిమితం లేని వారికి వండివార్చేవారు కూడా వారిలోనే ఉన్నారంటే ఎవరికీ నమ్మశక్యం కాదు. కాని వారిలోనే కొంతమంది ఆ పనులు చేస్తున్నారు. మరికొంతమంది ఈ సేవలో భాగం కావాలనుకున్న లక్ష్యంతో ఊళ్లోవాళ్లు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. ఆశ్రమం బయట నుంచి వచ్చి జీతభత్యాలు లేకుండా ఇంతమందికి వండివార్చుతున్న వారంటే గోతాలస్వామికి ప్రత్యేక అభిమానం. ఆ కుటుంబాలకు, వారి పిల్లలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా ముందుండే ఆయనంటే వారికి అమిత గౌరవం.

'మానవ సేవే మాధవ సేవ' అని చాలామంది చెబుతారు. కాని ఆచరించి చూపేవారు చాలా తక్కువ. ఆకలిగా ఉన్న వారికి అన్నం పెట్టడం, దప్పిక వేస్తున్న వారికి నీళ్లు ఇవ్వడమే మానవత్వంగా చెప్పుకునే ఎంతోమంది మనకు తరచూ తారసపడుతుంటారు. మతి స్థిమితం లేక, ఎవరి సహాయమూ అందక నిస్సహాయ బందీలుగా జీవించాల్సిన ఎందరికో పరిశుభ్ర వాతావరణంలో.. నాణ్యమైన జీవితాన్ని కల్పిస్తున్న గోతాలస్వామి.. తెలిసినవారు ఆయన్ని మానవత్వానికి మరో చిరునామాగా అభివర్ణిస్తున్నారు.

- జ్యోతిర్మయి

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక ,
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి -
522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి



15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు




టంగుటూరి శ్రీలక్ష్మి
బ్రాహ్మణ బజార్,
టంగుటూరు,
ప్రకాశం జిల్లా.

18 చుక్కలు 2
వరుసలు,
2 వచ్చేవరకు



కోరంపల్లి ఉన్నతి.



ఫుల్ మాస్‌గా...



మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటెస్ట్ చిత్రం 'వాల్తేరు వీరయ్య '. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంది. పైగా రవితేజ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తుండటంతో ఈ సినిమాకు మరింత హైప్ వచ్చింది. ప్రమోషన్లో భాగంగా చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో చిరంజీవి పూర్తి మాస్ లుక్‌లో, కామెడీ డైలాగ్‌తో కనిపించారు. మరో వైపు సీరిస్‌లో లుక్‌లో పూర్తి యాక్షన్ సీన్లనూ చూపించారు. గ్యాంగ్‌లీడర్, ముఠామేస్త్రీ సినిమా వేషధారణలో కనిపించారు. రవితేజ ఎంట్రీ, చిరంజీవి కాంబినేషన్‌లో పాట అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపితోంది.

'ఎటిఎం' టీజర్ విడుదల



బిగ్‌బాస్ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్నవారిలో వీజే సన్నీ ఒకడు. ప్రస్తుతం సన్నీ 'ఏటిఎమ్' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నాడు. తాజాగా ఈ వెబ్ సిరీస్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. బస్తీలో బతుకున్న హీరోకు లగ్జరీ లైఫ్ కావాలనుకుంటాడు. దానికోసం ఏటీఎమ్‌లో దొంగతనానికి పాల్పడతాడు. కానీ అనుకోకుండా పోలీసుల కంటపడతాడు. మరీ చివరకి ఆ పోలీసులకు చిక్కుతాడా? లేదా? అనే కథాంశంతో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కినట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. ఈ వెబ్ సిరీస్ జనవరి 20 నుండి జీ–5లో స్ట్రీమంగ్ కానుంది. దర్శకుడు హరీష్ శంకర్ కథ అందించిన ఈ వెబ్ సిరీస్‌ను దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు కూతురు హన్షితా రెడ్డి నిర్మిస్తుంది. చంద్రమోహన్ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో సుబ్బరాజు, దివి కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ స్ట్రీమింగ్ కానుంది.

అంజలి కుటుంబానికి షారుఖ్ బాసట




బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ ఔదార్యాన్ని చాటుకున్నాడు. న్యూ ఇయర్ రోజును రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అంజలీ సింగ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు షారుఖ్‌కు చెందిన ఎన్జీవో మీర్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో యువతిని కారు ఢీకొట్టి, 12 కిలోమీటర్ల దూరం లాక్కెళ్లిన సంఘటన విదితమే. ఈ దారుణ ఘటన యావత్ దేశాన్ని కదిలించింది. అంజలి మృతితో కుటుంబంలో విషాదం అలముకున్నది. అంజలియే ఆమె కుటుంబానికి ఆధారం. ఈ పరిస్థితుల్లో యువతి కుటుంబాన్ని షారుఖ్ మీర్ ఫౌండేషన్ ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే, ఎంత మొత్తం విరాళంగా అందించారనే విషయం మాత్రం తెలియరాలేదు.

చివరి షెడ్యూల్‌లో 'కస్టడీ'



నాగచైతన్య, తమిళ దర్శకుడు 'విక్రమ్ ప్రభు'తో కాంబినేషన్‌లో 'కస్టడీ' సినిమా చివరి షెడ్యూల్‌లో ఉంది. బహు భాషల్లో రిలీజ్ కానున్న ఈ మూవీకి ఈ షెడ్యూల్‌తో ముగింపు పలకనున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీకి 'యువన్ శంకర్ రాజా' మ్యూజిక్ అందిస్తున్నారు. శరత్ కుమార్, అరవింద్ స్వామీ, ప్రియమణి తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది మే 12న రిలీజ్ చేయ్యనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.



'కళ్యాణం కమనీయం' కొత్త పాట

సంతోష్ శోభన్ నటిస్తున్న కొత్త సినిమా 'కళ్యాణం కమనీయం' నుంచి తాజాగా 'అయ్యో ఏంటో నాకు" అనే లిరికల్ పాటను విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించారు. శ్రావణ్ భరద్వాజ్ కంపోజ్ చేయగా స్వీకర్ అగస్తి పాడారు. ఈ చిత్రంలో ప్రియ భవానీ శంకర్ నాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని యూవీ కాన్సెప్ట్ సంస్థ నిర్మిస్తోంది. పెళ్లి నేపథ్యంతో సాగే ఆహ్లాదకర కథతో నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఆళ్ల రూపొందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

గిరిజన నాయకుడిగా..



'శివపుత్రుడు', 'ఐ', 'కోబ్రా' వంటి సినిమాల్లో వైవిధ్య పాత్రల్లో కనిపించిన విక్రమ్ మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే పాత్రలో రానున్నారు. విక్రమ్ హీరోగా పా.రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'తంగలాన్' సినిమాలో విక్రమ్ ఓ గిరిజన తెగ నాయకుడి పాత్రలో నటిస్తున్నట్లుగా సమాచారం. పీరియాడికల్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో ఈ పాత్ర కోసం విక్రమ్ ప్రోస్థటిక్ మేకప్ వేసుకుంటున్నారు. మేకప్‌కి నాలుగు గంటలు సమయం పడుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. తదుపరి షెడ్యూల్‌ను కర్ణాటకలో ప్లాన్ చేశారు. పార్వతీ మీనన్, మాళవికా మోహనన్, పశుపతి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది.

సూర్య ప్రతాపం

- 51బంతుల్లో 112పరుగులు
- శ్రీలంకపై 94పరుగుల తేడాతో భారత్ గెలుపు
- సిరీస్ 2-1తో కైవసం

నిర్ణయాత్మక మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. శ్రీలంకతో జరిగిన మూడో టి20లో కేవలం 51బంతుల్లో 7ఫోర్లు, 9సిక్సర్ల సాయంతో 112పరుగులు చేశాడు. శ్రీలంక బౌలర్లందరిన్నీ ఛీల్చి చెండాడుతూ మిస్టర్ 360 డిగ్రీస్ పేరును సార్థకం చేసుకున్నాడు. శుభ్‌మన్, త్రిపాఠి కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 228పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది.



రాజ్‌కోట్: టి20 స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ అజేయ శతకానికి తోడు శుభ్‌మన్, త్రిపాఠి మెరుపులు తోడవ్వడంతో నిర్ణయాత్మక మూడో టి20లో టీమిండియా 91పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 228పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. సూర్యకుమార్ 51 బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్ల సాయంతో 112పరుగులు చేసి టి20 కెరీర్‌లో మూడో సెంచరీ బాదాడు. ఈ క్రమంలో 43 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఓపెనర్ శుభ్ మాన్ గిల్(46), రాహుల్ త్రిపాఠి(35) బ్యాటింగ్‌లో రాణించారు. ఇషాన్ కిషన్(1), కెప్టెన్ హార్దిక్ పాండ్యా(4), దీపక్ హుడా(4) స్వల్ప స్కోర్‌కే పెవీలియన్‌కు చేరారు. మధుశంకకు రెండు, రజిత, కరుణరత్నే, హసరంగకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో శ్రీలంక ఇన్నింగ్స్ ధాటిగానే ప్రారంభమైంది. ఓపెనర్లు నిస్సంక, కుశాల్ మెండీస్ కలిసి తొలి వికెట్‌కు 4.5ఓవర్లలో 44పరుగుల పునాది వేశారు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా పెవీలియన్‌కు చేరారు. కుశాల్(23), శనక(23) బ్యాటింగ్‌లో రాణించారు. లంక ఇన్నింగ్స్ 16.4ఓవర్లలో 137 పరుగులకే పరిమితమైంది. ఆర్ష్‌దీప్‌కు మూడు, హార్దిక్, చాహల్, ఉమ్రన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూర్యకుమార్‌కు లభించింది.


స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి)ధనుంజయ (బి)మధుశంక 1, శుభ్‌మన్ (బి)హసరంగ 46, త్రిపాఠి (సి)మధుశంక (బి)కరుణరత్నే 35, సూర్యకుమార్ (నాటౌట్) 112, హార్దిక్ (సి)ధనుంజయ (బి)రజిత 4, దీపక్ హుడా (సి)హసరంగ (బి)మధుశంక 4, అక్షర్ పటేల్ (నాటౌట్) 21, అదనం 5. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 228పరుగులు. **వికెట్ల పతనం:** 1/3, 2/52, 3/163, 4/174, 5/189 **బౌలింగ్:** మధుశంక 4-0-55-2, రజిత 4-1-35-1, తీక్షణ 4-0-48-0, కరుణరత్నే 4-0-52-1, హసరంగ 4-0-36-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిస్సంక (సి)శివమ్ మావి (బి)ఆర్ష్‌దీప్ 15, కుశాల్ (సి)ఉమ్రన్ (బి)అక్షర్ 23, ఆవిష్క(సి)ఆర్ష్‌దీప్ (బి)హార్దిక్ 1, ధనుంజయ (సి)శుభ్‌మన్ (బి)చాహల్ 22, అసలంక (సి)శివమ్ మావి (బి)చాహల్ 19, శనక (సి)అక్షర్ (బి)ఆర్ష్‌దీప్ 23, హసరంగ (సి)దీపక్ హుడా (బి)ఉమ్రన్ 9, కరుణరత్నే (ఎల్‌బి)హార్దిక్ 0, తీక్షణ (బి)ఉమ్రన్ 2, రజిత (నాటౌట్) 9, మధుశంక (బి)ఆర్ష్‌దీప్ 1, అదనం 13. (16.4ఓవర్లలో ఆలౌట్) 137పరుగులు. **వికెట్ల పతనం:** 1/44, 2/44, 3/51, 4/84, 5/96, 6/107, 7/123, 8/127, 9/136, 10/137 **బౌలింగ్:** హార్దిక్ 4-0-30-2, ఆర్ష్‌దీప్ 2.4-0-20-3, శివమ్ మావి 1-0-6-0, అక్షర్ పటేల్ 3-0-19-1, ఉమ్రన్ మాలిక్ 3-0-31-2, చాహల్ 3-0-30-2.

ఫైనల్లో జకోవిచ్, కొర్డా

ఆడిలైడ్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నీ



ఆడిలైడ్: ఆడిలైడ్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ కొర్డా ప్రవేశించారు. శనివారం జరిగిన తొలి సింగిల్స్‌లో కొర్డా 7-6(7-5), 1-0తో నిషికోరి(జపాన్)పై గెలిచాడు. రెండో సెట్‌లో కొర్డా 1-0 ఆధిక్యతలో ఉండగా.. నిషికోరా గాయంతో మ్యాచ్ మధ్యలో వైదొలిగాడు. రెండో సెమీస్‌లో జకోవిచ్ 6-3, 6-4తో 3వ సీడ్, రష్యాకు చెందిన మెద్వదెవ్‌ను చిత్తుచేశాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి నొస్కోవా(చెక్ రిపబ్లిక్), 2వ సీడ్ సబలెంకా ప్రవేశించారు. నొస్కోవా 6-3, 1-6, 6-3తో టాప్‌సీడ్, ట్యునీషియాకు చెందిన జబీర్‌ను, సబలెంక(రష్యా) 6-3, 6-2తో బెగు(రొమేనియా)ను ఓడించారు.

మరోసారి డోప్ టెస్ట్‌లో పట్టుబడ్డ సంజిత

న్యూఢిల్లీ: భారత మహిళా వెయిట్‌లిఫ్టర్ సంజిత ఛాను మరోదఫా డోప్‌టెస్ట్‌లో పట్టుబడింది. జాతీయ క్రీడల సందర్భంగా సంజిత నుంచి సేకరించిన నమూనాల్లో అనాబాలిక్ స్టెరాయిడ్ డ్రోస్టానోలోన్ ఉన్నట్లు తేలింది. దీంతో నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(నాడా) సంజితపై నిషేధం విధించింది. ఆ క్రీడల్లో సంజిత రజత పతకాన్ని సాధించింది. దీంతో ఆమె సాధించిన పతకాన్ని నాడా వెనక్కి తీసుకోవడంతోపాటు ఏ ఈవెంట్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది. ఈ నిషేధం 2022 అక్టోబర్ నుంచి అమల్లోకి ఉంటుందని నాడా ఆ ప్రకటనలో పేర్కొంది.

సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా చేతన్ శర్మ కొనసాగింపు



ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) సీనియర్ పురుషుల సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా చేతన్ శర్మ మరోదఫా కొనసాగనున్నారు. డిసెంబర్‌తో చేతన్ శర్మ రెండేళ్ల పదవీకాలం పూర్తి కాగా.. మరో రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నట్లు సులక్షణా నాయక్, అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపేలతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ(సిఏసి) శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా శివ్ సుందర్ దాస్, సుబ్రతో బెనర్జీ, సలీల్ అంకోలా, శ్రీధరన్ శరత్ నియమితులయ్యారు.

దుబాయ్ ఓపెన్ తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై: సానియా మీర్జా



హైదరాబాద్ : ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ టోర్నీ అనంతరం టెన్నిస్ నుంచి పూర్తిగా వైదొలగనున్నట్లు భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తెలిపింది. డబ్ల్యూటీఏ వెబ్‌సైట్‌కు శనివారం ఓ ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించింది. త్వరలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడతానని, ఆ తర్వాత ఫిబ్రవరిలో దుబాయ్ వేదికగా జరిగే డబ్ల్యూటీఏ-1000 తన కెరీర్ ఆఖరి టోర్నీని అని స్పష్టం చేసింది. గాయం కారణంగా తన కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడకుండా జాగ్రత్తపడుతున్నట్లు సానియా ఈ సందర్భంగా పేర్కొంది. పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు ప్రస్తుతం శిక్షణలో ఉన్నట్లు తెలిపింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68